


www.prajapakshamin

PRAJAPAKSHAM ★★★

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




సంపుటి 08, సంచిక: 183 | సోమవారం | 02-06-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00







# జనరల్
STATE & REGIONAL NEWS

## నిమ్స్‌లో చెన్నయ్యను పరామర్శించిన సిపిఐ నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన చెన్నయ్యను ఆదివారం నిమ్స్ ఆసుపత్రిలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. వయో భారంతో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చెన్నయ్య నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను చాడ వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావులు పరామర్శించి ధైర్యం చెప్పారు. చెన్నయ్యను పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మారపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమాన్ , అంజయ్య ఉన్నారు.

# అన్నదాతకు వెన్నుదన్నుగా రైతు కమిషన్

బి.అంజన్ కుమార్



రాష్ట్ర అవతరణం ప్రత్యేకం

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ అన్నదాతలకు వెన్నుదన్నుకుగా నిలుస్తోంది. రైతు సంక్షేమమే లక్ష్యంగా పంటకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో చిక్కుకుని విలవిలలాడుతున్న రైతన్నలను అక్కున చేర్చుకుంటోంది. పంటకు అతిప్రధానమైన విత్తనాలు మొదలు అధిక దిగుబడులు, పంట కోత నుంచి మార్కెట్‌లో అమ్ముకునే వరకు రైతన్నకు ఎదురువుతున్న సమస్యలపై రైతు కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. అన్నదాతలకు అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తోంది. 'జై జవాన్... జై కిసాన్' దేశ నినాదమైతే రైతే రాజు అంటూ రాష్ట్రాలు ఉదరగొడుతుంటాయి. కానీ వారి సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వాలు మాత్రం చాలా తక్కువే. ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న రైతులకు నిజంగా బాసటగా నిలిచే వ్యవస్థ మాత్రం లేనేలేదని చెప్పాలి. చట్టాలు, కోర్టులు, ప్రభుత్వాలు ఎన్ని ఉన్నప్పటికీ అన్నదాతది అనునిత్యం ఒంటరి పోరాటమే. నిరక్షరాస్యులైన రైతును విత్తన, పురుగుమందు కంపెనీలు, దళారులు, అధికారులు ఇలా అన్ని వర్గాల వారు మోసం చేస్తూనే వున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వరకు గత ప్రభుత్వాలు రైతులకు ఆశించిన స్థాయిలో మేలు చేయలేకపోయారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయడం ద్వారా కొంత అండగా నిలిచింది. 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ తన 10 ఏళ్ల పాలనలో రైతులకు లక్ష రూపాయల రుణాలను గుడ్డిలో మెల్లగా 4 విడతల్లో మాఫీ చేసి మమ అనిపించింది. అనంతరం 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల వరకు ఉన్న రైతుల రుణాలను ఏక కాలంలో మాఫీ చేయడం ద్వారా అన్నదాతలకు కొండంత అండగా నిలిచింది. 2024 అక్టోబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలతో తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ పురుడుపోసుకుంది.

**రైతుల అభ్యున్నతికి ప్రభుత్వానికి ఎన్నెన్నో సిఫార్సులు**

క్షేత్రస్థాయిలో ఆదర్శ రైతు వ్యవస్థ మళ్లీ తీసుకువచ్చేలా రైతు కమిషన్ కృషి చేస్తోంది. ఇందుకు సంబంధించి సిపార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడం, ప్రభుత్వం సైతం రెండు మూడు రోజుల్లో ఈ వ్యవస్థను తిరిగి తీసుకువచ్చేందుకు ఆదేశాలు సైతం జారీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అదేవిధంగా రైతుల సంక్షేమం కోసమే ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖలో ఆ పదం లేకపోవడం అసంపూర్తిగా ఉన్నట్లు రైతు కమిషన్ గుర్తించింది. తమ కోసమే ఈ శాఖ ఉన్నదన్న భావన రైతుల్లో కలగాలంటే వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేయాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేయడం, ఇందుకు ప్రభుత్వం కూడా సుముఖత వ్యక్తం చేయడంతో ఈ పేరు కూడా తర్వలోనే మారబోనుంది. అదేవిధంగా గ్రామాల్లో పంటలు పండాలంటే క్షేత్రస్థాయిలోని నీటివనరులే ప్రధాన. వాటిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా పంటలకు సమృద్ధిగా నీరు అందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న విధంగా మైనర్ ఇరిగేషన్ శాఖను తిరిగి ఏర్పాటు చేయాలని రైతు కమిషన్‌కు సూచనలు చేసింది. దీంతో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మేజర్ ఇరిగేషన్‌లో విలీనం చేసిన మైనర్ ఇరిగేషన్ తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించింది. చెరువులు అన్యాక్రాంతం కాకుండా చెరువులను రక్షించుకునే బాధ్యత గ్రామాల్లో ఉండే రైతులకే అప్పగించాలని దానికోసం రైతులతో నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని సైతం కమిషన్ ప్రభుత్వానికి సిపార్సు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు సైతం త్వరలోనే వెలువడే అవకాశాలున్నాయని వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుల సమాచారం.

**రైతన్న సంక్షేమమే లక్ష్యంగా ముందుకు :**

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పడి నాటి నుంచి రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందకు సాగుతోంది. ఇందులో భాగంగా గడిచిన 8నెలల కాలంలో రాష్ట్రంలోని 32 జిల్లాల పర్యటనలు, క్షేత్ర స్థాయిలో వ్యవసాయ పంటపొలాల పరిశీలన, రైతులతో ముఖాముఖి, తద్వారా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి రైతుల వాణిని ప్రభుత్వం ముందు పెట్టడం ద్వారా రైతుల సమస్య పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తోంది. మరోవైపు రాష్ట్రంలో సేంద్రియ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి కమిషన్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రణాళికల రూపకల్పనకు సలహాలను అందిస్తోంది. ఉద్యాన పంటల సాగు పెంచడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వాని సూచనలు ఇవ్వడమే. రంగారెడ్డి జిల్లా యాచారంలో వందల ఎకరాల్లో సాగవుతున్న కూరగాయల తోటలను సందర్శించి అధ్యయనం చేసింది. ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో కూరగాయల సాగు చేపట్టడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, చర్యలపై ప్రభుత్వానికి, ఉద్యానవన శాఖ అధికారులకు సలహాలు సూచనలను రైతు కమిషన్ అందించింది.

**మార్కెట్ యార్డులో దళారుల దందాకు అడ్డుకట్ట :**

ఎంతో కష్టపడి పంట పండించిన రైతులు వాటిని అమ్ముకోవడం కూడా పెద్ద సవాల్‌గా మారిన తరుణంలో రైతు కమిషన్ వారికి అండగా నిలుస్తోంది. మార్కెట్ యార్డులో రైతన్నలను నిలువు దోపిడీకి గురిచేస్తున్న దళారుల ఆట కట్టించడంలో రైతు కమిషన్ క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడుసార్లు పర్యటించిన కమిషన్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించి అక్కడి లోపాలు పత్తికొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు ఎత్తిచూపింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోళ్ల సమయంలో జరుగుతున్న దళారుల దందా, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేసింది. అంతేకాకుండా సిసిఐపై కేంద్రానికి ఫిర్యాదుచేసి అక్కడ దళారులు అవినీతి అధికారుల ఆట కట్టించింది.

**పసుపు బోర్డు సరే... ధర సంగతి ఏమిటి ?**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటులో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కీలకపాత్ర పోషించింది. ఇదే సమయంలో పసుపు బోర్డు ఏర్పాటు సరే... సరైన ధర సంగతి ఏమిటని కేంద్రాన్ని ప్రశ్నించింది. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో పసుపుకు అధిక ధర లభిస్తుంటే తెలంగాణలో మాత్రం తక్కువ ధర రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇందుకు నిజామాబాద్ రైతులు పండిస్తున్న పసుపులో కురుకుమిన్ తక్కువగా ఉండడమేనని రైతు కమిషన్ గుర్తించింది. దీంతో కురుకుమిన్ అధికంగా ఉండే కేరళలోని ఏరోడ్ విత్తనాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా భూమిలో నుంచి పసుపును తీయడం, ఉడకపెట్టడం, పాలిష్ చేయడంలో అధునిక యంత్రాలు అవసరమని, ఇవి అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రానున్న సీజన్‌లో వాటిని వీటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరింది. నకిలీ విత్తనాలతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతు కమిషన్ ఆశ్రయించిన వెంటనే స్పందిస్తోంది.

**మల్టీనేషనల్ కంపెనీలను దిగొచ్చేలా చేసిన రైతు కమిషన్**

సీడ్‌బౌల్ ఆఫ్ తెలంగాణగా పిలుచుకునే రాష్ట్రంలో రైతన్నకు నాణ్యమైన విత్తనం దొరకడమే కరువైంది. నాణ్యమైన విత్తనం అనేది రైతు హక్కు కాగా, బహుళజాతి సంస్థల మాయాజాలంతో వారి నకిలీ విత్తనాలతో నష్టపోతూనే ఉన్నారు. ఇదే క్రమంలో తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ దీనిపై దృష్టి సారించింది. ఇదే క్రమంలో ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు, కన్నాయి గూడెం మండలాల్లో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న విత్తనోత్పత్తి సాగు జరుగుతుండగా, ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో మల్టీనేషనల్ సీ సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు కలిసి ఏండ్ల తరబడిగా ఏజెన్సీ ప్రాంత రైతులను మోసం చేస్తున్న విషయం కమిషన్ దృష్టి రావడంతో తక్షణమే స్పందించిన రైతు కమిషన్ సీడ్ కంపెనీల మోసాలు అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంది. ఇక సూర్యాపేటలో కూడా వరి రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారు. వారికి కూడా కమిషన్ ముందుండి నష్టపరిహారం దక్కేలా చర్యలు చేపట్టింది. కమిషన్ చర్యలకు నకిలీ విత్తనాల కంపెనీలు తోక ముడుచుకుంటున్నాయి.

## పదేళ్ల తర్వాత అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సుమారు పదేళ్ల తర్వాత అధికారికంగా 'తెలంగాణ తల్లి ' విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో 2024 ఆగస్టు 28న తెలంగాణ తల్లి విగ్రహ భూమిపూజ చేశారు. అనంతరం 2024 డిసెంబర్ 9న 17 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' గేయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించారు.

## తెలంగాణ అప్పు రూ.7,38,707కోట్లు

ఇదివరకు చేసిన అప్పునకు అసలు, వడ్డీ కలిపి చెల్లించింది రూ.1,53,359 కోట్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం రూ.7,38,707కోట్ల అప్పు ఉన్నది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 2023 డిసెంబర్ 1 నాటికి రూ.6,69,257 కోట్ల అప్పు చేసినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత 2023, డిసెంబర్ 2వ తేదీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది, ఫిబ్రవరి 28వ తేదీ వరకు రూ.1,58,041 కోట్ల అప్పు చేసింది. దీంతో తెలంగాణ రాష్ట్ర అప్పు మొత్తం (2025, ఫిబ్రవరి 28వరకు) రూ.8,27,298 కోట్లకు చేరింది. ఇందులో 2023 డిసెంబర్ 4వ తేదీ నుంచి ప్రస్తుత ఏడాది ఫిబ్రవరి వరకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రూ.88,591కోట్లను చెల్లించింది. అలాగే ఇదివరకు తీసుకున్న అప్పునకు వడ్డీ రూ.64,768కోట్లను చెల్లించింది. దీంతో ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర అప్పు రూ.7,38,707 కోట్లుగా ఉన్నది.

## ఏడాదిన్నర పాలనలో 58,868 ఉద్యోగాల భర్తీ

4.8 శాతం తగ్గిన నిరుద్యోగ రేటు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఏడాదిన్నర కాలంలో 58,868 ఉద్యోగ నియామకాలు చేపట్టారు. 2023 జులై నుంచి 2024 సెప్టెంబర్ వరకు నిరుద్యోగ రేటు 22.9 శాతం నుంచి 18.1 శాతానికి (4.8 శాతం) తగ్గింది. కొత్తగా 30,228 పోస్టులను మంజూరు చేసింది. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలను టిజిపిఎస్‌సి విడుదల చేసింది. గ్రూప్ 1లో 563 పోస్టులు, గ్రూప్ 2లో 783 పోస్టులు, గ్రూప్ 3లో 1365 పోస్టులకు నియామక పత్రాలు అందించనున్నారు. కాగా 14,236 అంగన్ వాడీ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. రెవెన్యూ శాఖలో 10,954 గ్రామ పరిపాలనా అధికారులు, జెడ్‌పి,మండల పరిషత్తుల్లో 524 ఆఫీసు సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్ గ్రేడ్ చేశారు. 58 జూనియర్ అసిస్టెంట్ సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించినట్టు ప్రభుత్వం తెలిపింది. బిఆర్‌ఎస్ పాలనలో ఒకేసారి టీచర్ల నియామకం చేపట్టారని, 7857పోస్టులను మాత్రమే భర్తీ చేయగా, ప్రజాప్రభుత్వంలో తొలి ఏడాదిలోనే 11,062 పోస్టులతో మెగా డిఎస్సీని నిర్వహించినట్టు ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి.

**శాఖల వారీగా ఉద్యోగ నియామకాలు :** వ్యవసాయ, సహకార శాఖ (208), పశు సంవర్ధక, మత్స్య, డెయిరీ (173), బిసి సంక్షేమం శాఖ(5578), ఇంధన శాఖ(850), వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం(7517), ఉన్నత విద్య, సాంకేతిక విద్యా శాఖ(3893),హోం శాఖ(15526), నీటి పారుదల(1235), మైనార్టీ సంక్షేమం(1548), పురపాలక, పట్టణాభివృద్ధి (3148), రెవెన్యూ శాఖ (2696), ఎస్‌సి అభివృద్ధి (2235), విద్యాశాఖ (10209), రవాణా, రోడ్లు, భవనాలు(442), ఎస్‌టి సంక్షేమ శాఖ (1290), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి(722), ఉపాధి కార్మిక (128), ఇతర శాఖలు (512), పంచాయతీరాజ్, మున్సిపల్(922) రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం58,868 పోస్టలును భర్తీ చేశారు.

# అంగన్‌వాడీల ఆధునీకరణ

టీచర్లకు పదోన్నతులు.. వేతనాల పెంపు
అనేక కార్యక్రమాల అమలుకు
మహిళా శిశు సంక్షేమ శాఖ శ్రీకారం



ప్రజాపక్షం/హైదరాబాద్ : అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ నుంచి, బాలల ఆరోగ్యానికి ప్రత్యేక యత్నాలు, దివ్యాంగుల అభ్యున్నతి వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అనేక సంక్షేమ పథకాలను, వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 'అమ్మ మాట అంగన్ వాడీ బాట' నినాదంతో ప్రత్యేక డ్రైవులను నిర్వహిస్తూ, చిన్నారుల సంఖ్యను గణనీయంగా పెంచారు. రాష్ట్ర వ్యాప్తంగా మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చి, 3,438 మంది టీచర్లకు పదోన్నతులను కల్పించడంతోపాటు వారి వేతనాలను రూ.7,800 నుంచి రూ.13,650లకు పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలిసారి అంగన్‌వాడీలకు వేసవి సెలవులను ప్రకటించారు. హాంరేషన్ ద్వారా సరుకుల పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14,000లకు పైగా ఖాళీల భర్తీ కోసం చర్యలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల రిటైర్‌మెంట్ ప్రయోజనాలు రెట్టింపు, టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.1లక్ష పెంచారు. చిన్నారులకు ఆకర్షణీయ వాల్ పెయింటింగ్, రెండు జతల యూనిఫామ్‌లను, చౌకిలు, బుక్రాక్స్, మ్యాట్స్‌తో మోడరన్ తరహాలో అభివృద్ధి చేశారు. ప్రతి కేంద్రంలో తాగునీటి ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటివరకు మొత్తంగా 1876 మరుగుదొడ్లను నిర్మించారు. పూర్వ ప్రాథమిక విద్య కోసం ప్రత్యేక సిలబస్‌ను రూపొందించి, టీచర్లకు శిక్షణ పూర్తిచేశారు. బాలల సంరక్షణ, ఆరోగ్యంపై దృష్టి పెట్టనున్నారు. అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, ఉచిత వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు రోజూ 200 మిల్లీ లీటర్ల పాలను పంపిణీ చేయనున్నట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి. 'ఇందిరమ్మ అమృతం' పథకం ద్వారా బాలికల్లో రక్తహీనత నివారణ కోసం శక్తినిచ్చే చిరుధాన్యాల పంపిణీ చేస్తున్నారు. దివ్యాంగులకు వార్షికంగా రూ.50 కోట్లతో పరికరాలను పంపిణీ చేశారు. జాబ్ పోర్టల్, పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం ద్వారా 87 మందికి ఉద్యోగావకాశాలను కల్పించారు. 18 మంది దివ్యాంగులకు డైరెక్టరేట్‌లో మహిళా కాల్ సెంటర్లలో ఉపాధి అవకాశాలను కల్పించినట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. దివ్యాంగులకు జాబ్ పోర్టల్, పోటీ పరీక్షల కోచింగ్, పరికరాల పంపిణీతో పాటు వివాహ కానుక వర్తింపజేయనున్నారు. వృద్ధుల సంక్షేమానికి వృద్ధుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. తుది దశలో 37 డేకేర్ సెంటర్ల ఏర్పాటు, ప్రతి కేంద్రంలో కనీసం 50 మందికి సేవలు అందేలా కార్యాచరణను రూపొందించారు. బాలల కోసం బాలుర హక్కుల కమిషన్‌ను నియమించగా, శిశు గృహాలు, బాలసదనాల్లో సిసి కెమెరాలు, డైరెక్టరేట్ నుంచి మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

**ట్రాన్స్‌జెండర్ మైనారిటీల సంక్షేమం :**

ట్రాన్స్‌జెండర్ మైనార్టీల నిమిత్తం 33 జిల్లాల్లో మైత్రి హెల్త్ కేర్ క్లినిక్‌ను ఏర్పాటుచేశారు. అలాగే వారిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించారు.

**మహిళలకు నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలు :**

మహిళలకు నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలు కల్పించారు. మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణతో పాటు ఆటో/కారు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మహిళా ప్రాంగణాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వీటిని సక్రమంగా అమలు చేస్తే గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులు

ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ.స్టాలిన్




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఏ సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు ఇచ్చే సాధనం విద్యేనని అంతటి ప్రాధాన్యత కలిగిన విద్యా వ్యవస్థను నేటి పాలకులు భ్రష్టుపట్టుస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ. స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని విద్యార్థుల పట్ల వివక్షపూర్తిగా మాట్లాడం గర్హనీయమని, ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఆదివారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్రలను అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం–2020 పేరుతో విద్యా కార్పొరేటీకరణ, విద్యాకేంద్రీకరణ, కాషాయీకరణ చేయాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షిణికి చిత్తశుద్ధి ఉంటే బాధ్యతారహితమైన మాటల పట్ల వెంటనే క్షమాపణ చెప్పాలని, వారిని ప్రభుత్వం విధులు నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్, బానోత్ రఘురాం, గ్యార క్రాంతి, రహమాన్, బరిగల వెంకటేష్, బాలసాని లెనిన్, కాసోజ్ నాగజ్యోతి, రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, మచ్చ రమేష్, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, భాషబోయిన సంతోష్, ముదిగొండ మురళికృష్ణ, కుమ్మరి సాగర్, జోసెఫ్, ప్రవీణ్, వి. ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, దినకర్, నరేష్, చరణ్, ఉప్పల ఉదయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గుర్తింపుతో బాధ్యత మరింత పెరిగింది

డిజిపి జితేందర్

బిరుదరాజు వాసుదేవరాజు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ పోలీసులకు పలు అంశాలలో జాతీయ గుర్తింపు లభించడంతో రాష్ట్ర పోలీసులపై మరింత బాధ్యత పెరిగిందని డిజిపి డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన 'ప్రజాపక్షం' ప్రతినిధితో మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీసుల పనితీరు, బాధితుల కోసం తీసుకుంటున్న చర్యలు, మావోయిస్టు, ఉగ్రవాదుల నిరోధం, డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్, సైబర్ నేరాలతో పాటు పలు అంశాలను ఆయన వెల్లడించారు. 2025లో తెలంగాణ పోలీసులు అనేక ముఖ్యమైన విజయాలు సాధించిందని తెలిపారు. నేరాల నివారణ, ప్రజల భద్రత, సాంకేతికతను వినియోగించడంలో దేశంలోనే తెలంగాణ పోలీసులు ముందున్నారన్నారు. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్– 2025'లో ప్రథమ స్థానం సాధించడంతో తెలంగాణ పోలీసులు జాతీయ గుర్తింపు పొందారని అన్నారు. టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో విడుదలైన ఇండియా జస్టిస్ రిపోర్ట్–2025లో, తెలంగాణ పోలీస్ శాఖ 18 పెద్ద రాష్ట్రాల్లో మొదటి స్థానాన్ని సాధించిందన్నారు. విజిబుల్ పోలీసింగ్, త్వరిత స్పందన, సాంకేతిక వినియోగం, పోస్కో కేసుల్లో అధిక దోషి శిక్షలు, సైబర్ నేరాలపై దృష్టి, మాదకద్రవ్యాలపై జీరో టోలరెన్స్ విధానం వల్ల మన పోలీసులకు జాతీయ స్థాయిలో మొదటి స్థానం దక్కిందన్నారు. మే 29న సూర్యాపేట పోలీసులు ఇంటర్‌స్టేట్ బేబీ సెల్లింగ్ రాకెట్‌ను బస్టింగ్ చేసి, 13 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో 10 శిశువులను రక్షించారు. తెలంగాణ యాంటీనార్కోటిక్స్ బ్యూరో మహారాష్ట్రలోని ఉమర్గ, ఖరాడ్ ప్రాంతాల్లో 100 కిలోల ఆల్ప్రాజోలామ్, 338 కిలోల కెమికల్స్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ రాకెట్‌లో 6 మందిని అరెస్ట్ చేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) లావోస్, మయన్మార్ నుండి వచ్చిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసింది. ములుగు జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఐఇడి పేలుళ్ల కేసులను ఎన్ఐఎ ఛేదించింది. ఈ కేసుల్లో 20 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 7 జోన్లలో జోనల్ సైబర్ సెల్స్ (జెడ్‌సిసిఎస్) ఏర్పాటు చేశారు. ఇవి చిన్న మొత్తాల సైబర్ నేరాల విచారణను వేగవంతం చేస్తాయి. పోలీసుల చర్యల వల్ల 2025లో సైబర్ మోసాల వల్ల నష్టాలు రూ.542 కోట్ల నుండి రూ.437 కోట్లకు తగ్గాయి. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) దుబాయ్‌లో జరిగిన వరల్డ్ పోలీస్ సమ్మిట్ 2025లో 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీనార్కోటిక్స్ అవార్డు'ను పొందింది. ఫిబ్రవరి 2025లో జార్ఖండ్‌లో జరిగిన 68వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీస్ శాఖ మొత్తం 18 పతకాలు సాధించి, ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మే 5న జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో జరిగిన రియల్ హీరోస్ అవార్డ్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ పోలీసుల సేవలను ప్రశంసించారు. ఈ విజయాలు తెలంగాణ పోలీసుల నిబద్ధత, సమర్థత, ప్రజల భద్రతపై వారి కృషిని ప్రతిబింబిస్తాయి. వారు దేశంలోనే అత్యుత్తమ పోలీస్ శాఖగా నిలిచారు. మహిళల భద్రత కోసం టిసేఫ్‌ను ఆవిష్కరణ చేశారు. సిఎం ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా మంచిరేవులోయంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించారు. 44 మంది ట్రాన్స్ జెండర్లను హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించారు. రాష్ట్ర పోలీస్ విభాగం 133 బెట్టింగ్ ఏజెన్సీలు, నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది.

## కెసిఆర్ కుటుంబం డ్రామా

కవిత లేఖపై టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ప్రజాపక్షం / హైదరాబాద్ : బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత లేఖ రాయడం, కెసిఆర్ ఇంట్లో పంచాయితీ తదితర అంశాలు కెసిఆర్ కుటుంబం ఆడుతున్న డ్రామా అని టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజలు కెసిఆర్‌ను మర్చిపోయారని, ప్రజల దృష్టిని మరల్చడానికే వారు ఈ డ్రామాకు తెరలేపారన్నారు. కెసిఆర్ రాజకీయ జీవితం ఫ్లైట్ మోడ్‌లో పడిందని, బిఆర్‌ఎస్ నేతలు ఎంత లేపినా లేవడం సాధ్యం కాదన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవిత రాసిన లేఖను లీక్ చేస్తే కెసిఆరే చేయాలని, లేదంటే కవిత లీక్ చేయాలని, వేరే వారు లీక్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల 20 లక్షలు ఎకరాలు కాదు, 20 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదన్నారు. కాళేశ్వరంలో నీటి ఎత్తిపోతల పథకం కాదని, డబ్బుల ఎత్తిపోతల పథకం చేసి వేల కోట్లు దండుకున్నారన్నారు. కాళేశ్వరంపై విచారణ జరుగుతున్నదని, కవిత మాదిరిగా వారు కూడా జైలుకు పోతారన్నారు. కెసిఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్లే అంటున్నారని, జాగృతి పేరుతో కవిత ప్రభుత్వ సొమ్ము వందల కోట్లు ఖర్చు పెట్టారని, జాగృతి కవిత జైలుకు ఎందుకు పోయిందో చెప్పాలన్నారు.

అమరవీరులకు అరుణాంజలి
రూ|| 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 183 | సోమవారం | 02-06-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


### లోతుగా విశ్లేషించిన తరువాతే

# లబ్ధిదారుల గుర్తింపు



**ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువవికాసం ద్వారా ప్రయోజనం చేకూరొద్దు**

- ఈ అంశంపై ఈనెల 5న కేబినేట్ నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం
- మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపైనా చర్చిస్తాం
- మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ
- రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సదస్సులు, వానాకాల పంటల సాగు సన్నద్ధతపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్

మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 5న నిర్వహించి పలు కీలక అంశాలపైన చర్చించాలని మంత్రుల సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వాన కాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై ఈ సమావేశంలో చర్చించారు. మే 29, 30వ తేదీలలో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాను, రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై సమావేశంలో వివరించారు. రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందాయని,

తరువాయి 6లో



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనేపథ్యంలో సిఎం మంద కృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

# నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. సోమవారం ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సవాలు జరుపనున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఈ సారి రాష్ట్ర అవతరణ వేడుకలకు జపాన్‌లోని కితక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేచీ అతిధిగా రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా జిల్లాలకు ప్రభుత్వం ఇన్‌చార్జీలను నియమించనున్నారు.ఆ జిల్లా ఇన్‌చార్జ్‌లు జెండాను ఎగరవేస్తారు.జూన్2 రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సందర్భంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లను కూడా ప్రారంభించనున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని రాజకీయ పార్టీలు, పలు ప్రాంతాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో కితాక్యుషూ సిటీని సందర్శించిన

తరువాయి 6లో







**అవతరణ దినోత్సవ ప్రత్యేక వ్యాసాలు లోపలి పేజీల్లో**

జయ జయహే తెలంగాణ జననీ
జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

జానపద జనజీవన జావళీలు జాలువార
కవిగాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృతపరచే గీతాల జనజాతర
అనునిత్యము నాగానం అమ్మనీవే మా ప్రాణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిన్ను తడుపంగా
పచ్చని మా నేలల్లో పసిడిసిరులు పండంగా
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి
ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

## ఆగని గోవుల మృత్యు ఘోష

రాజన్న ఆలయ గోశాలలో మరో ఐదు కోడెలు మృతి

ప్రజాపక్షం/వేములవాడ

దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆవుల మృత్యుఘోష ఆగడంలేదు. సనాతన కాలం నుండి భక్తులు కోరిన కోరికలు తీర్చే కొండంత దేవుడుగా భావించి రాజరాజేశ్వర స్వామికి నిజ కోడెలు, గోవులను ఆలయానికి సమర్పిస్తూ ఉంటారు. ఈ విధంగా దేవాలయానికి

తరువాయి 6లో



## 9 మందికి శౌర్య పతకాలు



16 మందికి మహోన్నత సేవా పతకాలు

పోలీసు సేవా పతకాలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సేవా పతకాలను ప్రకటించింది. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేసిన మొత్తం 625 మందికి పతకాలు లభించనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో గ్రేహౌండ్స్‌కు చెందిన 9 మందికి శౌర్య పతకం దక్కింది. 16 మందికి మహోన్నత సేవా పతకం, 92 మంది ఉత్తమ సేవా పతకానికి అర్హులయ్యారు. అలాగే 47 మందికి కఠిన సేవా పతకం, 461 మంది సేవా పతకానికి ఎంపికయ్యారు. అవినీతి నిరోధక శాఖ(ఎసిబి)లో ఒకరికి మహోన్నత సేవా, నలుగురికి ఉన్నత సేవా,

తరువాయి 6లో

### రాష్ట్ర రాజకీయాల్లో కుటుంబ డ్రామా

సూత్రధారులం, పాత్రధారులం కావాల్సిన అవసరం లేదు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ డ్రామా నడుస్తోందని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి అన్నారు. తాము సూత్రదారులం, పాత్రదారులం కావాల్సిన అవసరం లేదన్నారు. దోచుకున్న దానిని పంచుకోవడానికే కల్వకుంట్ల ఫ్యామిలీలో గొడవ జరుగుతోందని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో ఆదివారం పదాదికారులు, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులకు సమావేశం

తరువాయి 6లో

### శాంతి చర్చలు జరిపేందుకు

# అభ్యంతరమేమిటి?

రౌండ్ టేబుల్ సమావేశంలో కేంద్రాన్ని నిలదీసిన పలువురు వక్తలు

కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న నరమేధాన్ని పౌరసమాజం ఖండించాలని పిలుపు

ప్రజాపక్షం/ హైదరాబాద్





దేశ ప్రజలను నిర్ధాక్షిణ్యంగా కాల్చి చంపిన ఉగ్రవాదులతో చర్చలకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం, భారతదేశ ప్రజలైన మావోయిస్టులతో శాంతి కోసం చర్చలు జరపడానికి అభ్యంతరమేమిటని పలువురు వక్తలు ప్రశ్నించారు. తాము చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఏ మాత్రం మానవత్వం లేకుండా మావోయిస్టులను, ఆదివాసీ బిడ్డలను ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రాణాలను హరిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ఖనిజ, అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకే 'ఆపరేషన్ కగార్' పేరిట కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న నరమేధాన్ని పౌర సమాజం తీవ్రంగా ఖండించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం తెలంగాణ రాష్ట్ర శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ,

తరువాయి 6లో

# గాజాలో యుద్ధాన్ని నిలిపేయాలి

ఐక్యరాజ్యసమితి కృషి చేయాలి

జులై 9వ తేదీ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ పిలుపు

22 తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం




**జైపూర్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మికసంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు జులై 9 వ తేదీ నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడంలో ఎఐటియుసి శ్రేణులు కీలక భూమిక పోషించాలని ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ సమావేశం పిలుపు ఇచ్చింది. జైపూర్‌లో మూడురోజులపాటు జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిసాయి. ముగింపు సమావేశంలో అధ్యక్షుడు రామేంద్ర కుమార్ మాట్లాడుతూ జులై 9 వ తేదీ సమ్మె మాత్రమే మన తక్షణ కర్తవ్యమని, అనుబంధ సంఘాలు తమ పూర్తి శక్తి సామర్థ్యాలను వినియోగించి రెట్టింపు ఉత్సాహంతో సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ మాట్లాడుతూ ఐక్యవేదిక భాగస్వామ్య సంఘాలు ఉన్నచోట్ల కూడా దేశంలో అత్యధిక సంఖ్యాక సభ్యత్వం కలిగిన ట్రేడ్ యూనియన్ శక్తిగా ఎఐటియుసి ప్రధాన బాధ్యత తీసుకుని సమ్మెను విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. మూడు రోజుల సమావేశాలకు 24 రాష్ట్రాల నుండి 223 మంది సభ్యులు,15 మంది ఆహ్వానితులు హాజరయ్యారని, చర్చలో 53 మంది ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారని, 22 తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించిందని అమర్ జీత్ కౌర్ వెల్లడించారు. 2026 లో జరగాల్సిన ఎఐటియుసి 43వ జాతీయ మహాసభలకు ఇప్పటినుండి సన్నద్ధం కావాలని అమర్ జీత్ కౌర్ కోరారు. 1973 మే 31 వ తేదీన జరిగిన విమాన ప్రమాదంలో కన్నుమూసిన ఎఐటియుసి సీనియర్ నేతలు మోహన కుమార మంగళం, బాల దండాయుధం, సతీష్ లుంబా తదితరులకు జనరల్ కౌన్సిల్ నివాళులు అర్పించింది. వారి సేవలను సమావేశం స్మరించింది. గాజాలో కొనసాగుతున్న క్రూరమైన యుద్ధాన్ని బేషరతుగా నిలిపివేయదానికి ఐరాస కృషి చేయాలని ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. గాజా లో గత 700 రోజులుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంలో ఇప్పటికే 54 వేలమంది పాలస్తీనియన్

తరువాయి 6లో

## అనర్హులకు వద్దు ... ఇందిరమ్మ కమిటీయే ముద్దు



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అడకత్తెరలో పోకచెక్కలా అధికారుల పరిస్థితి

పంపిణీలో పేదలకు అందని లబ్ధి

ప్రజాపక్షం/ఖమ్మం

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. క్షేత్రస్థాయి రాజకీయ ఒత్తిళ్లు, ప్రభుత్వ నిబంధనల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. మూడు రోజుల క్రితం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మంత్రులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సస్పెన్షన్‌తో సరిపెట్టబోమని కూడా హెచ్చరించారు. ఆ హెచ్చరికలో భాగంగానే అనర్హులకు వద్దంటూనే గ్రామాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీ సిఫారసులే ముద్దంటూ తేల్చి చెప్పాయి. ఇక్కడే సమస్య మొదలైంది. ఇందిరమ్మ గ్రామ కమిటీలు 99 శాతం రాజకీయ పక్షపాత ధోరణితోనే లబ్ధిదారుల జాబితాను అందిస్తున్నాయి. ఇందులో మరో ఆలోచనకు అవకాశం లేదు. అధికార పార్టీలో ఉన్న నేతలు పంచుకోవడం లేదా ఎక్కడైనా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసిన తమ అనుకూలమైన వారిని ఎంపిక చేసుకోవడం జరుగుతుంది. ఇందిరమ్మ గ్రామ కమిటీల రాజకీయ

తరువాయి 6లో

## రిజిస్ట్రేషన్‌లు ఇక సులభం




నేటినుంచి అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు

'ఎఐ' సేవలను ఉపయోగిస్తున్నాం

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ (ఎఐ) సేవలను ఉపయోగించుకుని ప్రజలకు మరింత సులువైన, సమర్థవంతమైన సేవలను అందించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సోమవారం నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌ను అమలు చేయనున్నట్టు తెలిపారు. 'స్టాంప్స్,రిజిస్ట్రేషన్ అధికారులతో మంత్రి పొంగులేటి ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ అనుసంధానంతో కూడిన' చాట్బాట్ మేధ'

తరువాయి 6లో

### ఈశాన్య రాష్ట్రాల్లో వరద బీభత్సం

### సైనిక, విదేశాంగ విధాన వ్యూహంపై చర్చించాలి

### 3 వేలకుపైగా 'కొవిడ్' కేసులు

05

# సకల జనులు ఉద్యమిస్తే వచ్చింది తెలంగాణ రాష్ట్రం!

బ్రిటిష్ పాలనను 1947లో అంతమొందించి భారతదేశం స్వాతంత్ర్యం సాధించినప్పటికీ, తెలంగాణ, మరాఠా, కన్నడ ప్రాంతాలతో కూడిన హైదరాబాద్ సంస్థానం ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో స్వతంత్ర రాజ్యంగా కొనసాగింది. నిజాం పాలన మొత్తం భూస్వామ్య విధానంపై ఆధారపడి ఉండేది. రైతులపై భారీ మొత్తంలో పన్నులు విధించి బలవంతపు వసూళ్లు చేసే వారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల దగ్గర పేదలు వెట్టి చాకిరీ చేయాల్సి వచ్చేది. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా 1946లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఆరంభమై రైతులతో పాటు ప్రజలందరూ ఏకమై జమీందార్లు, జాగీర్దార్లు, నిజాం సైన్యం(రజాకార్లు)పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ పోరాటం కాలక్రమేణా భూసంస్కరణలు, సామాజిక సమానత్వం కోసం ఒక శక్తివంతమైన ఉద్యమంగా మారింది. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో మొదలైన ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించింది. ఈ ఉద్యమంలో రావి నారాయణ రెడ్డి, మాగ్దూమ్ మొహియుద్దీన్, ఆరుట్ల రామచంద్రారెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, చాకలి ఐలమ్మ వంటి నాయకులు కీలక పాత్రను పోషించారు. వీరు గ్రామాల్లో భూస్వాముల చెరలో ఉన్న భూముల్ని, పంటల్ని రైతులకు పంచి బానిస సంకెళ్ళ నుండి విముక్తి కల్పించే ప్రయత్నం చేశారు.

**స్వతంత్ర భారతంలో హైదరాబాద్ రాష్ట్రం..**

1948లో భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానంపై 'ఆపరేషన్ పోలో'ను ప్రారంభించింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం ఓటమిని అంగీకరించడంతో హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ విలీనం తెలంగాణ ప్రజలకు కొంత ఊరట కలిగించినప్పటికీ, సామాజిక, ఆర్థిక సమస్యలు కొనసాగాయి. నిజాం హయాంలో పాలితులు హిందువులు, పాలకులు ముస్లింలు. ఇక్కడ ఉర్దూ పాలనా భాషగా ఉండటం వల్ల తెలుగు మాట్లాడే ప్రజలకు విద్య, ఉద్యోగ అవకాశాలు పరిమితమయ్యాయి. ఇండియన్ యూనియన్‌లో విలీనం తర్వాత మద్రాసు, బొంబాయి తదితర రాష్ట్రాల నుండి హైదరాబాద్‌కు వలసలు మొదలయ్యాయి. 1948–1949 వరకు జె.యన్ చౌధురి నాయకత్వంలో మిలిటరీ పాలన, తదనంతరం 1950–52 వరకు సివిల్ సర్వీసు అధికారి వెల్లోడి పాలనలో హైదరాబాద్ సంస్థానం ఉండేది. 1950 దశకంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరగాలనే చర్చలు ఊపందుకున్నాయి. 1953లో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరహార దీక్ష తర్వాత మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అప్పటికి, హైదరాబాద్ రాష్ట్రం తెలంగాణ, మరాఠా, కన్నడ ప్రజలతో కలసి సంయుక్తంగానే ఉంది. 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి, బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలో కలిసే వరకు (1956) సిఎంగా రాష్ట్రానికి సేవలు అందించారు.



1955లో రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్ఆర్‌సీ) తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల కలయిక వల్ల కలిగే లాభనష్టాలతో కూడిన సిఫార్సులను కేంద్రానికి అందజేసింది. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడితే ఇరు ప్రాంతాల్లో ఉన్న వనరుల్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపింది.. కానీ అప్పటికే హైదారాబాద్ రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉంటే ఆంధ్ర రాష్ట్రం లోటు బడ్జెట్‌తో ఉండేది, ఆనాడే తెలంగాణ ప్రజల్లో కొన్ని విభాగాలు ఆంధ్ర రాష్ట్రంలో కలిస్తే తమ సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపును కోల్పోతామని భయపడి ఈ కలయికను వ్యతిరేకించారు.

**తొలిదశ జై తెలంగాణ ఉద్యమం..**

1956 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమం అనేక దశల్లో పోరాట రూపం మార్చుకున్నది కానీ పోరాటాన్ని విరమించలేదు. తెలంగాణవాదం నిత్యం నివురు గప్పిన నిప్పులా ఉండేది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత జరుగుతున్న అన్యాయాల పట్ల తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి క్రమంగా పెరిగింది. నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వబడిందనే ఆరోపణలు వచ్చాయి. వీటిని రుజువు చేస్తూ బడ్జెట్‌లో తెలంగాణ ప్రాంతానికి తక్కువ నిధులు కేటాయించడం, హైదరాబాద్ ఫ్రీ జోన్ అంటూ కొత్త భాష్యాలు చెప్పడం పరిపాటి అయింది. 1969లో ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తి 'జై తెలంగాణ' ఉద్యమంగా రూపాంతరం చెందింది. కానీ ప్రభుత్వం దీనిని అణచివేసింది. 1970 దశకంలో ఉద్యమం కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష రగులుతూనే ఉండేది. 1980లలో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ అస్థిరత, ఆర్థిక అసమానతలు తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపిరి పోశాయి. ముల్కీ (స్థానిక) నిబంధనలు పాటించకుండా అక్రమంగా వేలాది మంది సీమాంధ్రులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడినట్లు జయభారత్ రెడ్డి కమిటీ ఇచ్చిన రిపోర్టుతో బహిర్గతం అయ్యింది. ఫలితంగా తెలంగాణ 1990లలో ఉద్యమం మరింత బలపడింది. 1996లో దేవగౌడ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఎర్రకోట సాక్షిగా తాము చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ఇస్తామని ప్రకటించింది.. 1997లో కాకినాడలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో బిజెపి ఒక ఓటు రెండు రాష్ట్రాలు అనే నినాదాన్ని ఇచ్చింది.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి 2000లో ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసింది.

జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా..

**మలి దశ తెలంగాణ ఉద్యమం..**

ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో తొలి దశ తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ స్వగృహమైన జలదృశ్యంలో 2001 ఏప్రిల్ 27న కె.చంద్రశేఖర్ రావు(కెసిఆర్) తన ఎమ్మెల్యే పదవితో పాటు టిడిపి సభ్యత్వానికి కూడా రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధనే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) పార్టీని స్థాపించారు.. తదనంతరం తెలంగాణ రాష్ట్ర డిమాండ్ జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చింది. 2009లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం తర్వాత రోశయ్య ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదే సమయంలో హైదారాబాద్ ఫ్రీ జోన్ అంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల విద్యార్థి, ఉద్యోగ సంఘాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఇక తెలంగాణ స్వరాష్ట్రమే అన్ని సమస్యలకు పరిష్కార మార్గమని నీళ్ళు, నిధులు, నియామకాల్లో అన్యాయం ఇంకెన్నాళ్ళు అంటూ ఉద్యమించిన తెలంగాణ సమాజానికి మద్దతుగా 2009 నవంబర్ 29న కెసిఆర్ ఆమరణ నిరహార దీక్షకు ఉపక్రమించడం, తర్వాత డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రకటించారు.

**రాష్ట్ర ఆవిర్భావం దిశగా..**

2010లో కేంద్రం తెలంగాణ అంశంపై శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది కాలయాపన చేయడానికేనని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తూనే మరోవైపు పోరాటాన్ని కొనసాగించారు. మిలియన్ మార్చ్, పెన్‌డౌన్, సహాయ నిరాకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. 2011 నుండి తెలంగాణ ఉద్యమం మరింత ఉధృతమైంది. 'సకల జనుల సమ్మె'లో విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం వెయ్యి మందికి పైగా విద్యార్థుల ఆత్మ బలిదానాలు అందర్నీ కలిచివేశాయి. 2013లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. జూలై 30,2013న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ ఏర్పాటును ఆమోదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాకారం అయ్యింది. ఫిబ్రవరి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందింది. తదనంతరం జూన్ 2, 2014న తెలంగాణ అధికారికంగా భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించింది. తెలంగాణ ఉద్యమ పార్టీగా మేమే తెలంగాణ తెచ్చినమని చెప్పుకున్న టీఆర్ఎస్ పార్టీకి ప్రజలు వరుసగా (2014, 2018) రెండుసార్లు అధికారాన్ని అప్పజెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కోసం తెలంగాణ ఇచ్చినమని చెప్పుకున్న కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారు.

*డాక్టర్.అశోక్ మంద*
*ఉస్మానియా యూనివర్సిటీ*
*9959046499*

## జనరణకేతనం

ఎగరనీ ఎగరనీ ఎగరనీ
తెలంగాణ జనకేతనమెగరనీ
తెలంగాణ ధిక్కార స్వరకేతన మెగరనీ
మనజనగణ రణకేతనమెగరనీ ॥

తరతరాల పోరుబాట
రక్తంలో ముంచెత్తిన
అమరుల త్యాగాల జెండా ఎగరనీ అది
సగటు మనిషి సంతకమై ఎగరనీ ॥

పాలెగాండ్ర దోపిడిపై
కసితో గర్జించిన ఆ
గిరిజన కళ్ళెరుపు జెండా ఎగిరెరా
నేటి రాచరికపు గుండెలదర ఎగిరెరా ॥

కరకు నిజాం పాలనపై
సాగిన సాయుధ సమరం
ఇచ్చిన త్యాగాల జండ ఎగరనీ
గగనాంతరాలమెరుపై పైకెగరనీ ॥

అహంకార ధోరణిపై
చెలరేగిన జనకోపం
మెత్తని పులులై జనాన్ని
దోచిన దొరలకు శాపం
ఆశించిందీ దక్కక
నిరాశ జ్వాలారూపం ఆ
ధిక్కారపు స్వరకేతనమెగిరెరా ఇంక
బానిసపాలనకంతం పలికెరా ॥

సకలజనుల పోరుఫలం
దశాబ్దాల త్యాగఫలం
అందని ఈ సగటు జనం
కళ్ళురిమిందీ దినం
కదం కలిపి గళం కలిపి
నిరసిస్తూ నినదిస్తూ
ఎగరేసిన జెండా ఇది ఎగరనీ
నిలువెత్తుగ ఠీవిగ పైకెగరనీ
తెలంగాణ జనకేతనమెగరనీ ॥

(తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా..)
ఏటుకూరి ప్రసాద్

## కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాదిన్నర కాలంలో..
# సంక్షేమానికి రూ.76,469 కోట్ల ఖర్చు

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమానికి ప్రాధాన్యత.... రైతు కేంద్రంగా సంక్షేమ పాలన
ఇతర రంగాలలో కూడా సంక్షేమం, అభివృద్ధి చర్యలు, కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రజాభిప్రాయం
కాంగ్రెస్ మాటిచ్చిన ప్రకారం రూ.2500 ఆర్థిక సాయం కోసం మహిళల ఎదురుచూపులు

ఇ.చంద్రశేఖర్




అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నది. అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలో వివిధ వర్గాల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిదులను ఖర్చు చేస్తున్నది. రాష్ట్ర ఖజానాలో నిధుల కొరత కారణంగా కొంత మేరకు ఇతర కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నప్పటికీ సంక్షేమాన్ని మాత్రం విస్మరించకపోవడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 2023 డిసెంబర్ నుంచి 2025 మార్చి వరకు వివిధ రంగాల సంక్షేమానికి రూ.76,469 కోట్లను ఖర్చు చేయడం ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా పెద్ద పీట వేసింది. అందులో భాగంగా రైతు రుణ మాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న రకం ధాన్యానికి బోనస్, చేయుత (వృద్ధాప్య, వితంతు, వికలాంగులు తదితర వర్గాలకు పెన్షన్), 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన విషయం తెలిసిందే. ఆరు గ్యారెంటీలలో కూడా దేశానికి వెన్నెముక అయిన రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. కేవలం ఏడాదిన్నర కాలంలో సంక్షేమానికి ఖర్చు చేసిన దాదాపు రూ.80 వేల కోట్లలో సుమారు రూ.38 వేల కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేయడం ఇందుకు తార్కాణం. పంట రుణమాఫీ పథకంలో 2014 నుండి 2018 వరకు నాలుగేళ్ల వ్యవధిలో 35,31,913 మంది రైతులకు రూ.16,143.94 కోట్లు, 2018 నుంచి 2023 వరకు నాలుగేళ్ల వ్యవధిలో 21,35,557 మంది రైతులకు రూ.11, 909.31 కోట్ల రుణమాఫీ జరిగింది. అయితే గత ప్రభుత్వం దఫదఫాలుగా రుణమాఫీ చేయడం వల్ల రైతులు చెల్లించిన వడ్డీని మినహాయిస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయలు నికరంగా చేసిన రైతు రుణమాఫీ రూ.16,908.25 కోట్లు మాత్రమే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టి అనతి కాలంలోనే అర్హులైన 25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్లు రుణ మాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి గర్వకారణమని చెప్పవచ్చు. ఇక పంటల సాగు కోసం రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని ఏడాదికి ఎకరాకు రూ10 వేల నుంచి రూ.12 వేలకు పెంచడంతో పాటు గత ప్రభుత్వం 69 లక్షల మంది రైతులకు రూ.5 వేల చొప్పున బకాయిపడిన మొత్తం రూ.7,625 కోట్లను, 2024–25 యాసంగి పంట కాలానికి సంబంధించి 54.74 లక్షల పట్టాదారులకు రైతు భరోసా సహాయం రూ.4666.59 కోట్లను కలిపి ఇప్పటివరకు ఏకంగా రూ.13,088 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం గమనార్హం. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకం కింద 29,14,692 మంది రైతులకు రూ.15, 724 కోట్ల విలువైన ఉచిత విద్యుత్తు సరఫరా చేసింది. దీనితో పాటు అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, అనివార్య కారణాల వల్ల పంట నష్టం వాటిల్లితే రైతులను ఆదుకునేందుకు 42,15,670 మంది రైతులకు బీమాను వర్తింపజేస్తూ రూ.1970 కోట్లను ఖర్చు చేసింది. తద్వారా ఆపదలో ఉన్న 26,620 రైతు కుటుంబాలను ఆదుకున్నది. మరోవైపు సమాజంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, వివిధ తీవ్రమైన వ్యాధిగ్రస్తులు తదితర నిస్సాహయంగా జీవిస్తున్న వారికి 'చేయూత' పథకం కింద 42, 44,820 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు రూ.15,760 కోట్ల వెచ్చించి పెన్షన్లు ఇచ్చింది. దేశానికి అన్నం పెట్టే రైతులు, నిరాశ్రయులైన పెన్షన్‌దారులను ఆదుకోవడం, మహిళలను సాధికారత దిశగా అడుగులు వేయించడం, ఇళ్ల లేని నిరుపేదలకు ఇళ్ల కల్పించడం తదితర 14 రకాల సంక్షేమ కార్యక్రమాలకు సమారు రూ.80 వేల కోట్లను ఖర్చు చేయడం ద్వారా ఏడాదినర్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం పట్ల తమ చిత్తశుద్ధిని కనబరిచిందని చెప్పవచ్చు. అయితే ముఖ్యంగా కాంగ్రెస్ మాటిచ్చిన మేరకు 'మహాలక్ష్మి' పథకం కింద రూ.2500 ఆర్థికసాయం కోసం మహిళలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కేంద్రంగా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నదని, దానితో పాటు ఇతర రంగాలలో కూడా సంక్షేమం, అభివృద్ధి చర్యలను, కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**2023 డిసెంబర్ నుండి 2025 మార్చి వరకు సంక్షేమానికి ఖర్చు చేసిన నిధుల వివరాలు**

| క్ర.సం. | పథకం | (రూ. కోట్లలో) |
|---|---|---|
| 1. | రైతు రుణమాఫీ | 20,617 |
| 2. | రైతు భరోసా | 13,088 |
| 3. | సన్న రకం వరి రైతులకు బోనస్ | 1,199 |
| 4. | రైతులకు బీమా | 1,970 |
| 5. | పంట నష్టంపై సహాయక చర్యలకు ఖర్చు | 260 |
| 6. | ఇందిరమ్మ ఆత్మీయ భరోసా | 50 |
| 7. | మహాలక్ష్మి పథకం కింద ఎల్పిజి సబ్సిడీ | 580 |
| 8. | గృహ జ్యోతి (200 యూనిట్లు ఉచిత విద్యుత్) | 1,816 |
| 9. | మహాలక్ష్మి (ఆర్‌టిసి బస్సులలో ఉచిత ప్రయాణం) | 3,616 |
| 10. | వడ్డీలేని రుణాలు (ఎస్‌హెచ్‌జిలకు) | 267 |
| 11. | ఇందిరమ్మ ఇళ్లు | 299 |
| 12. | చేయూత (పెన్షన్లు) | 15,760 |
| 13. | రాజీవ్ ఆరోగ్యశ్రీ | 1,223 |
| 14. | విద్యుత్ సబ్సిడీ | 15,724 |
| | **మొత్తం** | **రూ. 76,469 కోట్లు** |

## శ్రీధర్‌బాబు పథకాలతో
# దూసుకుపోతున్న 'టెక్ తెలంగాణ'

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేక ఇంటర్వ్యూ..

**(బిరుదరాజు వాసుదేవరాజు)**



అభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తోడై మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో తెలంగాణ ఐటి శాఖ దూసుకుపోతోంది. తెలంగాణలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగానికి నూతన ఊపిరి పోసే విధంగా మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటున్న నిర్ణయాలు, పెట్టుబడులకు గేట్‌వేలా మారుతున్న హైదరాబాద్ టెక్ క్లస్టర్లు, డిజిటల్ పరిపక్వతలో రాష్ట్రం ముందడుగు వేస్తోంది. ఐటీ, స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరిస్తున్న కార్యాచరణలు రాష్ట్ర ఐటి రంగ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. పరిశ్రమలకు వేదికగా, యువతకు అవకాశాలుగా మారుతున్న ప్రభుత్వ ఐటీ విధానాలు ఇవన్నీ మంత్రి శ్రీధర్‌బాబు కెరటాల్లాంటి చర్యల ఫలితమే అంటున్నారు పరిశ్రమల వర్గాలు. ఐటి రంగాన్ని మరింత విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు టార్గెట్లతో, ప్రణాళికలతో ముందు కు సాగుతున్నామని.. తెలంగాణను టెక్నాలజీ కేంద్రంగా నిలబెట్టేందుకు నూతన ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నామని **ప్రజాపక్షం ప్రతినిధి**కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.

**ప్రశ్న:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐటి, పరిశ్రమలు అభివృద్ధి చెందాయా..?

**శ్రీధర్‌బాబు:** 2023 డిసెంబర్ నుండి 2025 మే వరకు రాష్ట్రం అనేక రంగాలలో పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగ అవకాశాలను సృష్టించింది. తెలంగాణ రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమల శాఖ సిఎం రేవంత్‌రెడ్డి చొరవతో ముఖ్య పెట్టుబడులతో పాటు పలు విజయాలు సాధించాం.

**ప్రశ్న:** పరిశ్రమల వల్ల పెట్టుబడులు ఎన్ని వచ్చాయి..? ఎన్ని విదేశీ పరిశ్రమలు వచ్చాయి..? కొత్తగా వచ్చిన ఉద్యోగాలు ఎన్ని..?

**శ్రీధర్‌బాబు:** రాష్ట్రంలో రూ.35,820 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 141 దేశీయ, అంతర్జాతీయ కంపెనీల నుండి, ముఖ్యంగా ఔషధ, జీవశాస్త్ర, పరిశోధన రంగాలలో పెట్టుబడులు వచ్చాయి. వీటివల్ల 51,086 ప్రత్యక్ష ఉద్యోగాలు మరియు 1.5 లక్షల పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడ్డాయి.

**ప్రశ్న:** ఐటి రంగంలో పెట్టుబడులు ఎన్ని, ఇందులో కొత్తగా ఉత్పన్నమైన ఉద్యోగాలు ఎన్ని ?

**శ్రీధర్‌బాబు:** ఐటి రంగంలో రూ.6,000 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చాం. ఐటి, తయారీ రంగాలలో, ఫెడెక్స్, జెడ్‌ఎఫ్ ఫెడెక్స్, జెడ్‌ఎఫ్ లైఫ్‌టెక్, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టాయి. ఈ పెట్టుబడుల ద్వారా 5,200 ప్రత్యక్ష ఉద్యోగాలు, 18,000 పైగా పరోక్ష ఉద్యోగాలు ఏర్పడ్డాయి.

**ప్రశ్న:** దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో సాధించిన విజయాలు వివరించండి.

**శ్రీధర్‌బాబు:** దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో, రూ.40,232 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. ఇందులో అదానీ గ్రూప్, జెఎస్‌డబ్ల్యూ, ఉబర్, అరాజెన్ లైఫ్ సైన్సెస్ వంటి కంపెనీలు ఉన్నాయి.

**ప్రశ్న:** తెలంగాణకు వచ్చిన ప్రముఖ కంపెనీల వివరాలు తెలపండి

**శ్రీధర్‌బాబు:** తెలంగాణకు వచ్చిన ప్రముఖ కంపెనీలో బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.700 కోట్ల పెట్టుబడి, 500 ఉద్యోగాలు. అలాగే కోకొకోలా.. పెద్దపల్లి జిల్లాలో బాట్లింగ్ యూనిట్ ఏర్పాటు. ఇక ఔషధ రంగం విస్తరణలో సనోఫీ, బిఎంఎస్, ప్రావిడెన్స్ కంపెనీ తీసుకువచ్చాం. డెంగ్యూ వాక్సిన్ ఉత్పత్తిలో టకేడా లైఫ్ సైన్సెస్, బయోలాజికల్ కంపెనీ, జీవశాస్త్ర రంగం లో పెట్టుబడుల్లో అమ్జెన్, జోయిటిస్, మెడ్ట్రానిక్ కంపెనీ, ఐటీ రంగంలో విస్తరణలో ఫెడెక్స్, కాగ్నిజెంట్, లండన్ స్టాక్ ఎక్స్చేంజ్ గ్రూప్ కంపెనీలను తీసుకువచ్చాం. ఇక డేటా సెంటర్ విస్తరణలో అమెజాన్ రూ.60,000 కోట్ల పెట్టుబడి పెట్టింది. డేటా సెంటర్ ఏర్పాటులో సిటిఆర్ఎల్ఎస్ ఫాటాసెంటర్లు, సిఫై టెక్నాలజీస్ కంపెనీ రాగా, కామారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ ఉత్పత్తి కేంద్రం, బాటిల్ క్యాప్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశాము.

**ప్రశ్న:** ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా.. ?

**శ్రీధర్‌బాబు:** చందానగర్‌లో 25 ఎకరాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫార్మా హెల్త్‌కేర్ ఐటీ హబ్ ద్వారా 10,000 ప్రత్యక్ష ఉద్యోగాలు, 40,000 పరోక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్ ఔషధ పరిశ్రమకు కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు ఎఐ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రత్యేక విధానాలు రూపొందించడం జరిగింది.

**ప్రశ్న:** టి వర్క్ ద్వారా జిల్లాలలో యువతకు ఎలాంటి ఉపాధి కల్పిస్తున్నారు?

**శ్రీధర్‌బాబు:** టి వర్క్ ద్వారా ప్రతి జిల్లాల్లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీలు ఏర్పాటు చేస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు సైతం ఈ అకాడమీల ద్వారా రెడ్డి ల్యాబ్స్, దివీస్, హెటిరో తదితర కంపెనీలు యువతకు స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు సైతం కల్పిస్తున్నాయి. దేశంలోనే ఈ రకమైన విధానం కేవలం తెలంగాణలోనే ఉంది.

# నేడు రాజీవ్ యువవికాసం పథకానికి శ్రీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూపులు చూస్తున్న పథకానికి నేడు శ్రీకారం చుట్టనున్నారు. సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించి, రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభిస్తారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న సిఎం ఎనుముల రేవంత్ లబ్ధిదారులకు రాజీవ్ యువవికాసం పథక పత్రాలు అందచేయనున్నారు. దీనితో పథకం ద్వారా లబ్ధి పొందే లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యువతను బిగ్ బిజినెస్‌మ్యాన్ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మరి ఆ స్కీమ్ ఏంటి? కలిగే లబ్ధి ఏంటి? పూర్తి విషయాలు తెలుసుకుందాం. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మరో గొప్ప పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఎన్నో కలలు కని, వ్యాపార ఆలోచనలు ఉన్నా పెట్టుబడి తక్కువగా ఉండటంతో వెనుకబడిపోయిన లక్షలాది యువతకు ఆసరాగా మారబోతోంది రాజీవ్ యువ వికాసం పథకం. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది యువతకు ఆత్మనిర్భరత దిశగా మెరుగైన అవకాశాలు కలగనున్నాయి.

**పథకానికి భారీ స్పందన..**

ఈ పథకానికి భారీ స్పందన లభించింది. ఇప్పటికే 16.22 లక్షల మంది యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు ఉన్నారు. వారి కలలకు బాసటగా, పథకం ప్రారంభ దశలోనే రూ.6,250 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జూన్ 2న తొలి విడతగా రూ.లక్ష లోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. జూన్‌లో రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. జూలైలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షలలోపు లబ్ధిదారులకు మంజూరు చేస్తారు. ఆగస్టులో రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధిదారులకు సెప్టెంబర్‌లోపు పథకాన్ని అమలు చేస్తారు.

**దశల వారిగా పథకం అమలుకు కార్యాచరణ..**

మొదటి దశలో జూన్‌లో 85,000 మంది లబ్ధిదారులకు రూ.650.00 కోట్లు సబ్సిడీ, రెండోదశలో జూలైలో 1,00,000 మందికి, రూ.1,000,00 కోట్లు సబ్సిడీ, ఆగస్టులో మూడవ దశలో 1,00,00 మందికి 1,500,00 సబ్సిడీ, సెప్టెంబర్‌లో నాలుగవ దశలో 1,00,234 మంది లబ్ధిదారులకు 1,600,50 కోట్లు సబ్సిడీ, మొత్తం 4,93, 234 మంది లబ్ధిదారులకు, రూ.6250.50 కోట్లు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వనున్నారు.




**సబ్సిడీ వివరాలు..**

రూ.50,000 వరకూ పూర్తిగా (100 శాతం), రూ.లక్ష వరకూ 90 శాతం, రూ.2 లక్షల వరకూ 80 శాతం, రూ.4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తారు. ఈ పథకం క్రమబద్ధంగా అమలు కానుంది. జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. అనంతరం జూన్ 10 నుంచి 15వ తేదీ వరకూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటిలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు ఎంట్రప్రెన్యూరియల్షిప్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. జూన్ 16 నుంచి యూనిట్ల ప్రారంభోత్సవాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. గాంధీ జయంతి నాటికి అన్ని యూనిట్లు ప్రారంభం కావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకం ద్వారా ప్రారంభం అయ్యే 5 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు రాష్ట్రానికి భారీగా ఉపాధిని అందించనున్నాయి. ప్రతి యూనిట్ సగటున 4.4 మందికి ఉపాధి కల్పిస్తుందన్న గణాంకాల ప్రకారం, మొత్తం 22 లక్షల ఉద్యోగాలు రాష్ట్రంలో సృష్టించబడతాయని అంచనగా ఉంది. ఇది తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డిపిపై కూడా సానుకూల ప్రభావం చూపనుందని అధికారులు చెప్పుతున్నారు.

**లబ్ధిదారుల వివరాలు చూస్తే..**

ఈ పథకం ఎంత సముచితంగా రూపుదిద్దుకుందో స్పష్టమవుతుంది. మొత్తం లబ్ధిదారుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల అభ్యర్థులు 80 శాతం వరకు ఉన్నారు. వీరిలో బిసిలు 31.44 శాతం, ఎస్‌సిలు 29.36 శాతం, ఎస్‌టిలు 19.59 శాతం, 25 శాతం మహిళలకు, 5 శాతం దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించారు. తెలంగాణ ఉద్యమంలో, ఎస్‌సి వర్గీకరణ ఉద్యమంలో పాల్గొని అమరులైన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. అప్పట్లో తిరస్కరించిన దరఖాస్తుదారుల్లో చాలామంది ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. ఈ పథకం విజయవంతంగా అమలైతే, రాబోయే సంవత్సరాల్లో తెలంగాణను స్వయం ఉపాధిలో దేశానికే ఆదర్శంగా నిలిపే అవకాశం ఉంది.

**రాజీవ్ యువ వికాసం - అర్హతలు**

వ్యవసాయేతర పథకాలకు జులై 1, 2025 నాటికి 21–55 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21–60 ఏళ్ల మధ్య ఉండాలి.

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలు.

**రాజీవ్ యువ వికాసం రాయితీ వివరాలు..**

| యూనిట్ విలువ | రాయితీ | బ్యాంకు రుణం |
|---|---|---|
| రూ.50 వేల వరకు | 100 శాతం | సున్నా |
| రూ.50,001 రూ.1 లక్ష | 90 శాతం | 10 శాతం |
| రూ.1,00,001 రూ.2 లక్షలు | 80 శాతం | 20 శాతం |
| రూ.2,00,001 రూ.4 లక్షలు | 70 శాతం | 30 శాతం |

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అసోంలో 81 మంది దేశ ద్రోహులు అరెస్టు

**గువహటి :** దేశ ద్రోహులు అనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఇద్దరు వ్యక్తులు ఆదివారం అసోంలో అరెస్టు అయ్యారు. ఏప్రిల్‌లో ఫాల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత మొత్తం అరెస్టుల సంఖ్య 81కి చేరుకుందని ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తెలిపారు. సోనిత్‌పూర్, కామ్రూప్ జిల్లాల నుండి ఒక్కొక్కరిని అరెస్టు చేసినట్లు శర్మ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'పాక్ పట్ల సానుభూతి చూపినందుకు 81 మంది దేశ వ్యతిరేకులు ఇప్పుడు జైలులో ఉన్నారు... మా వ్యవస్థలు సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక పోస్టులను నిరంతరం ట్రాక్ చేసి చర్యలు తీసుకుంటున్నాయి' అని ఆయన జోడించారు. అంతకు ముందు, పహల్గామ్ ఉగ్రవాద దాడిలో పాకిస్థాన్, దాని సహకారాన్ని సమర్థించారనే ఆరోపణలపై ప్రతిపక్ష ఎఐయుడిఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాంను దేశద్రోహ ఆరోపణలపై అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ పొందిన తర్వాత, ఇస్లాంను మళ్ళీ జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అరెస్టు చేశారు. జమ్ముకశ్మీర్ ఉగ్రవాద దాడి తర్వాత 'పాకిస్థాన్ జిందాబాద్' నినాదం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శర్మ హెచ్చరించారు. ఏప్రిల్ 22న దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఒక ప్రధాన పర్యాటక ప్రదేశంలో ఉగ్రవాదులు దాడి చేశారు. 26 మంది మరణించారు.

## ఈశాన్య రాష్ట్రాల్లో వరద బీభత్సం

**67 ఏళ్ల రికార్డ్ బ్రేక్ : 31 మంది మృతి**

**గువహిటిలో 67 ఏళ్ల తర్వాత రికార్డు స్థాయిలో ఒక్కరోజే 11 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం**




**గువహటి:** ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి. రెండు రోజుల వ్యవధిలో కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి 31 మంది మృతి చెందారు. గువహిటిలో 67 ఏళ్ల తర్వాత రికార్డు స్థాయిలో ఒక్కరోజే 11 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. 15 జిల్లాలపై వర్షప్రభావం ఉండగా సుమారు 78 వేల మంది ప్రభావితులయ్యారు. గత 48 గంటల్లో అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లో తొమ్మిది మంది, మేఘాలయలో ఆరుగురు, మిజోరంలో ఐదుగురు, నాగాలాండ్, త్రిపురలో ఒకరు చొప్పున మరణించారు. అరుణాచల్‌లో కొండచరియలు విరిగిపడి వాహనంపై పడడంతో, ఆ వాహనం లోతైన లోయలో పడిపోయింది. అందులో ఉన్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. నలుగురు పిల్లలు, ఇద్దరు గర్భిణీ స్త్రీలు సహా మరణించిన వారు రెండు కుటుంబాలకు చెందినవారే. తూర్పు కామెంగ్ జిల్లాలోని బనాసెప్పా రోడ్డులో శుక్రవారం రాత్రి బాధితులు బనా నుండి తూర్పు కామెంగ్ జిల్లా హెడ్ క్వార్టర్స్ సెప్పాకు ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. అదే కొండచరియలో చిక్కుకున్న రెండవ ప్రయాణికుల వాహనం తృటిలో తప్పించుకుంది. కొండచరియలు విరిగిపడిన మరో సంఘటనలో రాష్ట్రంలోని దిగువ సుబన్సిరి జిల్లాలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో ఇద్దరు రక్షించబడ్డారు. జిరోకామ్లే రోడ్డుపై ఈ ఘటన జరిగింది. మిజోరాంలో, చాంఫాయి జిల్లాలో ఆకస్మిక వరదల కారణంగా మయన్మార్ నుండి ఐదుగురు శరణార్థులు కొట్టుకుపోయారు. తరువాత ఇద్దరు రక్షించినప్పటికీ మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో సంఘటనలో సెర్చిప్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి ఒక వ్యక్తి మరణించాడు. శుక్రవారం ఉదయం గోడ కూలిపోయిన సంఘటనలో మరొక వ్యక్తి మరణించాడు. లాంగ్ట్లై జిల్లాలో కూడా అనేక కొండచరియలు విరిగిపడ్డాయి. ఒక హోటల్, కొన్ని ఇళ్ళు కూలిపోయాయి. హోటల్ శిథిలాలలో ఇద్దరు వ్యక్తులు చిక్కుకుపోగా, వారిని సురక్షితంగా రక్షించారు. అసోంలోని గువహటి, గోలాఘాట్, లఖింపూర్‌లో మొత్తం తొమ్మిది మంది మృతి చెందినట్లు నివేదికలు అందాయి. వీరంతా కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా మరణించారు. గువహటిలో ఆకస్మిక వరదలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జనజీవనం స్తంభించిపోయింది. 15కి పైగా జిల్లాల్లో 78,000 మందికి పైగా నివాసితులు ప్రభావితమయ్యారు. మేఘాలయలో కొండచరియలు విరిగిపడటం, చెట్లు కూలిపోవడం, పిడుగులు పడటం, మునిగిపోవడం వంటి ప్రమాదాలలో ఆరుగురు మరణించారు. మణిపూర్‌లో కూడా కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇంఫాల్ లోయలోని విస్తారమైన ప్రాంతాలు వర్షపునీటితో మునిగిపోయాయి. మణిపూర్, అసోంలోని కొన్ని నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి, ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని అనేక రాష్ట్రాలు అనవసర ప్రయాణాలను నివారించాలని, ఇంట్లోనే ఉండాలని అధికార యంత్రాంగం ప్రజలకు సూచించింది. వరద ప్రభావిత రాష్ట్రాల్లో సైన్యం, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సహాయకచర్యలు చేపట్టాయి.

## సైనిక, విదేశాంగ విధాన వ్యూహంపై చర్చించాలి

**వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలి**

**ప్రభుత్వం అన్ని పార్టీలను, విశ్వాసంలోకి తీసుకోవాలి : కాంగ్రెస్**



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వాస్తవాలు వెల్లడించిన నేపథ్యంలో సైనిక, విదేశాంగ విధాన వ్యూహాన్ని చర్చించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం అన్ని పార్టీలను, దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశ రక్షణ సంసిద్ధత, వ్యూహాన్ని చర్చించాలని కూడా పేర్కొంది. జనరల్ చౌహాన్ సింగపూర్‌లో ఏమి చెప్పారో ప్రధానమంత్రి లేదా రక్షణ మంత్రి అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్ష నాయకులకు తెలియజేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. సింగపూర్‌లోని అన్ని ప్రదేశాలలో ఆపరేషన్ సిందూర్ గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కొన్ని ముఖ్యమైన ప్రకటనలు చేశారు. ప్రధానమంత్రి లేదా రక్షణ మంత్రి ముందుగా ప్రతిపక్ష నాయకులకు అఖిలపక్ష సమావేశంలో వివరించి ఉంటే బాగుండేదన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పెద్ద వ్యూహాత్మక విదేశాంగ విధానం, ఆర్థిక సమస్యలను చర్చించడానికి పార్లమెంటును వెంటనే సమావేశపరచాలనే వాదనను జనరల్ చౌహాన్ ప్రకటనలు బలపరుస్తాయి' అని రమేష్ పిటిపికి చెప్పారు. శనివారం, సింగపూర్‌లో జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, పాకిస్తాన్‌తో ఇటీవలి జరిగిన సైనిక ఘర్షణల్లో విమానాలను కోల్పోయిన తర్వాత భారతదేశం వ్యూహాలను సరిదిద్దుకుందని, పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లి దాడి చేసిందని అన్నారు. ఆరు భారతీయ జెట్‌లను కూల్చివేసినట్లు ఇస్లామాబాద్ చేసిన వాదన పూర్తిగా అవాస్తవమని ఆయన తోసిపుచ్చారు. కాగా, సింగపూర్‌లో సిడిఎస్ వాస్తవాలు చెప్పడం ఆందోళన కలిగించే అంశమని రమేష్ అన్నారు. ప్రధానమంత్రి ప్రతిపక్ష నాయకులకు ఎందుకు వివరించలేకపోయారని జనరల్ చౌహాన్ ప్రకటనలను ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. ఈ ప్రయోజనం కోసమే తాము అఖిలపక్ష సమావేశాలు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేస్తున్నామని ఉద్ఘాటించారు. కార్గిల్ యుద్ధం తర్వాత భారతదేశ రక్షణ సంసిద్ధతపై ఏర్పాటు చేసిన తరహాలో ప్రత్యేక సమీక్ష కమిటీ వేయాలన్న డిమాండ్‌ను కూడా పునరుద్ఘాటించారు. కార్గిల్ యుద్ధం ముగిసిన మూడు రోజుల తర్వాత, అప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తండ్రి నేతృత్వంలో కార్గిల్ సమీక్ష కమిటీని ఏర్పాటు చేశారని, ఆ నివేదికను తరువాత పార్లమెంటులో ప్రవేశపెట్టి చర్చించారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా కూడా ఈ అంశాలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అందరినీ విశ్వాసంలోకి తీసుకుని చర్చించాలని సూచించారు. అమెరికా కాల్పుల విరమణ ప్రకటించగానే, నాయకులు ఆపరేషన్ సిందూర్ గురించి చర్చించడానికి విదేశాలకు వెళ్లారని, అయితే ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారు? సమాధానాలు సాయుధ దళాల నుండి కాదు, ప్రభుత్వం నుండి రావాలి అని ఆయన పేర్కొన్నారు. సాయుధ దళాలు పటిష్టంగా ఉన్నాయని, వారు అవసరమైనది చేశారని, కానీ ఏ ఒత్తిడితో కాల్పు విరమణ ఒప్పందం కుదిరిందని ఖేరా ప్రశ్నించారు. పహల్గామ్ దాడి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నారు? కాల్పుల విరమణకు పరిస్థితులు ఏమిటి? సిడిఎస్ చెప్పినది దిగ్భ్రాంతికరంగా ఉందని, ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ఖేరా ప్రభుత్వానికి అనేక ప్రశ్నలు సంధించారు. సైనిక పోరాటంపై ప్రజలకు సమగ్ర సమాధానం అవసరమని రాజ్యసభలో కాంగ్రెస్ ఉప నాయకుడు ప్రమోద్ తివారీ కూడా పేర్కొన్నారు. భారత్‌–పాకిస్థాన్ వివాదంపై ప్రభుత్వం దేశాన్ని తప్పుదారి పట్టిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ఆరోపించారు. భారత్ రక్షణ సంసిద్ధతను స్వతంత్ర నిపుణుల కమిటీ సమగ్రంగా సమీక్షించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

## మా కుటుంబంలో చిచ్చు పెట్టేందుకు కుట్ర

**లాలూ పెద్దకుమారుడు తేజ్ ప్రతాప్**



**పాట్నా :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)లో ఇటీవల కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ నుంచి తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్‌ను బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ ప్రకటించిన సంగతి తెలిసిదే. వీటిపై తేజ్ ప్రతాప్ మౌనం వీడారు. తనకు, తన తమ్ముడు తేజస్వీ యాదవ్ మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 'మా మధ్య చీలిక వస్తుందని కలలు కంటున్న వారు ఎన్ని కుట్రలు చేసినా విజయం సాధించలేరు. వాటన్నింటినీ త్వరలోనే బయటపెడుతా. అన్నివేళలా తోడుగా ఉంటాననే భరోసాను నీకు (తేజస్వీని ఉద్దేశిస్తూ) ఇస్తున్నా. అమ్మా, నాన్నలను జాగ్రత్తగా చూసుకో. జైచంద్ లాంటి వాళ్లు ఇంట్లో, బయట ఉన్నారు' అని తేజ్ ప్రతాప్ పేర్కొన్నారు. అంతకుముందు లాలూ, రబ్రీదేవీలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో స్పందించిన తేజ్ ప్రతాప్.. జైచంద్ వంటి వారు తనపై కుట్రలు చేశారని ఆరోపించారు. తల్లిదండ్రుల ప్రేమ, విశ్వాసం మాత్రమే తనకు కావాలని, మరేదీ వద్దని చెప్పారు. తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరల్‌గా మారింది. అనుష్క అనే మహిళతో గత 12 ఏళ్లుగా రిలేషన్‌లో ఉంటున్నాన్నది దాని సారాంశం. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్... పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించడంతోపాటు తమ కుటుంబంలోనూ తేజ్ ప్రతాప్‌కు స్థానం లేదని ప్రకటించారు.

## 3 వేలకుపైగా 'కొవిడ్' కేసులు

**న్యూఢిల్లీ :** దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్ 1న ఉదయం 8గంటల వరకు దేశ వ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,758కి పెరిగింది. వీటిలో అత్యధికంగా కేరళలోనే 1400 కేసులు ఉండగా.. మహారాష్ట్రలో 485, ఢిల్లీ 436, గుజరాత్ 320, పశ్చిమ బెంగాల్ 287, కర్ణాటక 238, ఆంధ్రప్రదేశ్ 23, తెలంగాణ 3 చొప్పున.. ఇలా పలు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తంగా 3758 యాక్టివ్ కేసులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే, ఈ ఏడాది కొవిడ్ సంబంధిత మరణాలు 28కి చేరాయి. కొవిడ్ మళ్లీ వ్యాప్తి చెందుతుండటంపై ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇటీవల స్పందించింది. వ్యాప్తిలో ఉన్న ఎల్ఎఫ్ 7, ఎన్‌బి.1.8.1 సబ్ వేరియంట్లను పర్యవేక్షణలో ఉన్న వేరియంట్లుగా వర్గీకరించింది. పలు దేశాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఎన్‌బి.1.8.1 వేరియంట్‌తో ఇన్ఫెక్షన్ల వ్యాప్తి, ఆస్పత్రుల్లో చేరికలు ఒకేసారి పెరుగుతున్నా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఇతర వేరియంట్లతో పోలిస్తే ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందన్న సూచనలు ఏమీ లేవని మే 23న పేర్కొంది. ఇప్పటికే ఆమోదం పొందిన కొవిడ్ వ్యాక్సిన్లు ఈ వేరియంట్ లక్షణాలు, ప్రభావాన్ని కట్టడి చేయడంలో సమర్థంగా పనిచేస్తాయని భావిస్తున్నట్లు తెలిపింది. మరో వైపు, ఐసిఎంఆర్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో జీనోమ్ సీక్వెన్సింగ్ నమూనాల ద్వారా ఈ కొత్త వేరియంట్లు ఒమిక్రాన్ జాతికి చెందిన ఉప రకాలుగా తేలింది. 2022లో ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ శరవేగంగా విస్తరించడానికి ఒమిక్రాన్ కారణమన్న విషయం తెలిసిందే. అయితే, ఎల్ఎఫ్ 1, ఎక్స్ఎఫ్‌జి, జిఎన్ 1, ఎన్‌బి. 1.8.1 వంటి వేరియంట్లను మన దేశంలో గుర్తించగా.. వీటిలో మొదటి మూడు వేరియెంట్లే ప్రబలంగా ఉన్నట్లు ఐసిఎంఆర్ చీఫ్ రాజీవ్ బహల్ ఇటీవల తెలిపారు. కొవిడ్ కేసుల పెరుగుదలపై ఇటీవల రాజీవ్ బెహల్ పిటిఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. తొలుత దక్షిణ భారతదేశం నుంచి నమోదైన కేసులు.. ఆ తర్వాత పశ్చిమం నుంచి, ఇప్పుడేమో ఉత్తర భారతం నుంచి వస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులన్నింటినీ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ద్వారా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి ఈ ఇన్‌ఫెక్షన్ల తీవ్రత తక్కువగా ఉందన్న ఆయన.. ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎప్పుడైనా ఇన్ఫెక్షన్లు పెరిగితే.. మూడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వైరస్ వ్యాప్తి ఎంత మేరకు ఉంది అనేది మొదట చూడాలి. గతంలో కొవిడ్ 19 వచ్చినప్పుడు కేసులు రెండు రోజుల్లోనే రెట్టింపు కావడం మనం చూశాం. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక రెండోది, కొత్త వేరియంట్లు రోగనిరోధక శక్తిపై ఏమేరకు ప్రభావం చూపుతున్నాయనేది చూడాలి. మూడోది, వైరస్ తీవ్రత ఎంతో చూడాలి. గతంతో పోలిస్తే.. ఈ వేరియంట్‌లో అంత తీవ్రత కనబడటంలేదు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదుగానీ, అప్రమత్తంగా, సర్వసన్నద్ధతతో ఉండాలి అని సూచించారు.



## బ్రిక్స్ 11వ పార్లమెంటరీ సమావేశాల కోసం బ్రెజిల్‌కు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**జూన్ 3నుంచి 5వరకు జరిగే బ్రసీలియా సమావేశాలలో భారత ప్రతినిధి బృందానికి సారథ్యం**



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం రాజకీయ, ఆర్థిక పరస్పర సహకారం కోసం జాతీయ ఆర్థికవ్యవస్థలతో ఏర్పాటైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా (బ్రిక్స్) 11వ పార్లమెంటరీ ఫోరమ్‌లో పాల్గొనేందుకు బ్రెజిల్ బయల్దేరి వెళ్లారు. బహుళ పాక్షిక శాంతి, భద్రతా నిర్మాణంపై ఆయన తన అభిప్రాయాలను ఫోరమ్ ముందు వ్యక్తీకరించనున్నారు. తొలుత 4దేశాలతో 'బ్రిక్'గా 2009, జూన్ 16న ఆవిర్భవించిన 'బ్రిక్ ఫోరమ్', ఆ తర్వాత సౌత్‌ఆఫ్రికాను కూడా చేర్చుకోవడంతో 'బ్రిక్స్'గా అవతరించింది. అయితే ఇప్పుడు బ్రిక్స్‌లో 10 సభ్యదేశాలు ఉన్నాయి. ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సభ్య దేశాలుగా మారడంతో 'బ్రిక్స్'సంఖ్య 10కి చేరింది. బ్రసీలియాలో జూన్ 35వరకు బ్రిక్స్ 11వ పార్లమెంటరీ ఫోరమ్ జరుగనున్నది. దీనిలో పాల్గొననున్న ప్రతినిధి బృందానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం వహించనున్నారు. ఈ ఫోరమ్‌లో బ్రిక్స్ సభ్యదేశాలతో పాటు ఆహ్వానించబడిన దేశాల పార్లమెంట్‌ల అధ్యక్ష అధికారులు పాల్గొంటారు. మరింత సమగ్రమైన, స్థిరమైన, ప్రపంచపాలన నిర్మాణాన్ని అందించడంలో బ్రిక్స్ పార్లమెంట్‌ల పాత్ర కీలకంగా ఉండాలన్నదే బ్రిక్స్ ఏర్పాటులోని ప్రధాన సారాంశం.అయితే తాజాగా ఈ బ్రిక్స్ గ్రూప్ 11దేశాల ప్రాతినిధ్యంతో కూడిన బ్రిక్స్ 11వ పార్లమెంటరీ ఫోరమ్ సమావేశాలను బ్రసీలియాలో జరుపుకోబోతున్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా, సౌదీ అరేబియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్‌లు ఈ 11వ పార్లమెంటరీ ఫోరానికి ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. ఇంటర్‌పార్లమెంటరీ యూనియన్ (ఐపియు) ప్రసిడెంట్ తులియా అక్సన్‌తె సాటె ఈ ఫోరమ్ సమావేశాలలో పాల్గొనేందుకు బెలారస్, రష్యా, కజకిస్తాన్, క్యూబా, నైజీరియా, మలేషియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్ నుంచి ప్రిసైడింగ్ అధికారులను కూడా ఆహ్వానించారు.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 'ఇంటర్‌పార్లమెంటరీ కోఆపరేషన్ ఫర్ రెస్పాన్సిబుల్ అండ్ ఇంక్లూసివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' ఫోరమ్‌లో, 'బ్రిక్స్ పార్లమెంట్స్ యునైటెడ్ ఫర్ ది రిఫార్మ్ ఆఫ్ దాఇ మల్టీలేటరల్ పీస్ అండ్ సెక్యూరిటీ ఆర్కిటెక్చర్' అంశాలపై ఫోరమ్‌లో ప్రసంగించనున్నారు.ప్రతినిధి బృందంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, రాజ్యసభ సభ్యుడు సురేంద్ర సింగ్ నగర్, లోక్‌సభ సభ్యులు విజయ్ బాఘెల్, వివేక్ ఠాకూర్, శబరి బైరెడ్డి ఉన్నారు. లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి.మోడీ ఇరువురూ ఈ ప్రతినిధి బృందంలో భాగంగా ఉన్నారు. ఈ సందర్భంగా ఈ ఫోరమ్‌లో పాల్గొంటున్న పార్లమెంట్‌ల ప్రిసైడింగ్ ఆఫీసర్లతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించబోతున్నారు.

## ప్రగల్భాలు మాని.. శత్రువుపై దృష్టి పెట్టాలి


**మోదీకి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హితవు**



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్ తర్వాత బహిరంగసభల్లో చేస్తున్న ప్రసంగాలపై కాంగ్రెస్ పార్టీ విమర్శల బాణాలను సంధించింది. ప్రధాని మోదీ తన స్వీయ ప్రగల్భాలకు బదులు శత్రువుపై దృష్టి పెట్టాలని హితవు పలికింది. అంతేకాకుండా ఆయన తనకు తానుగా ఎన్నికల ప్రచారం నుంచి తప్పుకుంటే మంచిదని సూచించింది. మోదీ ప్రకటనలు అన్నింటికీ నేను స్పందించదల్చుకోలేదు అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఆయన ఆదివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ విమర్శలు సంధించారు. 'కానీ నేను ఆయనకు ఒకే ఒక్క అభ్యర్థనను చేయదల్చుకున్నాను. పదవిలో ఉన్నవారు కొన్ని సార్లు నోరును మూసుకోవాల్సిన అవసరం ఉంది' అని చెబుతున్నానని ఖర్గే తెలిపారు. ప్రధానమంత్రి ఇటీవలి బహిరంగ ప్రకటనలు సహా రాజకీయ కార్యకలాపాలను ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. 'మోదీ ప్రస్తుతం తాత్కాలికంగా ఎన్నికల ప్రచారం నుంచి వెనక్కి తగ్గాలి. మోదీ తన ఎన్నికల ప్రచారం నుంచి వైదొలిగి దేశం మీద దృష్టి పెడితే బాగుంటుంది.దేశంలో ఏమి జరుగుతున్నది అనే విషయాన్ని ప్రధాని అర్థం చేసుకున్న తర్వాతే మాట్లాడితే చాలా బాగుంటుంది'అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో నాకు ఏమీ వ్యక్తిగత విభేదాలు లేవని ఆయన స్పష్టంచేశారు. నాకంటే గొప్పోడు ఎవరూ లేనట్లుగా నరేంద్ర మోదీ స్వీయ ప్రగల్భాలు పలుకుతున్నారు. మా పూర్తి మద్దతు సాయుధ బలగాలకే ఉంటుంది అని మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. ఇంతకుముందు ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ మిలిటరీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చానని చెప్పారాయన. అయితే ఆయన ఆర్మీకే పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడు తానే చేశానని ఆయన ఎందుకు గొప్పలు చెప్పుకుంటున్నారని ఖర్గే ధ్వజమెత్తారు. స్వీయ ప్రగల్భాలు మంచిది కాదని హితవు ఖర్గే హితవు చెప్పారు. సున్నితమైన సమయాలలో రాజకీయ సంయమనం పాటించడం ఎంతో అవసరమని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే నొక్కిచెప్పారు. ప్రసుత్తం పరిస్థితి సాధారణంగా ఉన్నదని మాత్రం మేం చెప్పదల్చుకోలేదని ఆయన స్పష్టం చేశారు. మన ఆర్మీ ఉన్నంత కాలం మనం అందరం సురక్షితంగానే ఉంటామని, అందుకే కాంగ్రెస్ పార్టీ సాయుధ బలగాలకు మద్దతుగా నిలుస్తున్నదని ఖర్గే చెప్పారు

## చాలు..చాలు ఆరోపణలు ఆపండి

**ఐక్యరాజ్యసమితి ప్లీనరీ సెషన్‌లో పాక్‌కు భారత్ హెచ్చరిక**



**న్యూఢిల్లీ :** సరి'హద్దు'లు మీరి విరామం లేకుండా ఉగ్రవాద చర్యలకు పాల్పడటం ద్వారా సింధు జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్ ఇక ఇతరులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని భారత ప్రభుత్వం హెచ్చరిక చేసింది. పాకిస్థాన్ భూభాగంమీద పెంచిపోషించిన అసంబద్ధమైన సరిహద్దు ఉగ్రవాదం సింధు నదీ జలాల ఒప్పందం అమలుకు ఆటంకంగా మారిందని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. తజికిస్థాన్‌లోని దుషన్‌బే హిమనీ నదాలపై గడచిన శుక్రవారం నాడు జరిగిన ఐక్యరాజ్యసమితి మొదటి ప్లీనరీ సమావేశంలో భారత పర్యావరణ మంత్రిత్వశాఖ సహాయమంత్రి కీర్తీ వర్ధన్ సింగ్ మాట్లాడుతూ,సరిహద్దుల్లోంచి ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడం ద్వారా పాకిస్థాన్ దేశమే తనంతట తానుగా సింధు నదీ జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించిందని స్పష్టం చేశారు. ''ఈ వేదికను పాకిస్థాన్ దుర్వినియోగం చేసింది, ఈ ప్లీనరీ సమావేశంలోని అంశాలతో సంబంధం లేకపోయినప్పటికీ చాలా అసంబద్ధంగా సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్థావించి వేదికను దుర్వినియోగం చేయడం ద్వారా భారత్‌ను భయపెట్టాలని, ఆందోళనకు గురిచేయాలని పాకిస్థాన్ ప్రయత్నం చేసింది'' అని కీర్తీ వర్ధన్ గట్టి సమాధానం చెప్పారు.

సింధునదీ జలాల ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత ఇప్పటికి పరిస్థితుల్లో గణనీయమైన మౌలిక మార్పులు సంభవించాయనీ ఈ మార్పులు ఎవరూ కాదనలేని, తిరుగులేని వాస్తవాలని మంత్రి కీర్తీ వర్ధన్ సింగ్ ప్లీనరీ సమావేశంలో చెప్పారు. పరిస్థితులకు, ఇరుదేశాల బాధ్యతలకు అనుగుణంగా సింధునదీ జలాల ఒప్పందాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.సాంకేతిక పరమైన అడ్వాన్స్‌మెంట్, భౌగోళికపరమైన మార్పులు,వాతావరణ మార్పులు వంటి అనేక అంశాలు కొత్తగా తెరమీదకు వచ్చాయనీ, ఇప్పుడు సరిహద్దు ఉగ్రవాదం బెడద కొనసాగుతున్నందువల్ల వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకుని ఈ మార్పులకు అనుగుణంగా సింధు నదీ జలాల ఒప్పందాన్ని పునఃసమీక్షించాల్సిన ఆవశ్యకత ఉందని ఉద్ఘాటించారు. ఈ ఒప్పందంలోని పీఠికలో ఎన్నో కీలకమైన విషయాలు ఉన్నాయని ఆయన గుర్తుచేస్తూ, పరస్పర ప్రయోజనాలను కాపాడుకునేందుకు కాలక్రమేణా ఏర్పడిన పరస్పర విశ్వసనీయత, మైత్రీబంధం స్ఫూర్తి వంటి అనేక అంశాలపై ఒప్పందం ఆధారపడి ఉంటుందని పీఠిక స్పష్టం చేసిందని మంత్రి గుర్తుచేశారు. అందువల్ల రెండు దేశాలమధ్య ఒప్పందం అమలు చేయడానికి కాలగతిలో క్రమంగా ఏర్పడే పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమైనదని స్పష్టం చేశారు. ''ఒప్పందంలో ఈ విషయాలు ఉన్నప్పటికీ కూడా పాకిస్థాన్ విరామం లేకుండా ద్వేషభావంతో సరిహద్దుల్లోంచి ఉగ్రవాదాన్ని భారత్‌పైకి ఉసిగొల్పిందని, ఒప్పందాన్ని దుర్వినియోగం చేసుకుని అందులో పేర్కొన్న నిబంధనలను ఉల్లంఘించిందని కీర్తీ వర్ధన్ సింగ్ ఐక్యరాజ్యసమితి ప్లీనరీ సమావేశంలో అందరికీ భారత్ వైఖరిని తెలియజేశారు.సింధునదీజలాల ఒప్పందం భారత్‌–పాకిస్థాన్ దేశాలమధ్య 1960లో జరిగింది. ప్రపంచ బ్యాంకు కూడా ఈ ఒప్పందంపై సంతకం చేసింది. ఐక్యరాజ్యసమితి ప్లీనరీ సమావేశానికి సమితిలోని 80 సభ్యదేశాలకు చెందిన 2,500 మంది ప్రతినిధులతోపాటు 70 అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయి. మూడురోజులపాటు జరిగిన ఈ ప్లీనరీ సమావేశం శనివారంనాడు ముగిసింది.

### ఒప్పందాన్ని ఆయుధంగా మార్చుకుంటే సహించం:షరీఫ్

సింధునదీ జలాల ఒప్పందాన్ని ఒక ఆయుధంగా మార్చుకుంటే సహించేదిలేదని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్‌షరీఫ్ భారత్‌కు హెచ్చరించారు. హిమనీనదాల పరిరక్షణపై ఐక్యరాజ్యసమితి మొట్టమొదటిసారి నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో శుక్రవారం నాడు షరీఫ్ మాట్లాడుతూ, ఒక ఆయుధంలా మార్చుకుని ఒప్పందాన్ని రద్దుచేస్తే సహించబోమన్నారు. ఒప్పందాన్ని రద్దు చేసి పాకిస్థాన్‌లో ఉన్న 24 కోట్ల మంది ప్రజల జీవితాలను తమ రాజకీయ ప్రయోజనాలకోసం ప్రమాదంలోకి నెట్టేసి హద్దుమీరితే చూస్తూ ఊరుకోమన్నారు. ''భారతదేశం ఏకపక్షంగా, అక్రమంగా సింధునదీ జలాల ఒప్పందం అమలును రద్దుచేసింది. సింధునదీ పరీవాహక జలాలను పరస్పరం పంచుకోవాలి, ఇది చాలా విచారించదగిన విషయం'' అని షెహబాజ్ షరీఫ్ చెప్పినట్లు పాకిస్థాన్ దినపత్రిక 'డాన్' వెల్లడించింది. పాకిస్థాన్ కేంద్రంగా చేసుకుని పనిచేస్తున్న నిషేధిత లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలో దాడిచేసి 26 మంది పర్యాటకులను మతం ప్రాతిపదికపై గుర్తించి కాల్చి చంపారు. దీంతో పాకిస్థాన్ దుష్ప్రవర్తనను అడ్డుకునేందుకు భారత ప్రభుత్వం అనేక దండనాత్మక చర్యలు తీసుకుంది. ఈ దండనాత్మక చర్యల్లో భాగంగా సింధు నదీ జలాల ఒప్పందాన్ని కూడా రద్దుచేసింది.దీనిని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

## ఆ ఉపాధ్యాయుడిని విడుదల చేస్తున్నాం

**విద్యార్థిని తిట్టడంతో ఆత్మహత్య చేసుకున్న కేసులో గురువుకు 'సుప్రీమ్' ఊరట**

**విడుదలకు నిరాకరించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను 'బెంచ్' కొట్టివేత**

**న్యూఢిల్లీ :** ఒక విద్యార్థిని దూషించి ఆత్మహత్యకు కారకుడయ్యాడనే అభియోగాన్ని ఎదుర్కొంటున్న ఒక నిందితుడిని సుప్రీంకోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. నిందితుడు ఒక పాఠశాలతో పాటు హాస్టల్ ఇన్‌చార్జిగా కూడా ఉన్నాడు. మరొక విద్యార్థి ఫిర్యాదుతో అతడు ఒక విద్యార్థిని తిట్టడంతో తన గదిలోకి వెళ్లిన ఆ విద్యార్థి తనకు తానే ఉరివేసుకుని చనిపోయాడు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ సందర్భంగా మాట్లాడుతూ తిట్టడంతో ఇంతటి విషదానికి పాల్పడతారని ఏ ఒక్కరూ ఊహించి ఉండరని తెలియజేసింది. భారత శిక్షాస్మృతిలోని 306 సెక్షన్ కింద దూషించిన ఉపాధ్యాయుడిని విడుదల చేయడానికి నిరాకరించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయాన్ని పూర్తిగా పరిశీలించిన తర్వాత, ఈ కేసులో జోక్యం చేసుకోవడం సముచితం అని మేం భావిస్తున్నాం. 'ఒక విద్యార్థి ఫిర్యాదు ఆధారంగానే తాను ఆ విద్యార్థిని తిట్టడం జరిగిందని అప్పీల్‌దారు సరిగ్గానే సమర్పించినట్లుగా భావిస్తున్నాం. తిట్టినందువల్ల విద్యార్థి తన ప్రాణాలు తీసుకుంటాడని ఏ ఒక్కరూ, ఇంత విషాదం సంభవిస్తుందని ఏ సాధారణ వ్యక్తి కూడా ఊహించి ఉండదు' అని ధర్మాసనం తెలిపింది.'ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఆ విద్యార్థిపై మరొక విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పరిష్కార చర్యలు చేపట్టడంలో భాగంగా ఆ విద్యార్థిని ఉపాధ్యాయుడు తిట్టడం అనేది చాలా తక్కువ విషయంగానే భావిస్తున్నాం' అని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ కోర్టు పరిగణించబడిన అభిప్రాయం ప్రకారం, అటువంటి ఆమోదయోగ్యమైన వాస్తవ స్థానం కింద, అప్పీల్‌దారుడికి ఎటువంటి కారణం (తప్పు జరిగిందనే జ్ఞానం) ఉండకూడదని, మరణించిన వ్యక్తి ఆత్మహత్య ఆత్మహత్య తగ్గింపు విషయానికి వస్తే ఇంకా చాలా తక్కువేనని ధర్మాసనం చెప్పింది. మరొక విద్యార్థి ఫిర్యాదు మేరకు తప్పుచేసిన విద్యార్థిని తాను మందలించడం అనేది సమర్థనీయమేనని, ఎందుకంటే ఆ విద్యార్థి మరోసారి తప్పును పునరావృతం చేయకుండా మందలించడం జరిగిందని ఉపాధ్యాయుడు, హాస్టల్ ఇన్‌చార్జి తన న్యాయవాది ద్వారా విన్నవించడం జరిగింది. హాస్టల్‌లో శాంతిని, ప్రశాంతతను కాపాడటానికి తాను సంరక్షుడి హోదాలో మందలించడం మాత్రమే చేశానని వాదించాడు. మరణించిన విద్యార్థికి, తనకు మధ్య ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని తన పిటిషన్ ద్వారా స్పష్టం చేశాడు.



# ప్రపంచం
WORLD NEWS

## రష్యాలో రెండు వంతెనలు పేల్చివేత: ఏడుగురు మృతి



మాస్కో : రష్యాలో స్వల్ప వ్యవధిలో రెండు వంతెనలు కుప్పకూలాయి దీనిని ఉగ్రవాద పేలుడు చర్యగా భావిస్తున్నారు. బ్రయాన్స్క్ ప్రాంతంలో, ఉక్రేన్ సరిహద్దుల్లో రైల్వే ట్రాక్ పైనుండి వెళ్ళే రెండు రోడ్ బ్రిడ్జి ధ్వంసం అయ్యాయి. రెండు రైళ్ల పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించారు. 71 మంది గాయపడ్డారు. టాస్ వార్తాసంస్థ ఆదివారనాడు ఈ విషయం వెల్లడించింది. రోడ్డు బ్రిడ్జి శనివారం రాత్రి 8.20 గంటలకు కూలిపోయింది. మరో బ్రిడ్జ్ ఆదివారం తెల్లవారుజామున కూలిపోయింది దీనిపై రష్యా రవాణా దర్యాప్తు సంస్థ దర్యాప్తు ప్రారంభించింది.

# షేక్ హసీనాను తీసుకురండి

### బంగ్లా దర్యాప్తు అధికారులకు ఐసిటి ఆదేశం



ఢాకా: మానవహత్యాకాండకు పాల్పడిన కేసులో పదవీచ్యుతురరాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాతోపాటు ముగ్గురిని ఈనెల 16వ తేదీన తమ ఎదుట హాజరుపరచాలని బంగ్లాదేశ్ దర్యాప్తు అధికారులకు ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్ (ఐసిటి) ఆదివారంనాడు ఆదేశించింది. హసీనాతోపాటు బంగ్లాదేశ్ హోంశాఖ మాజీ మంత్రి అసదుజ్జామల్ ఖాన్ కమల్, మాజీ పోలీస్ డైరెక్టర్ జనరల్ చౌధుర్ అబ్దుల్లా అల్ మమ్‌లను కూడా తమ ముందు తెచ్చి నిలబెట్టాలని ఐసిటి ఆదేశించింది. దర్యాప్తు అధికారులు దాఖలు చేసిన ఛార్జిషీటును ఐసిటి ఆమోదించింది. వారిని రాబోయే 15 రోజుల తర్వాత తమ ముందు నిలబెట్టాలని కోరింది. గత ఏడాది జులైనెలలో హసీనా ప్రభుత్వం మానవత్వానికి వ్యతిరేకంగా తీవ్ర నేరాలకు పాల్పడిందని, చట్టవిరుద్ధంగా అనేకమందిని హతమార్చిందని, 2013లో కూడా హిఫజత్ ఏ ఇస్లాం ర్యాలీలో అనేకమందిని అన్యాయంగా చంపారని దర్యాప్తు అధికారులు చేసిన ఆరోపణల పత్రాన్ని ఐసిటి సమ్మతించి పై ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తు సంస్థ మే 12వ తేదీన తన నివేదికను ఐసిటికి సమర్పించింది. ఐసిటి ఆ నివేదికను అధ్యయనం చేసి సమ్మతించి ఈ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతోపాటు హసీనా, ఆమె కుటుంబ సభ్యులపై మరో రెండు కేసులు కూడా నమోదయ్యాయి.హసీనా ప్రభుత్వం జులైలో 1500 మందిని చట్టవిరుద్ధంగా చంపారనీ,25,000 మంది గాయపడగా, లెక్కలేనంతమందిని దారుణంగా హింసించారనీ దర్యాప్తు అధికారులు ఆరోపణ పత్రంలో పేర్కొన్నారు.

## తైవాన్ మా అంతర్గత సమస్య, జోక్యం చేసుకోవద్దు

### అమెరికాకు చైనా హెచ్చరిక




బీజింగ్ : నిప్పుతో చెలగాటం ఆడొద్దని అమెరికాకు చైనా హెచ్చరిక చేసింది. దక్షిణ చైనా సముద్రంలో తైవాన్ సమస్యను అమెరికా భూతద్దంలో చూపిస్తోందని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ఆదివారంనాడు విమర్శించింది. అమెరికా చెబుతున్న "చైనా బెదిరింపు సిద్ధాంతం'' వ్యాఖ్యలు పూర్తిగా రెచ్చగొట్టేవిగా ఉన్నాయని విమర్శించింది. తైవాన్ సమస్య పూర్తిగా చైనా అంతర్గత సమస్య అని అందులో జోక్యం చేసుకోవద్దని కోరింది. తమ అంతర్గత సమస్యలో జోక్యం చేసుకునే హక్కు ఏ విదేశానికీ లేదని చైనా విదేశీమంత్రిత్వశాఖ హెగ్సత్‌కు హెచ్చరిక చేసింది. అమెరికా—చైనా మధ్య ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొట్టడంకోసం పూర్వపు సోవియట్ యూనియన్‌కు, అమెరికాకు మధ్య జరిగిన గతకాలపు ప్రచ్ఛన్నయుద్ధ మనస్తత్వంతో అమెరికా రక్షణశాఖామంత్రి పీట్ హెగ్సెత్ మాట్లాడుతున్నారని, చైనాపై అప్రతిష్ఠాకరమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించింది. ప్రాంతీయ స్థిరత్వాన్ని చెడగొట్టే పనులు వెంటనే ఆపేయాలని, ప్రాదేశిక శాంతి—సుస్థిరతలకోసం చేస్తున్న కృషిని గౌరవించాలని అమెరికాకు విజ్ఞప్తి చేసింది. ఉన్న ఉద్రిక్తతలకు ఆజ్యంపోసి వాటిని పెనుభూతంలా చిత్రీకరించే చర్యలకు అమెరికా దూరంగా ఉండాలని కోరింది. సింగపూర్‌లో చైనా దౌత్యకార్యాలయం కూడా ఫేస్‌బుక్‌లో ఒక పోస్టింగ్ పెడుతూ, హెగ్సత్ ప్రసంగం ఉద్రిక్తతలకు ఆజ్యం పోసేవిగా ఉన్నాయని విమర్శించింది.

తైవాన్‌కు చైనా అతిపెద్ద బెదదగా మారిందనందువల్ల ఆసియా దేశాలు తమ తమ రక్షణ బడ్జెట్‌లను గణనీయంగా పెంచాలని సింగపూర్‌లో శనివారంనాడు ఆసియా దేశాల సైనికాధికారుల ఉన్నతస్థాయి సమావేశంలో హెగ్సెత్ చెప్పడంపై చైనా తీవ్రంగా స్పందించింది. ఆసియా ప్రాంతంలో చైనా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని ప్రయత్నం చేస్తోందని, తైవాన్ స్వాతంత్ర్యానికి చైనా పెద్ద సమస్యగా మారిందని హెగ్సెత్ అన్నారు. హెగ్సెత్ ప్రసంగంపై చైనా విదేశాంగమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. దక్షిణ చైనా సముద్రంలో శాంతి—సుస్థిరతలను అమెరికా తక్కువచేసి మాట్లాడుతోందని, అస్థికరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది.

## పోలెండ్ అధ్యక్షపదవికి రన్నాఫ్ పోలింగ్

వార్సా : పోలెండ్ అధ్యక్ష ఎన్నికల రన్నాఫ్ పోలింగ్ ప్రక్రియ ఆదివారంనాడు జరిగింది. ఈ రెండో విడత ఎన్నికలో అధ్యక్షపదవి ఎవరిని వరిస్తుందో తేలిపోతుంది. యూరోపియన్ యూనియన్‌తో పోలెండ్‌దేశ సంబంధాల భవిష్యత్తు కూడా ఈ రన్నాఫ్ పోలింగ్‌పైనే ఆధారపడి ఉంది. వార్సా మేయర్‌గా పనిచేసిన యూరోపియన్ యూనియన్ అనుకూల లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థి రఫాల్ ట్రజాస్కోవ్‌స్కీ (53), లా అండ్ జస్టిస్‌పార్టీకి చెందిన అభ్యర్థి, చరిత్రకారుడు కరోల నవ్రోకీ (42 ) మధ్య ప్రధానపోటీ నెలకుంది. ఉదయం ఏడు గంటలకు మొదలైన ఓటింగ్ రాత్రి తొమ్మిది గంటలవరకూ కొనసాగింది. పోలెండ్ వారసత్వ సంప్రదాయాలను, విలువలను కాపాడతానని నవ్రోకీ ప్రచారం చేస్తున్నారు. యూరప్ దేశాలతో నిర్మాణాత్మక సంబంధాలు ఏర్పాటు చేస్తానని ట్రజాస్కోవ్‌స్కీ వాగ్దానం చేశారు.

# పదిమంది బందీల విడుదలకు హమాస్ సంసిద్ధత

### గాజాలో యుద్ధ విరమణకు డిమాండ్



గాజా : గాజాలో పూర్తిగా యుద్ధాన్ని విరమిస్తామని హామీ ఇవ్వాలని, అమెరికా మద్దతుతో చేసిన శాంతి ఒప్పంద ప్రతిపాదనలో మార్పులు చేయాలని హమాస్ ఉగ్రవాద సంస్థ డిమాండ్ చేసింది. కానీ మధ్య ప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక ప్రతినిధి విట్‌కాఫ్ మాత్రం హమాస్ కోరిన మార్పులను తిరస్కరించారు. శాంతి ఒప్పందానికి తాము సుముఖంగా ఉన్నామని, కానీ ఈ శాంతి ప్రతిపాదనలో ఎక్కడా యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామన్న హామీ ఇవ్వలేదని హమాస్‌కు చెందిన ఉన్నతస్థాయి అధికారి బాసెమ్ నైమ్ పేర్కొన్నట్లు మధ్య ప్రాచ్య మీడియా ఆదివారంనాడు ప్రకటించింది. గాజాలో యుద్ధాన్ని విరమించి ఇజ్రాయెల్ గనుక సైన్యాన్ని పూర్తిగా వెనక్కు తీసుకువెళ్ళిపోతే అమెరికా ప్రతిపాదించిన ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని, తమ వద్ద సజీవులుగా ఉన్న 10 మంది బందీలను విడుదల చేస్తామని, మరో 18 మంది బందీల మృతదేహాలు కూడా స్వాధీనం చేస్తామని ఆయన పేర్కొన్నారు. వారం రోజులక్రితం విట్‌కాఫ్ చేసిన ప్రతిపాదనకు తాజా ప్రతిపాదనకు చాలా తేడా ఉందని ఆయన అన్నారు. విట్‌కాఫ్ తమ విజ్ఞప్తికి స్పందించకుండా కొత్త ప్రతిపాదన ముందుకు తెచ్చారని నైమ్ విమర్శించారు. గాజాలో పూర్తి యుద్ధ విరమణ ప్రతిపాదనను తాము విట్‌కాఫ్‌కు అందజేశామన్నారు. బందీల విడుదలకు,మృతదేహాల స్వాధీనానికి హమాస్ చేసిన విజ్ఞప్తిని విట్‌కాఫ్ తిరస్కరించారు. ముఖాముఖీ చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావాలని, తాము చెప్పిన ప్రతిపాదనలను అంగీకరించి తీరాలని, తద్వారా 60 రోజుల కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని విట్‌కాఫ్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ కూడా విట్‌కాఫ్ ప్రకటనను సమర్థించారు. హమాస్ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. యుద్ధం కొనసాగడానికి హమాస్ వైఖరే ప్రధాన కారణమని విమర్శించారు.

**దాడుల్లో 31మంది మృతి**

గాజాలో ఆదివారంనాడు రఫా, నెట్జారిమ్ కారిడార్‌లలో ఇజ్రాయెల్ చేసిన విచ్చలవిడి దాడుల్లో 31 మంది మరణించారు. డజన్ల సంఖ్యలో పాలస్తీనా ప్రజలు గాయపడ్డారు. ప్రజలు ఆహారంకోసం నానా తిప్పలూ పడుతూ సహాయ కేంద్రాలవద్ద ఆహారం దొరుకుతుందనే ఆశతో గుంపులు గుంపులుగా పరుగుతున్న సమయంలో వారిపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసిందని గాజాలో ఆరోగ్యమంత్రిత్వశాఖ, ఇతర సాక్ష్యులు చెప్పారు. ఇజ్రాయెల్ మద్దతుగల ఆహార సహాయ ఫౌండేషన్ కేంద్రానికి ఒక కి.మీ దూరంలో ఈ దాడులు జరిగాయి. తొలుత రెడ్‌క్రాస్ నడుపుతున్న ఆసుపత్రి వెలుపల జరిపిన కాల్పుల్లో 21 మంది మరణించారని చెప్పారు.

## లబ్ధిదారుల గుర్తింపు

(3వ పేజీ తరువాయి)

అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఒక్క అనర్హునికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దన్నారు. ఈ అంశంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన అధికారుల కమిటీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికలోని అంశాలను భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులకు వివరించారు. దీనిపై కేబినెట్ లో చర్చించి సమస్యల పరిష్కారానికి ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రులు అభినందించారు.

## 9 మందికి శౌర్య పతకాలు

(3వ పేజీ తరువాయి)

17 మందికి సేవా పతకాలు లభించాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఒకరికి ఉత్తమ సేవా, ఐదుగురికి సేవా పతకాలు దక్కాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఒకరికి మహోన్నత సేవా, ముగ్గురికి ఉత్తమ సేవా, 15 మందికి సేవా పతకాలను వచ్చాయి. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ శాఖలో ఇద్దరికి శౌర్య పతకం, ఒకరికి మహోన్నత పతకం, ముగ్గురికి ఉత్తమ సేవా, 14 మందికి సేవా పతకాలు దక్కాయి.

## ఆగని గోవుల మృత్యు ఘోష

(3వ పేజీ తరువాయి)

సమర్పించిన కోడెలను ఆలయ గోశాలలో ఉంచడం ఆనవాయితీ, కానీ పరిమితికి మించి ఎక్కువ కోడెలను కోడెల దొడ్డిలో నిలువ ఉంచడంతో తోకేసలాట ద్వారా, అదేవిధంగా, జెర్సీ జాతికి సంబంధించిన కోడెలను దేశి వాలి కోడెలను ఒకే స్థలంలో ఉంచడంతో కుమ్ములాడు కోవడంతో గాయాలపాలై, కాలు విరిగి, నడవలేని స్థితిలో, వర్షం బురదలో అస్వస్థతకు గురై మరణిస్తున్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ ఆలయ అధికారులు గోశాల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఎక్కువ సంఖ్యలో కోడెలు మరణానికి గురవుతున్నాయి. కలెక్టర్ పరిశీలించి వెటర్నరీ డాక్టర్లను పురమాయించినప్పటికీ, కోడెలను మృత్యువాత నుండి కాపాడలేకపోతున్నారు. భక్తులు సమర్పిస్తున్న కోడెలను రైతులకు అందించి వ్యవసాయానికి ఉపయోగపడేలా వాడుకోవాలని వారి పాసు బుక్కులను పరిశీలించి ఇచ్చినప్పటికీ, కొంతమంది దళారులు అక్రమ మార్గంలో వాటిని కళేబళాలకు తరలిస్తున్నట్లు గతంలో రుజువైంది ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని కోడెలను కాపాడాలని కోరుతున్నారు.

## యుద్ధాన్ని నిలిపేయాలి

(3వ పేజీ తరువాయి)

పౌరులను చంపివేశారు, 1లక్షా 22 వేల మంది గాయపడ్డారు, మార్చ్ 18 న ప్రకటించిన సీజ్ ఫైర్ ను ఇజ్రాయెల్ ఉల్లంఘించింది ,కేవలం రెండునెలల్లో 3600 మంది పౌరులు హతులయ్యారు, పలస్తీనియన్ల నరమేధాన్ని నిలిపివేయాలి, యుద్ధాన్ని బేషరతుగా నిలిపివేసేట్టుగా ఐరాస తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పూర్వపు పెన్షనర్లకు , భావి పెన్షనర్లకు మధ్య వివక్ష చూపే విధంగా పెన్షన్ నియమాలను మారుస్తూ బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎఐటియుసి ఒక తీర్మానంలో వ్యతిరేకించింది. వివక్షలేకుండా అందరికీ పించను ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ పరిశ్రమల నుండి వాటాల ఉపసంహరణ, పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల ప్రైవేటీకరణ విధానాలను వెనక్కు తీసుకోవాలని ఎఐటియుసిమరోతీర్మానంలోకోరింది.అంగన్‌వాడీ,ఆశా, మధ్యాహ్న భోజనం తదితర పథకాలలో పనిచేస్తున్న సిబ్బందికి కార్మికుల స్థాయి కల్పించి కార్మిక చట్టాలు అమలు చేయాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది.ప్లాట్‌ఫామ్, యాప్ ఆధారిత సేవల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎలాంటి చట్టాలు లేవని, వారు పీస్ రేట్ వర్కర్ల స్థాయిలో కూడా లేరని వారిని ఆయా సంస్థల ఉద్యోగులుగా పరిగణించాలని, వారికి 26వేలరూపాయల కనీసవేతనం ఇవ్వాలని, వారికి సామాజిక భద్రత కల్పించాలని ఎఐటియుసి ఒక తీర్మానంలో కోరింది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని దృష్టిలో ఉంచుకుని అందరికీ గౌరవ ప్రదమైన ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ విద్యార్థి, యువజనులతో కలిసి ఒక జాతీయ ఉద్యమాన్ని చేపట్టాలని ఎఐటియుసి నిర్ణయించింది. వృత్తి సంబంధ భద్రత, సురక్షితమైన పనిపరిస్తితులు కల్పించాలని, ఐ.ఎల్.ఓ. ఆమోదించిన 155, 187 తీర్మానాలను అమలు చేయాలని, భద్రతపై తెచ్చిన లేబర్ కోడ్ ను ఉపసంహరించి పాత చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు విఫలం అయ్యాయని, విధానాలలో సంపూర్ణమైన దిశామార్పు తేవాలని ఎఐటియుసి ఒక తీర్మానంలో డిమాండ్ చేసింది. కనిసవేతన హామీని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలని ఎఐటియుసి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఐట రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులను ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో భాగం చేయాలని , కొన్ని రాష్ట్రాలలో సెక్యూరిటీ ఏజెన్సీలలో పనిచేస్తున్న సిబ్బంది సంఘటితం అయ్యారని, వారిలో అత్యధికులు వలస కార్మికులనీ, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని, సెక్యూరిటీ సిబ్బంది సంఘాన్ని అఖిలభారత స్థాయిలో విస్తరించి పటిష్టం చేయాలని త్వరలో జాతీయ సమావేశం జరపాలనికౌన్సిల్ నిర్ణయించింది. త్వరలో గ్రామ పంచాయతీ వర్కర్స్ జాతీయ సమావేశం నిర్వహించాలని, బ్యాంక్ ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలు, బీమా ఉద్యోగుల జాతీయ మహాసభలు నిర్వహించడానికి తోడ్పడాలని ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ నిర్ణయించింది. కనీసవేతనాల పెంపుదలపైరాష్ట్రాలలోఉద్యమించాలని,అన్నిరాష్ట్రాల్లోకనిసవేతన కమిటీలు ,బోర్డులు ఏర్పాటు చేసేటట్లు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. ట్రేడ యూనియన్లను క్రమబద్ధంగా నిర్వహించడంపై , ట్రేడ యూనియన్ ఎడ్యుకేషన్ , కార్యకర్తల శిక్షణపైదృష్టి పెట్టీ పనిచేయాలని కౌన్సిల్ సూచించింది. జనరల్ కౌన్సిల్ సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిన రాజస్థాన్ రాష్ట్రసమితికి, క్రమశిక్షణతో సేవలు అందించిన వలంటీర్లకు సమావేశం జేజేలు చెప్పింది.

## అవతరణోత్సవం

(3వ పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. ఈ క్రమంలో కితాక్యుషూ మేయర్‌ను హైదరాబాద్‌కు సిఎం ఆహ్వానించారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న సిటీ కితక్యూషూ, ఆనగరంలో గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. ప్రస్తుతం ఆ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. హైదరాబాద్ నగరంలో కూడా కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా కితాక్యుషూ తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఎంఒయులు చేసుకునే అవకాశం ఉన్నది.

## కమిటీయే ముద్దు

(3వ పేజీ తరువాయి)

ఎంపికలో నిరుపేదలకు చోటు దక్కడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. అధికారులు తమకు వచ్చిన దరఖాస్తుల్లో అతి పేదలను మొదటగా ఎంపిక చేయాల్సి ఉంది. కానీ ఆ స్వేచ్ఛ అధికారులకు లభించడం లేదు. ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన జాబితాలోని పేర్లకు సంబంధించి మాత్రమే అధికారులు పరిశీలన జరుపుతుండడం గమనార్హం. దశాబ్ద కాలం తర్వాత ఇందిరమ్మ పేరుతో సొంతింటి కల సాకారమవుతున్నందుకు ఆనందపడాలో అందులో చోటు దక్కనందుకు బాధపడాలో అర్థం కాని స్థితిలో ఇండ్లు లేని పేదలు ఉన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వెళ్లినప్పుడు ఇందిరమ్మ కమిటీలు పంపిన జాబితాలో అనర్హులు ఉన్నారు. వీటిపై నిర్ణయం తీసుకునే లోపే అధికార పార్టీ నేతల నుంచి అంతా మేముచూసుకుంటాంమీరు పరిశీలన పూర్తి చేసుకుని రండి అంటూ అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. అమాత్యులు చెప్పినట్లు అనర్హులకు ఇవ్వకుండా ఉండాలంటే రాజకీయ ఒత్తిళ్లకు తెరదించాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి లేదు. ఒక కాంగ్రెస్ నాయకునికి తన కు తన కుమారునికి రెండు పక్కా ఇండ్లు ఉండగా మధ్యలో ఉన్న ఖాళీ జాగా చూపి తన కుటుంబ సభ్యురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరాడు. ఆ పేరును స్థానిక రాజకీయాల దృష్ట్యా ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిఫారసు చేశారు. అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలన చేయగా అతనికి కారు, ట్రాక్టర్ ఉండడంతో పాటు ఆర్థికంగా వెసులుబాటు కలిగిన కుటుంబంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెనుదిరిగే లోపే ఆ జాబితా నుండి ఆ పేరును తొలగించవద్దు మేము ఉన్నతాధికారులతోమాట్లాడతాం మా ఎంఎల్ఎకు అతను చాలా ప్రధానమైన అనుచరుడు మీరు కాదంటే ఇబ్బంది తలెత్తుతుంది అంటూ అధికారులకు సమాచారమిచ్చారు.బహుశా జిల్లాలో ఇటువంటి ఘటనలు కొన్ని వందల సంఖ్యలో ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జరిగి ఉండవచ్చు. లబ్దిదారుల ఎంపిక నియమనిబంధనలకు లోబడి అతి పేదలకే చెందాలని లేకపోతే చర్యలంటూ అధికారులకు బాధ్యత అప్పగిస్తే కొంత మేర న్యాయం జరిగే అవకాశం ఉంది. మీరు అనర్హులకు ఇవ్వద్దు ఇందిరమ్మ కమిటీ మాట తప్పద్దు అంటే ఎలా అన్న ప్రశ్న ఇప్పుడు సర్వత్రా వినిపిస్తుంది. ఇందిరమ్మ కమిటీలకు సంబంధించిఅతి స్వల్ప గ్రామాలు మినహా ఎక్కువగా అధికార పార్టీ గ్రామ నాయకులతోనే కమిటీలు ఏర్పాటు చేశారు. అది కూడా గ్రామంలో వర్గాలను బట్టి వర్గానికి ఒకరు ఉండే విధంగా స్థానిక నాయకులు కమిటీలను ఏర్పాటు చేశారు. ఆమోదింపజేసుకున్నారు. ఇందిరమ్మ కమిటీలో ఉన్న వర్గ నాయకుడు తమ వాటాకు రావాల్సినవి ఇవ్వండి మేము పంచుకుంటామంటూ వాదనలకు దిగుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లక్ష్యం చాలా గొప్పది. సొంత స్థలం ఉండి గూడు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య విషయం కాదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఈ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ పథకం అమలులో కూడా లేదు. ఇంతటి గొప్ప పథకంలో అనర్హులకు చోటు దక్కితేఅదిప్రభుత్వానికి మచ్చగానే మిగులుతుంది. స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు దక్కకుండా ఆర్థిక వెసులుబాటు కలిగిన వారికి దక్కితే అది పేదలను వెక్కిరించినట్లే అవుతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వయంత్రాంగం గుర్తించాల్సి ఉంది. ఇక ఇందిరమ్మ మాటున ఇసుక దందా మొదలైంది. కొందరు మండలాధికారులు విచ్చలవిడిగానే ఇసుక కూపన్లనుజారీచేస్తున్నారన్నఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటివరకు ఇసుక రవాణా పట్ల కఠినంగా వ్యవహరించినప్పటికీ ఇక ముందు కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఇండ్ల లబ్దిదారులకు ఇబ్బందులు కలుగకుండా అక్రమార్కులకు చోటు ఇవ్వకుండా ఇసుక రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అభ్యంతరమేమిటి?

(3వ పేజీ తరువాయి)

టిపిసిసి అధ్యక్షులుబి.మహేశ్‌కుమార్‌గౌడ్, తెలంగాణ జన సమితి (టిజెఎస్) రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి దాసోజ్ శ్రవణ్‌కుమార్, శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులు, సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, వామపక్షాల నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య(సిపిఐ ఎంఎల్ న్యూడెమోకసీ) ఎం. హన్మేష్ (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మాస్ లైన్), ఎ.జానకిరాములు (ఆర్‌ఎస్‌పి), గాదె రవి (ఎంసిపిఐ),ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, సిహెచ్. మురారి (ఎస్‌యుసిఐ) తదితరులు ప్రసంగించారు.

**ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు : మహేష్ కుమార్**

సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అహింసకు పునాది అని, ప్రజాస్వామ్యంలో హింస ఏ వ్యక్తి చేసినా, ఏ సంస్థ చేసినా సమర్థించబోమన్నారు. ఒక శాతం ఉన్న ధనికులు 40 శాతం సంపదను, అట్టడుగువర్గాలు 3 శాతం సంపదను కలిగిఉన్నారని, ఇలాంటి ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకే మావోయిస్టులు, సిపిఐ ఎంఎల్ పార్టీలు పుట్టుకొచ్చాయన్నారు. రానురాను నక్సలిజం మార్గం తప్పి కొన్నిసార్లు వ్యక్తిగత కక్షలకు, ఘటనలకు పాల్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఏదేమైనా ఆపరేషన్ కగార్ పేరిట కర్రెగుట్టల్లో కేంద్ర ప్రభుత్వ హింసను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా చర్చలకు సిద్ధమన్న మావోయిస్టులపై ఫాసిస్టు ధోరణిని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదన్నారు. ప్రజాస్వామ్యంలో కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఉన్నదన్నారు. సీజ్ ఫైర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలతో ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**మావోస్టులను, ఆదివాసీలను చంపడం చట్ట విరుద్ధం : పశ్యపద్మ**

సమావేశంలో పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను, ఆదివాసీ బిడ్డలను చంపడం చట్టవిరుద్ధమన్నారు. ఈ ఏడాది మార్చి 24న శాంతి చర్చలకు సిద్ధం కావాలని ఇరుపక్షాలకు పీస్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి చేసిన నాలుగు రోజులకే తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ ప్రకటనతో మంచి వాతావరణం ఏర్పడుతుందని అందరూ భావించారన్నారు. కానీ కేంద్రం సాయుధ బలగాలను ఉసిగొల్పి ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను చంపేస్తూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా విజయంగా ప్రకటించుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆదాని, అంబానీల ముందు మోకరిల్లిన ప్రధాని మోదీ ఆర్థిక వ్యవస్థను వాళ్ల చేతుల్లో పెట్టేందుకే కగార్ ఆపరేషన్ చేపట్టారన్నారు. ప్రధాని మోదీ దిగివచ్చి మావోస్టులతో శాంతి చర్చలుజరపాల్సిందేనని, లేకపోతే పాలనను స్థభింపజేసేలా ఉద్యమాలు ఉధృతం చేసేందుకు భావసారూప్యత కలిగిన శక్తులన్నీ సమాయత్తం కావాలని, ఇందుకు ప్రజలను సమీకరించి చైతన్యవంతం చేయడంలో సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని పశ్య పద్మ చెప్పారు.

**మన దేశ పౌరులపై యుద్ధం సరికాదు**

ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌లలో మావోయిస్టులతోపాటు ఆదివాసీ బిడ్డలు ఉన్నారని చెబుతున్నారని, అలాంటి సమయంలో యుద్ధం చేయడం సబబుకాదన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిలకు ఉత్తరాలు రాసి, హింసాత్మక చర్యలు ఆపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఏం కావాలన్న ఆలోచన పాలకులకు ఉండాలన్నారు. దేశం కోసం, ధర్మ కోసం అంటున్న వారే కొన్ని కార్పొరేట్ కంపెనీలకు ఆపరేషన్ కగార్ పేరిట ఆర్థిక దోపిడీకి సహకరిస్తున్న కేంద్రం విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశంలో సమస్య ఏంటి? నక్సలైట్ ఉద్యమానికి కారణం ఏమిటి? మూలకారణం తెలుసుకోకుండా కేంద్రం అనాలోచిత నిర్ణయాలతో ముందుకెళ్తున్నదని పేర్కొన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలు, మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై జరుగుతున్న సమస్య దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఇలాంటి కేంద్రం చర్యలు ఆపాలంటే ఉధృతంగా ఉద్యమాలు కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్.ఎ. సంపత్ మాట్లాడుతూ మావోయిస్టులపై దమనకాండను ఆపాలని ప్రతి మనిషి గుండెలో ఉన్నదన్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ లేకుండా కేంద్రం విధానాలు ఉండటం దురదృష్టకరమన్నారు. ఛతీస్‌గఢ్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న తాను ఆపరేషన్ కగార్ ఆపాలని ఆ రాష్ట్ర సిఎంకు ఉత్తరం రాశానని గుర్తు చేశారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం నేత జీవన్‌కుమార్, సిపిఐ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు స్టాలిన్, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఇక సులభం

(3వ పేజీ తరువాయి)

82476 23578 వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి వెల్లడించారు. ఈ నూతన ప్రక్రియతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి కలిగే సందేహాలు నివృత్తి అవుతాయని, రిజిస్ట్రేషన్ ఆఫీస్ లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, సమయం అందుబాటు వంటి సమాచారం లభిస్తుందన్నారు. గిఫ్ట్‌డీడ్,సేల్ డీడ్‌పై రిజిస్ట్రేషన్ ఛార్జీలు మార్కెట్ ధరలు తదితర అన్ని అంశాలపై ఈ ఎఐ చాట్‌బాట్ మేధ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఇప్పటి వరకు ప్రయోగాత్మకంగా రెండు విడతల్లో 47 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయ్యేలా పారదర్శకంగా, అవినీతి రహితంగా మెరుగైన సేవలను అందించేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానంతో తాము అనుకున్న విధంగానే సత్ఫలితాలు వచ్చాయని, 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో పని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, ఇబ్రహీం పట్నం , సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సిబ్బందిని నియమించామన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి లంచ్ సమయాన్ని మినహాయించి సాయింత్రం 5 గంటల వరకూ స్లాట్ బుక్ చేసుకోవచ్చని సూచించారు. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్లు బుక్ అవుతాయన్నారు.స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకొస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**స్లాట్ బుకింగ్‌తో అదనంగా మూడువేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్**

మొదటి దశలో 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటి వరకు 30,592 డాక్యుమెంట్లు,రెండు దశలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మే 12నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయని, స్లాట్ బుకింగ్‌తో మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని మంత్రి పొంగులేటి తెలిపారు. అక్రమాలకు చెక్ పెట్టేలా లే అవుట్లలో డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు, పూర్తి కాని వాటి వివరాలు ఇటు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటు బిల్డర్ లేదా, డెవలాపర్ వద్ద వివరాలు ఉండేలా డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను త్వరలో తీసుకొస్తా మని చెప్పారు. ఈ మ్యాడుల్ లో రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు రెడ్ కలర్ లో కనిపిస్తాయన్నారు. స్లాట్ బుకింగ్‌తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్‌ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని, ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## కుటుంబ డ్రామా

(3వ పేజీ తరువాయి)

జరిగింది. ఈ సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిజెపిదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కొద్దిగా కష్టపడి ఉంటే 12 లేదా 13 ఎమ్మెల్యే సీట్లు గెలిచేవాళ్లమని తెలిపారు. దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీకి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజలకు వద్దకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనను వివరించాలన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి వికేంద్రీకరణ జరిగిందని, బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతి కేంద్రీకృతం అయిందని విమర్శించారు. కాంగ్రెస్ అధిష్టానానికి డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కలిసి రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టాయని విమర్శించారు.రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలన్నారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బిజెపి అధికారంలోకి రావాల్సిన అవసరముందన్నారు.తెలంగాణను కాపాడటం బిజెపి వల్లే సాధ్యమన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు, బిఆర్‌ఎస్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్ గౌడ్ నియామకం



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల మండల కేంద్రంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న ఆధ్వర్యంలో దేవరుప్పుల గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్ గౌడ్ ను ఎన్నుకున్న మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆకుల సంతోష్ గౌడ్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్పత్తి పెంచడానికి ఉద్యోగులు సమిష్టి కృషి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఏరియాలో ఉత్పత్తి పెంచడానికి ఉద్యోగులంతా సమిష్టిగా కృషి చేయాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి కోరారు. ఆదివారం జీఎం కార్యాలయం లోని సమావేశం మందిరంలో ఉత్పత్తి ఉత్పాదకాలపై నెలవారి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ నెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.88 లక్షల టన్నులు కాగా సాధించిన ఉత్పత్తి 3.19 లక్షల టన్నులు 82 శాతం సాధించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. బొగ్గు రవాణా లక్ష్యం 3.88లక్షల టన్నులు కాగా అందులో 3.39 లక్షల టన్నులు 87 శాతం బొగ్గు రవాణా సాధించడం జరిగిందని తెలిపారు. జూన్ నెల లక్ష్యం 3.54 లక్షల టన్నులు కాగా రవాణా 3.54 లక్షల టన్నులు లక్ష్యంగా ఉందని అన్నారు. సరస్వతి పుష్కరాలకు సింగరేణి సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని, బస్టాండ్ నుండి సరస్వతి ఘాట్ వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని జిఎం తెలిపారు.

## ముగిసిన నాయిని క్రికెట్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/హనుమకొండ :** నాయిని విశాల్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గడిచిన 14 రోజులుగా నిర్వహించిన నాయిని టి10 లీగ్ ఆదివారం వైభవంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.14 రోజుల పాటు నిర్వహించిన ఈ క్రికెట్ పోటీలలో మొత్తంగా 176 టీమ్ లు పాల్గొన్నాయని గెలిచిన వారిని ఓడిన టీమ్ సభ్యులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని ఊ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని కోరారు.రాజకీయాలకు అతీతంగా ఈ టోర్నమెంట్ రెండో సీజన్ ను విజయవంతంగా నిర్వహించామని,పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నాయిని విశాల్ రెడ్డి ఆత్మకు శాంతి కలుగుతుందని అన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఆడించిన టీమ్ నిర్వాహక బృందాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని అభినందించారు.ఫైనల్ లో తలపడిన రెండు జట్లు అలంకార్ ఫిరోజ్, కాజీపేట సురేష్ ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కాజీపేట సురేష్ టీమ్ ప్రథమ స్థానంలో నిలిచి కప్ తో పాటు రూ.100000 ల బహుమానం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.రెండో విజేతగా నిలిచిన అలంకార్ ఫిరోజ్ టీమ్ కప్ కు రూ.50000ల బహుమతిని అందజేశారు.ఈ కార్యక్రమలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుమార్తె అల్లుడు డాక్టర్ గోదా, విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ప్రతి క్రీడాకారుడూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అప్పుడే జీవితంలో కూడా నైతిక విజయాలకు దోహదపడుతుందని భూపాలపల్లి నియోజకవర్గ ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. చిట్యాల మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర కార్యదర్శి రమణ సూచనల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాట్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఆటల పోటీలను శనివారం నిర్వహించగా ఆటలు పూర్తి చేసుకున్న జూనియర్ క్రీడాకారులకు బహుమతులు సీనియర్ క్రీడాకారులకు ప్రథమ బహుమతి వరంగల్ కు ద్వితీయ బహుమతి ములుగన్పూర్‌కు తృతీయ బహుమతి రేగొండ మండల కన్పర్తి క్రీడా విజేతల కు ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. క్రీడల వల్ల శారీర మానసి దృఢత్వాన్ని పెంపొందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే అన్నారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించిన అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర జిల్లా స్థాయి క్రీడాకారులకు ఎంఎల్ ఎ జి ఎస్ ఆర్ శాలువలతో సన్మానించి మెమోటు అందజేశారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ, ఈ మారముల ప్రాంతంలో ఇంత మంది సీనియర్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ముందుకొచ్చి ఆటలాడడం చాలా గర్వంగా ఉందని ఇంకా ఈ ప్రాంతంలో ఎక్కువ మంది క్రీడా కారులను తయారు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రమణ, ఆర్ఎస్ఆర్, ఏఎంసి చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి దంపతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సీనియర్ క్రీడాకారులు,క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు రంగంలో రాణిస్తున్న యువ కాంట్రాక్టర్: శ్రీరామ్ రెడ్డి



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** కృషి, పట్టుదల ఉంటే అన్ని రంగాలలో రాణించవచ్చని ఓ యువ కాంట్రాక్టర్ నిరూపించాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనుల్లో భాగంగా యువ కాంట్రాక్టర్ కుంబం శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కెఎస్ఆర్ నిర్మాణ సంస్థ పుష్కర ఘాట్ స్నాన ఘట్టాల టెండర్ పనులను దక్కించుకుని నిర్మాణం పనులను ప్రారంభించింది. సరస్వతీ పుష్కరాల నిర్వహణకు సమయం చాలా తక్కువగా ఉండటంతో ఆయన పనులు అసంపూర్తిగా మిగిలిపోతాయనే పలువురి విమర్శలు, సందేహాలను అధిగమించిన యువ కాంట్రాక్టర్ కుంబం శ్రీరామ్ రెడ్డి ఏ మాత్రం నిరాశ చెందకుండా తన కార్యదీక్షతను పణంగా పెట్టి పట్టు వదలని విక్రమార్కుడిలా రాత్రింబవళ్ళు కష్టపడి పుష్కర ఘాట్ నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేసి తనకు తానే సాటిగా నిరూపించుకున్నాడు.సరస్వతి పుష్కరాలలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నవరత్న మాల హారతి తాను చేపట్టిన పుష్కర ఘాట్ నిర్మాణం వేదికగా నిర్వహించడం తనకు చాలా సంతృప్తి కలిగించిందని యువ కాంట్రాక్టర్ కుంబం శ్రీరామ్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా యువ కాంట్రాక్టర్ శ్రీరామ్ రెడ్డి 100 రూముల సత్రం భవన నిర్మాణం పనులను పూర్తి చేయగా సరస్వతీ పుష్కరాల్లో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు.

## కాపర్ వైర్లు దోచుకెళ్లిన దొంగల అరెస్ట్

**ప్రజాపక్షం/దామెర:** ఆత్మకూరు, దామెర, పరకాల, కమలాపూర్ మండలాల పరిధిలో వ్యవసాయం కోసం రైతులు ఏర్పాటుచేసుకున్న మోటార్లలో కాపర్ వైరును గుర్తుతెలియని వారు దొంగలించుకొని తీసుకెళ్లారు. కాగా దీనిపై రైతులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై శాయంపేట సీఐ రంజీత్‌రావు సూచనల మేరకు దామెర ఎస్సై కొంక అశోక్ తన సిబ్బందితో కలిసి ప్రతీ రోజు రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించి మోటార్లను పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైరును దొంగలించిన వారిని పట్టుకున్నారు. కాగా ఒరిస్సా రాష్ట్రం భద్రక్ జిల్లాకు చెందిన మాలిక్ రాజ్ కుమార్, ఖానాపురం మండలం అశోక్‌నగర్ చిలుకమ్మతండా గుగులోతు నవీన్ శనివారం పట్టుకోగా మొత్తం 153 కిలోల కాపర్ వైరు, ఒక స్కూటీ, రూ. 2000లను స్వాధీన పర్చుకున్నారు. త్వరితగతిన దొంగతనాల కేసులోని నిందితులను గుర్తించి పట్టుకుంటున్న ఎస్సై కొంక అశోక్, దామెర పోలీసు సిబ్బందిని శాయంపేట సీఐ రంజీత్‌రావు, పరకాల ఏసీపీ సతీష్ బాబు అభినందించారుఅభినందించారు.

# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేకడులు

### జాతీయ జెండా ఎగరవేయనున్న బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** సోమవారం జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరగున్నాయని, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జెండావిష్కరణ చేయనున్నారన్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఉదయం 10 గంటలకు జెండావిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 10.30 గంటలకు వరకు జిల్లా ప్రజలను ఉద్దేశించి విఫ్ బీర్ల అయిలయ్య జిల్లా అభివృద్ధిపై మాట్లాడాతారని, ఆ తరువాత కల్చరల్ పోగ్రామ్స్ ప్రైజ్ డ్రిస్టిబూషన్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాలో వ్యాసరచన, వకృత్వం తదితర పోటీలు నిర్వయించనున్నామన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల పంపిణీలో భాగంగా నియోజకవర్గంలోని సాయిరామ్ ఫంక్షన్ హాల్‌లో భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్ రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు అందజేస్తారని, అదే విధంగా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని పాలకుర్తి రోడ్డులో గల సిరిపురం గార్డెన్‌లో సాయంత్రి 4 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తారన్నారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని దశరథ్ గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3 గంటలకు అర్హులకు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు, లబ్ధిదారులు విజయవంతం చేయాలని కోరారు.

## దేశినేని హనుమంతరావుకు ఎంపి, ఎమ్మెల్యే నివాళులు

**ప్రజాపక్షం/కాజీపేట :** సీనియర్ నాయకులు దేశినేని హనుమంతరావు భౌతిక కాయానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య డాక్టర్ నజీర్, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమంతరావు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ సైకిల్ డే

### జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ప్రపంచ సైకిల్ డే సందర్భంగా యువజన, క్రీడల శాఖ అధికారి సి హెచ్ రఘు ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని స్థానిక కృష్ణ కాలనీ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు సైకిల్ ర్యాలీని భూపాలపల్లి స్థానిక ఎస్ఐ సాంబమూర్తి జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్ రెడ్డి, కోచ్ ఐశ్వర్య, క్రీడా కారులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

### 327 విద్యుత్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ శ్రీధర్



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం అని 327 విద్యుత్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఆర్టిజన్ నాయకులు ఆదివారం హనుమకొండ లోని పల్లా రవీందర్ రెడ్డి భవనంలో ఇనుగాల శ్రీధర్ ను కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 22,000 మంది ఆర్టిజన్ కార్మికుల జీవితాలలో వెలుగులు నింపడం కోసం సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు ఆర్టిజన్ కార్మికుల సమస్యలు, సర్వీస్ రూల్స్, దశలవారి కన్వర్షన్ ఆర్టిసన్, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక అపరిష్కృత సమస్యల పై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం సెక్రటరీ జనరల్ శ్రీధర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను రెండు రోజుల్లో కలిసి ఆర్టిజన్ కార్మికుల సమస్యలను తెలియజేస్తామని, పరిష్కారం కానీ ఎడల విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి ఆర్టిజన్ కార్మికుల తోటి నాలుగు కంపెనీలలో ధర్నాలు నిర్వహించడానికి కూడా వెనకాడమని అన్నారు. అయినా సమస్యలు పరిష్కారం కానీ ఎడల సమ్మె కైనా వెళ్లడానికి ఐఎన్టీయూసి 327 ప్రభుత్వ అనుబంధ సంఘం సిద్ధంగా ఉందని సెక్రటరీ జనరల్ శ్రీధర్ తెలిచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్ నాయకులు దరావత్ సికిందర్, వల్లాల యుగంధర్, పప్పు వెంకటేశ్వర్లు, చింతలపూడి సతీష్, గన్ను నరేందర్ రెడ్డి, చెన్నవేని బాబాన్న, సతీష్ రెడ్డి , సలీం పాషా, శ్రీనివాసరెడ్డి, అటికేటి రవీందర్, వివిధ జిల్లాల నుండి వచ్చినటువంటి ఆర్టిజన్ నాయకులతో పాటుగా ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, తెలంగాణ ఐఎన్టీయూసి మహిళా అధ్యక్షురాలు తులసి, వరంగల్ జిల్లా సెక్రటరీ బుచ్చయ్య గౌడ్, భువనగిరి డివిజన్ సెక్రటరీ ఆర్ సి రెడ్డి పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠోత్సవాలు



**ప్రజాపక్షం/టేకుమట్ల:** టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్, సోమనపెల్లి గ్రామలలో అంజనేయ పునప్రతిష్టపన నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆంజనేయ స్వామి వారి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేరువేరుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎనుగుల రాఖేష్‌రెడ్డి హజరై ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటి సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో హనుమంతుని దేవాలయం ఉంటుందని హనుమంతుని శుభ ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నన్నారు. దేవుని మీద మనస్సు పెట్టి పూజలు చేయడం ముఖ్యమన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు ఊద్దమారి మహేష్, పోతనవేన ఐలయ్య, తోట సాగర్, నేరెళ్ల రామ కృష్ణగౌడ్, గిరవేన భాస్కర్ యాదవ్ పాల్గోన్నారు.

## కనిపించే దేవుళ్ళే అమ్మానాన్నలు




**ప్రజాపక్షం/నెక్కొండ:** మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ ,ఇలా ప్రతి వారిని దైవంతో భావిస్తారు. మన భారత సనాతన ధర్మం, కనిపించే తల్లిదండ్రులే మనకు దేవుళ్ళు, కానీ ఆ తల్లిదండ్రులను కొందరు ప్రబుద్ధులు వృద్ధ ఆశ్రమాల్లో తల్లిదండ్రులను ఉంచి వారి బాధ్యతను మారుస్తున్న తరుణమిది. జూన్ 1 అమ్మ నాన్న దినోత్సవం అని ఎవరో ఒక మహానుభావుడు సంవత్సరంలో ఒక్క రోజైనా తల్లిదండ్రులను గౌరవించాలని పెట్టడం దురదృష్టకరం, బాధాకరం, మనం మన తల్లి దండ్రులను ఎలా చూస్తామో మన పిల్లలు కూడా అలానే చూస్తారని, ఆలోచన లేకుండా ప్రవర్తిస్తున్న ప్రస్తుత నాగరికత భార్య భర్తలు, వారిని వారి పిల్లలు ఎలా గౌరవిస్తారు. మీరు మీ తల్లిదండ్రులను ఎలా చూస్తున్నారు. అది చూసి మీ పిల్లలు కూడా అలాగే నేర్చుకుంటున్నారు. అని ఆలోచన లేదు ప్రస్తుత తల్లిదండ్రులకు, ఇప్పటికైనా మాన దేశంలో కాని రాష్ట్రంలో కానీ జిల్లాల్లో కానీ ఎక్కడ వృద్ధాశ్రమాలు ఉండకూడదనేది మెజారిటీ ప్రజల అభిప్రాయం మరో మారు తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా మాతృదేవోభవ, పితృదేవోభవ.

# అవతరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి


### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** నేడు జూన్ 2న జరుగనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగనున్న ఈ వేడుకలకు కలెక్టరేట్ కార్యాలయం విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య హాజరుకానున్నారని తెలిపారు. జూన్ 2న కార్యక్రమం వివరాలు ఉదయం 9:25నిమిషాలకు ముఖ్య అతిథి పొదెం వీరయ్య గోదావరి గెస్ట్ హౌస్, కెటిపిపి, చెల్పూర్ నుండి అమరవీరుల స్థూపం భూపాలపల్లికి బయలు దేరుతారు. 9:30 ఎస్పీ కిరణ్ ఖరే అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుంటారు. 9:32 జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుంటారు. 9:35 ముఖ్య అతిథి, జిల్లా కలెక్టర్, ఎస్పి అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారు. 9:45 అమరవీరుల స్థూపం నుంచి ఐడీఓసీకార్యాలయానికి బయలు దేరుతారు. 9:55 ఐడిఓసి కార్యాలయానికి ముఖ్య అతిథి చేరుకుంటారు. 9:57 9:59 ముఖ్య అతిథి పోలీస్ గౌరవ వందనం స్వీకరణ 10:05 జాతీయ పతాక ఆవిష్కరణ మరియు జాతీయ గీతాలాపన, 10:05, 10:20 ముఖ్య అతిథి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 10:20 10:40 తెలంగాణ అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తారు. సాయంత్రం 3 గంటలకు సుభాష్ నగర్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటి హాలులో నియోజకవర్గ స్థాయి వేడుకలు నిర్వహించబడునని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు.

## బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జనగామ డిఈఓ భోజన్న, డీసీడీఓ గౌసియాబేగం, ప్రజ్వల చీఫ్ అపరేషన్ ఆఫీసర్ ఆంథోనీరెడ్డి అన్నారు. ఆదివారం జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో కేజీబీవీ, మోడల్ స్కూల్, సాంఘీక సంక్షేమ పాఠశాల, అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వయించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిఈఓ భోజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి ఆడపిల్లలు ఎదగాలని, అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దురదృష్ట వశాత్తు కొంత మంది వ్యక్తులు అసాంఘీక కార్యక్రలాపాలకు ఉపయోగిస్తూ వారి జీవితాల్లో ఆడుకుంటున్నారన్నారు. పాఠశాలల్లో చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని, మైనర్ పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, శరీర పెరుగుదల మార్పులు దాని పర్యవసానాల గురించి వివరించాలన్నారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ కండక్ట్ చేసినప్పుడు పర్సనల్ విషయాలను చర్చించాలని, బాల్య వివాహాలను నిరోదించాలని, లైగింక దాడి బాధితులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వివరించాలన్నారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్న ఒక నేరపూర్తిత చర్య అని, మొబైల్ అనేది నిత్య జీవితంలో భాగం అయింది, దీన్ని వాడడం ద్వారా వచ్చే నస్టాలను వివరించాలి, సోషన్ మీడియా ద్వారా జరుతున్న నిజమైన వార్తలను వారికి వివరించి దాని నుండి బయట పడేలాగా మోటివేషన్ చేయాలన్నారు. గౌసియాబేగం మాట్లాడుతూ జిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098,100,181,1930 లాంటి టోల్ ఫ్రీ నెంబర్స్‌కు కాల్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రతి వారం ఒక కొత్త విషయంపై అవగాహన కల్పించాలన, వ్యక్తిగత పరిశుభ్రత, అపద సమయంలో ఎలా రిపోర్ట్ చేయాలో చెప్పాలన్నారు. ఆంథోనీరెడ్డి మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ మనుసుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న సంస్థ పద్మ శ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 30వేల మంది అమ్మాయిలను కాపాడి పునరావాసాలకు పంపడం జరిగిందన్నారు. తెలంఆణ విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల టీచర్స్‌కి అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ట్రాఫికింగ్ చట్టాల గురించిఇ వివరించారు. ఈ శిక్షణలో లఘు చిత్రాల ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ చట్టాలు, భద్రత, సైబర్ నేరాలపై వివరించారు.



## విద్యార్థులు విద్యావంతులుగా ఎదగాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** విద్యార్థులు తమ ప్రతిభకు మరింత పదును పెట్టి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి అత్యున్నత శిఖరాలను చేరుకొని సమాజం కోసం పాటుపడాలని ఓబీసీ జాతీయ కో ఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అన్నారు. తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన రాయిపెల్లి యాకయ్య విజయమ్మల కుమారుడు రాయిపెల్లి శివకుమార్ ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 960మార్కులు, జేఈఈ మెయిన్స్‌లో 92,2736 శాతం సాధించడంతో ఆదివారం వరంగల్ జిల్లా గోపా ఆధ్వర్యంలో గౌడ భవనంలో గోపా ప్రతిభా పురస్కారాలు అందించారు. గౌడ ప్రతినిధులు హన్మకొండ సత్యం కన్వెన్షన్ హాల్‌లో శాలువా, మెమొంటో, నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గురువుల మార్గదర్శకత్వంలో ఈ మార్కులు సాధించానని, రాబోయే రోజుల్లో బాగా చదువుకొని సమాజ హితం కోసం పాటుపడుతానని అన్నారు. ఈ ప్రతిభా పురస్కారం అందించిన వరంగల్ గోపా ప్రతినిధులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ మోటివేట్ స్పీకర్ సైకాలజిస్ట్ గోపికృష్ణ మాట్లాడుతూ నీ కోసం నువ్వే చదవాలని, నీ కోసం నువ్వే పాటుపడాలని అన్నారు. ప్రతి మనిషికి తన సొంత ఆలోచనలే కారణమని, పాజిటివ్ ఆలోచనతో ముందుకెళ్లాలని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సెల్ ఫోన్స్‌కు దూరంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గోపా హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు బైరి రాజశేఖర్ గౌడ్, చిర్ర రాజుగౌడ్, కార్యక్రమ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, గోపా ప్రతినిధులు సత్యనారాయణగౌడ్, రవీందర్‌గౌడ్, బి.యాదగిరిగౌడ్, బి.కుమారస్వామి, రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయభాస్కర్, శ్రీనివాస్, జనార్ధన్, ఏసీపీ నాగయ్యగౌడ్‌ల చేతుల మీదుగా సన్మానించారు. శివకుమార్‌ను నిమ్మల వెంకన్న, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, చీకటి శ్రీనివాస్‌గౌడ్, బాలగాని నర్సయ్యగౌడ్‌లు అభినందించారు.

# యాదాద్రి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా భాస్కర్ రావు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్గా భాస్కర్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించిన గంగాధర్ రెండు నెలల క్రితం హెచ్ఎండీఏ కార్యదర్శిగా బదిలీ పై వెళ్లారు. అప్పటి నుంచి రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డి అదనపు బాధ్యతలను నిర్వహించారు. భాస్కర రావు గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి ఆర్డీవోగా, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్ట, యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా పనిచేశారు.

# ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీ

## రూ.20లక్షలతో ఉడాయించిన దొంగలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని లింగగిరి రోడ్డులో గల ఎస్‌బిఐ ఎటిఎంలో అర్ధరాత్రి దొంగలుపడ్డారు. ఎటిఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి అందులోని 20లక్షలు తీసుకుని దొంగలు ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని ఇద్దరు ప్రొఫెషనల్ దొంగలు ఎటిఎం చోరీకి పాల్పడట్లు చెబుతున్నారు. తమ వెంట తెచ్చుకున్న గ్యాస్‌కట్టర్‌తో ఎటిఎం మిషన్ కట్ చేయగా, మరోకరు ఎటిఎం బయట ఉన్న షట్టర్‌కు కాపలా ఉన్నారు. ఫార్చునర్ కారులో వచ్చిన దుండగలు 15 నిమిషాల్లో ఎటిఎం మని బాక్స్‌ను తీసుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎటిఎం నిర్వాహకులు రెండు రోజుల క్రితం మిషన్‌లో 20 లక్షలు పెట్టగా మొత్తం చోరీకిగురైనట్లు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న సిఐ చరమందరాజు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సిసి కెమోరాల ఆదారంగా కేసు దర్యాప్తును మరింత ముమ్మరం చేస్తామని, నిందితులను పట్టుకుంటామని చెప్పారు.



# బుద్ధవనం సందర్శించిన థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు

**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని థాయిలాండ్ దేశపు బౌద్ధ బిక్షువులు అంతర్జాతీయ నటులు, సిద్ధార్థ గౌతమ పాత్రధారి గగన్ మాలిక్ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. నాగార్జునసాగర్ లో తెలంగాణ టూరిజం అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బుద్ధవనం మహా స్తూపంలో 2022 నవంబర్ 29వ తేదీన బుద్ధుని ధాతువులను ఇండోనేషియా దేశం నుంచి తీసుకువచ్చి బహుకరించిన మహాభాగ్యం గగన్ మాలికే దక్కుతుంది. మరల ఆదివారం థాయిలాండ్ కు చెందిన బౌద్ధ బిక్షువులు గుల్బర్గా ను సందర్శించిన అనంతరం వారితో కలిసి గగన్ మాలిక్ బుద్ధ వనాన్ని సందర్శించారు .ఈ సందర్భంగా బుద్ధ పాదాలు వద్ద పుష్పాంజలు ఘటించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం,ధ్యానవనం,స్థూపవనాలను సందర్శించి మహాస్తుభం లోని ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు.

# కంఠమహేశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్సీ సత్యం ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/చండూరు/ గట్టుప్పల:** గట్టుప్పల మండల కేంద్రంలో శ్రీశ్రీ కంఠమహేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకల్లో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి సత్యం మాట్లాడుతూ ప్రజలు,రైతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సల్లంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల నాయకులు బండారు చంద్రయ్య , వడ్డెపల్లి గోపాల్ గౌడ్ , పెద్దగాని రాఘవేంద్ర , మాదగోని రమాశంకర్ , సాయిలు గౌడ్ , రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం , ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నామని జగన్నాధం , సిపిఐ మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్ , రాపోలు సత్తయ్య ,ధనుంజయ్య ,రావుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలను అమలు చేయాల్సిందే



**ప్రజాపక్షం/మర్రిగూడ:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి డిమాండ్ చేశారు. మండలములోని సరంపేట గ్రామంలో ఆది వారం సిపిఐ గ్రామ శాఖ మహాసభ జక్కలి యాదగిరి అధ్యక్షతన జరిగిన సమా వేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న ప్రతివారికి రేషన్ కార్డు ,వితంతు వులకు ఒంటరి మహిళలకు వృద్ధులకు వికలాంగులకు కొత్త పెన్షన్ ఇవ్వాలని రూ.2వేలు ఉన్న పెన్షన్ 4వేలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్ పాలకగొన్నారు. అనంతరం నూతన కమిటీ గ్రామ కార్యదర్శిగా అంజలి జంగయ్య, సహాయ కార్యదర్శిగా దాసరి శ్రీశైలం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# హుజూర్‌నగర్ సిపిఐ పట్టణ కార్యదర్శిగా గుండు వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణ సిపిఐ కార్యదర్శిగా గుండు వెంకటేశ్వర్లు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నాలుగుసార్లుగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా సోమగాని కృష్ణ, మామిడి వెంకయ్య లు ఎన్నికయ్యారు. వీరితో పాటు 14 మంది పట్టణ కమిటి సభ్యులు ఎన్నుకున్నారు. ఈ మహాసభలో 34 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. వరుసగా నాలుగోసారి కార్యదర్శిగా ఎన్నికైన గుండు వెంకటేశ్వర్లును పట్టణ ప్రముఖులు, నాయకులు, మిత్రులు వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

# లింగయ్య ఆశయాలను కొనసాగిద్దాం

**ప్రజాపక్షం/మోటకొండూరు :** గట్టికోప్పుల లింగయ్య ఆశయాలను కొనసాగించాలని, ఆయన లేని లోటు సిపిఐకి తీరని లోటు అని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన ఆదివారం మోటకొండూరు మండలంలోని వర్టూర్‌లో సిపిఐ సీనియర్ నాయకులు గట్టికోప్పుల లింగయ్య 4వ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లింగయ్య స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగయ్య బాల్యంలో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకార్షితులై క్రియాశీల సభ్యత్వం పొంది వర్టూరులో కూలి సంఘం, రైతు సంఘాలు ఏర్పాటు చేసి కమ్యూనిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాధగాని మాణిక్యం, మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, గ్రామ శాఖ కార్యదర్శి సూదగాని వెంకన్న, నల్ల రాములు, పల్లె శీను, గువ్వా సిద్దులు, గట్టి కొప్పుల శ్రీనివాస్, గువ్వా సిద్దులు, గట్టి కొప్పులశ్రీకాంత్, పల్లె పవన్, బొట్ల అశోక్, కుటుంబ సభ్యులు నాగ లక్ష్మి పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

## నల్లగొండలో తులసి హాస్పిటల్ ను ప్రారంభించిన మంత్రి రాజనర్సింహ



**ప్రజాపక్షం/ నల్లగొండ :** నల్లగొండ పట్టణంలో దేవరకొండ రోడ్డు లో నూతన ఏర్పాటు చేసిన తులసి హాస్పిటల్ ను వైద్య ,ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సిపిఐ ఎంఎల్ సి నెల్లికంటి సత్యం తో కలసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ తులసి ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అధునాతన సౌకర్యాలతో ప్రారంభించడం శుభపరిణామన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవ దృక్పథంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ జడ్పిటిసి కొండేటి మల్లయ్య అదనపు జెసి జె శ్రీనివాసు డిఎంహెచ్ఓ పుట్టా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు అయిన తర్వాత తొలిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ,ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహను ఘనంగా సన్మానించారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్ నాయక్, నెల్లికంటి సత్యంతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, మాదిగ జేసి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రి దామోదరం రాజనర్సింహ , మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిలకు బొకే అందజేసి శాలువా, గజమాలతో సన్మానించి ఎస్సీ వర్గీకరణ అమలు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంతో రాష్ట్రంలో మాదిగలకు, మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ ఉపకులాలు, మాదిగ జేఏసీ నాయకులు పెరిక ఉమామహేశ్వర్ ,కత్తుల జగన్, కత్తుల తులసీదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుబ్బ రూప అశోక్ సుందర్, తొలకొప్పుల గిరి, షణ్ముక్, భాషపాక హరికృష్ణ, పెరిక అంజి, నవీన్, హరి ప్రసాద్, కొప్పు అశోక్, నరేందర్, ఇరిగి ప్రసాద్, అశ్విని, అంజమ్మ, పోలేపల్లి రుద్ర తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటం : బంటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని రాంనగర్‌లో గ్రామశాఖ సమావేశం ఆదివారం రహీం అధ్యక్షతన నిర్వహించగా సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. సీపీఐ పార్టీ వంద సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించి పేద ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం పోరాటాలు చేసిదన్నారు. కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ సంస్థలు అనుకూలంగా పనిచేస్తున్నారే తప్పా పేద ప్రజల, రైతుల, కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్నారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి వారిని బలి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్మికులు వారి హక్కుల కోసం వందల సంవత్సరాల క్రితం ప్రజాపోరాటాలు చేసి వారి హక్కులు సాధించుకుంటే ఆ హక్కలన కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. నరేంద్రమోడి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా ఉందే తప్పా పేద ప్రజల సంక్షేమ పథకాల విషయంలో లేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో దళిత హకుకల పోరాట సమితి జిల్లా కోకన్వీనర్ వల్లంపట్ల వెంకన్న, ఎస్‌కె.పాషా, జాని, అప్పారావు, బేగం తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంట సాగుతో రైతు ఆశించిన లాభాలు

## జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అనంతరెడ్డి

**ప్రజాపక్షం/చండూరు :** ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు ఆశించిన విధంగా మంచి లాభాలు పొందవచ్చునని నల్లగొండ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలం కొండాపురం గ్రామంలోని రైతు కొత్తపల్లి నర్సింహ్మా (సూర్యాపేట జిల్లా ఎస్‌పి) సాగుచేసిన 8 ఎకరముల ఆయిల్ పామ్ తోటను రైతు కొత్తపల్లి నర్సింహ్మా (ఎస్‌పి) తో కలిసి జిల్లా ఉద్యాన ,పట్టుపరిశ్రమ శాఖ అధికారి పిన్నింటి అనంతరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి మొదటిసారి కోతను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021/22 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన శాఖ నల్లగొండ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటడం జరిగిందని తెలిపారు. నేటికి 3 సంవత్సరాల వయస్సులో మొదటి పంట ప్రారంభం అయిందని అన్నారు. మొదటి కోతలోనే సుమారు 3 టన్నుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఉద్యాన శాఖ వారి సలహాలు , సూచనల మేరకు మేలైన యాజమాన్య పద్ధతులు ,డ్రిప్ ద్వార నీటి యాజమాన్యం పాటించి, సేంద్రీయ ఎరువులు వినియోగం ద్వార మంచి దిగుబడులు వచ్చాయని తెలిపారు. మొదటి కోతలోనే రైతుకు ఆశించిన దిగుబడి వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజవర్గం ఉద్యాన ,పట్టు మరిశ్రమ అధికారి రావుల విద్యాసాగర్ , పతంజలి కంపెనీ చండూరు ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ ,రైతులు శ్రీను ,శంకరమ్మ, లింగస్వామి పాల్గొన్నారు.



# యాదవ ఉద్యోగులు సామాజిక బాధ్యతతో పనిచేయాలి

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య




**ప్రజాపక్షం/ నల్లగొండ :** విద్యార్థి దశ నుండే బడుగు బలహీన వర్గాలకు అండగా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి ఈ స్థాయికి రావడం జరిగింది, యాదవులను అంకితభావం ఎక్కువ నిబద్దతో పని చేసే వ్యక్తిత్వం గల జాతి అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కొనియాడారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా యాదవ సంఘ భవనంలో నల్లగొండ జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన యాదవ ఉద్యోగుల సన్మానోత్సవంలోనిర్వహించిన నూతన యాదవ ఉద్యోగుల ఆత్మీయ సన్మానోత్సవంలో ఎమ్మెల్సీ సత్యం పాల్గొని మాట్లాడుతూ పార్టీకి తాను నిస్వార్థంగా చేసిన సేవలకు తగు గుర్తింపు నిచ్చిందని తన ఎమ్మెల్సీ పదవీ కాలంలో పేదల సంక్షేమానికి కృషిచేస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. యాదవ ఉద్యోగుల సంఘం చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదవ ఉద్యోగులు నీతి, నిజాయితీతో, అంకితభావంతో పనిచేసి వృత్తిగౌరవాన్ని కాపాడాలని అలాగే సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్ర పోలీస్ కంప్లయింట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేసినారు,ప్రభుత్వ ఉద్యోగాన్ని జవాబు జవాబుదారుతనంతో పనిచేసినప్పుడు ప్రజాస్వామ్య పరిపాలనకు ఒక మెట్టు లాంటిది ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మరియు పారదర్శక పరిపాలన అందించాలని కోరారు. యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగు లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్వ అశోక్ యాదవ్, ప్రధాన వక్త డాక్టర్ బెల్లీ యాదయ్య, అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లొడంగి గోవర్ధన్ యాదవ్, జిల్లా అధ్యక్షులు, ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, మాజీ చైర్మన్ దూదిబెట్ల బాలరాజు యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్, ఎల్.వి యాదవ్ పాల్గొన్నారు.

# వంద రోజులు ప్రణాళికలలో పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** వంద రోజులు ప్రణాళికలలో భాగంగా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పనులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కమిషనర్ జి.రామలింగం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా భువనగిరి పురపాలక సంఘ కార్యాలయం యందు అధికారులు, సిబ్బందితో కమీషనర్ జి.రామలింగం ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇట్టి 100 రోజుల ప్రణాళికలో భాగంగా మొత్తం 51 యాక్టివిటీస్ కలవని 2 నుండి తేది10 వరకు సదరు ఆక్టివిటీస్ నిర్వహించబడతాయని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణ పరణమైన పనులు, పెద్ద మురికి కాలువలు, నాళాలు, సోషల్ మీడియా క్యాంపెయిన్, పడి పడి చెత్తలపై ఇంటింటికి అవగాహన సమావేశాల నిర్వహించాలని కోరారు. వాల్ పెయింటింగ్స్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, దోమల నివారణ, పరిశుద్ధ కార్మికులకు హెల్త్ క్యాంప్స్, ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. స్వచ్ఛత కాంపిటీషన్స్, అవార్డులు, క్విజ్ కాంపిటీషన్స్, పెయింటింగ్స్, రంగోలి కాంపిటీషన్, ఆర్ట్ ఎగ్జిబిషన్స్, భువన్ సర్వే, ట్రేడ్ లైసెన్స్ గుర్తించటం పనులు చెయ్యాలని తెలిపారు. ఇంటి నల్ల కనెక్షన్లను ఆన్లైన్ చేయుట, మహిళా సంఘాల ప్రోడక్ట్ మేలా, స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్, వీధి విక్రయదారుల సంఘాలు ఏర్పాటు చేయుట, మహిళా సంఘాల వారికి బ్యాంకు లింకేజీ ఇచ్చుట, స్ట్రీట్ వెండింగ్ జోన్లను సమీక్షించుట, కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు



**ప్రజాపక్షం/చివ్వెంల:** ప్రజా సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తోందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చివ్వెంల మండల కేంద్రంలో గ్రామ, మండల 15వ మహాసభలను రేగటి లింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఖమ్మంపాటి అంతయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో నెగ్గిన తర్వాత పాలకుల ప్రజా సమస్యలను విస్మరించారని ధ్వజమెత్తారు. ఈనెల 8న సూర్యాపేటలో జరిగే జిల్లా నాలుగో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చివ్వెంల మండల నూతన కౌన్సిల్ 15 మంది, 8 మంది కార్యవర్గంను ఎన్నుకున్నారు. చివ్వెంల గ్రామ కమిటిని 13 మంది కౌన్సిల్, 6కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మూడోసారి చివ్వెంల మండల కార్యదర్శిగా ఖమ్మంపాటి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా రేగట్టి లింగయ్యను ఎన్నుకున్నారు. ఈ స మావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాం బాబు, చామల అశోక్‌కుమార్, ఐతరాజు లింగ య్య, ఖమ్మంపాటి రామలింగం, సతీష్, వెంకటేష్, ఖమ్మంపాటి నాగమణి, వెంకన్న, సైదులు, సత్యమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

# మహిళలు, విద్యార్థినుల రక్షణకు అధిక ప్రాధాన్యం

## వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా ఎస్పి కె.నర్సింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మహిళలు, విద్యార్థినిల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా ఎస్పి కె.నర్సింహా అన్నారు. వారిని వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో మంచి, చెడులతో ఎంచుకునే యువత పెడదోవన పడుతుందన్నారు. 18 సంవత్సరాలలోపు యువతులను వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళలు, విద్యార్థినిల రక్షణకు పోలీస్‌శాఖ, షీటీమ్ ద్వారా కళాబృందాలతో జిల్లా వ్యాప్తంగా రద్దీ ప్రాంతాలలో, కాలనీలలో, విద్యా సంస్థల్లో మహిళ రక్షణలో నూతన చట్టాలు, పడే శిక్షలు విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని , మహిళల పురోగతికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. తప్పుడు మార్గంలో నడిస్తే కౌన్సిలింగ్ ద్వారా సన్మార్గంలోకి తీసుకరావాలని కోరారు. విద్యా సంస్థలు ప్రారంభమవుతున్న సందర్భంగా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. యూవ్‌టీజింగ్, ర్యాగింగ్ లాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల సహకారంతో యాంటి ర్యాగింగ్ కమిటిలను ఏర్పాటు చేయాలన్నారు. లాఅండ్ అర్డర్, పోలీస్, షీటీమ్ బృందాలు రద్దీ ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

# ఆపరేషన్ కగార్ పేరుతో మోదీ సర్కార్ అమాయకుల ఎన్‌కౌంటర్

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య




**ప్రజాపక్షం/మునుగోడు:** కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో మునుగోడు మండల వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహించారు.మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తగిన నిధులు కేటాయించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మ గాంధీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించి చట్టంలో పొందుపరచబడిన అన్ని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు పారా గడ్డపారలను ఇవ్వాలని పని ప్రదేశాలలో టెంట్ ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం ప్రథమ చికిత్స కొరకు మెడికల్ కిట్టులు ఎండాకాలంలో పని ప్రదేశాలలో ఓ ఆర్ ఎస్ పాకెట్లు అన్ని సౌకర్యాలను ఉపాధి హామీ కూలీలకు అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న ప్రతివారికి రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. వితంతువులకు,ఒంటరి మహిళలకు,వృద్ధులకు,వికలాంగులకు కొత్త పెన్షన్ ఇవ్వాలని 2000 ఉన్న పెన్షన్ 4000 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఎండి జానిమియ,సిహెచ్ ఉషయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్, కాయతి వెంకన్న,మాజీ జెడ్పిటిసి లింగయ్య పాల్గొన్నారు.

# 10న సిపిఐ డిండి మండల మహాసభ


**ప్రజాపక్షం/డిండి:** జూన్ 10న డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిండి మండల 15వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి పార్టీ శ్రేణులకు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల మహాసభ విజయవంతానికి గ్రామ స్థాయి నుండి కార్యకర్తలు, మహిళలు, యువకులు, రైతులు ఎర్ర చొక్కాలను ధరించి, ఎర్ర జెండాలను చేతబట్టి కదం తొక్కుతూ మండల కార్యవర్గ ం ఆయా గ్రామాలకు నిర్దేశించిన కోట్లా మేరకు తరలిరావాలని పిలుపునిచ్చారు.ప్రతి శాఖ కార్యదర్శి జన సమీకరణ విషయంలో పార్టీ సభ్యులను, కార్యకర్తలను మహాసభకు తీసుకువచ్చేలా చొరవ చూపి మహాసభను విజయవంతం చేయాలని బుచ్చిరెడ్డి సూచించారు.

ఫోకస్

# ఆరోగ్యం

## మలేరియాపై పోరాటంలో టిఆర్1 కణాల నాయకత్వం!

మలేరియాకు రోగనిరోధకను పెంచడానికి టిహెచ్1 కణాలు కాకుండా, టిఆర్1 (టైప్1 రెగ్యులేటరీ టి–కణాలు) ప్రధాన పాత్ర పోషిస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇప్పటి వరకూ టిహెచ్ 1 కణాలే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్న అభిప్రాయాన్ని ఈ అధ్యయనం సవాలు చేస్తున్నది. టిఆర్1 కణాలు లేదా టైప్1 రెగ్యులేటరీ టి–కణాలు రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించే సిడి4+ సహాయక టి–కణాల ప్రత్యేక సమూహం. వ్యాధికారక క్రిములపై దాడి చేసే ఇతర టి–కణాల మాదిరిగా కాకుండా,



టిఆర్1 కణాలు వాపును తగ్గించడం, అధిక రోగనిరోధక ప్రతిచర్యలను నివారించడం ద్వారా రోగనిరోధక ప్రతిస్పందనలను నియంత్రిస్తాయి. కాగా, సిడి4+ కణాలు (సహాయక టి–కణాలు) అనేవి ఒక రకమైన తెల్ల రక్త కణాలు (లింఫోసైట్స్). ఇవి అనుకూల రోగనిరోధక శక్తిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్లాస్మోడియం ఫాల్సిపరం లేదా మలేరియా సోకినప్పుడు, శరీరం పరాన్నజీవితో పోరాడటంలో, అధిక రోగనిరోధక నష్టాన్ని నివారించడంలో ముఖ్యభూమిక నిర్వహిస్తాయి. టిఆర్1 కణాలు వాపును నియంత్రించడం ద్వారా రోగనిరోధక సహనాన్ని ప్రోత్సహిస్తాయి. పరాన్నజీవితో సహజీవనాన్ని అనుమతిస్తాయి. తీవ్రమైన అనారోగ్యాన్ని నిరోధించే క్లినికల్ రోగనిరోధక శక్తిని అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఇవి శాంతి పరిరక్షకులుగా కూడా పనిచేస్తాయి. శరీరాన్ని రక్షించడానికి వీలుగా రోగనిరోధకను పర్యవేక్షిస్తాయి. సాధారణంగా శరీర నిర్మాణంలోనే కొన్ని భాగాలు రోగ నిరోధక వ్యవస్థలుగా పని చేస్తాయి. ఉదాహరణకు చర్మం, శ్లేష్మ పొరలు శరీరంలోకి వ్యాధికారిక క్రిములు ప్రవేశించకుండా నిరోధిస్తాయి. మనిషిపై దాడి చేసి, ఆరోగ్యాన్ని దెబ్బతీసే పలు రకాల క్రిములపై ఇవి యుద్ధం చేస్తాయి. అదే విధంగా సహజ రోగ నిరోధక శక్తి కూడా శరీరంలో ఉంటుంది. న్యూట్రోఫిల్స్ వంటి తెల్ల రక్త కణాలు, మాక్రోఫేజెస్, సహజ కిల్లర్ కణాలు అనేవి ప్రధానమైన రోగ నిరోధకాలు. అదేరీతిలో వివిధ రుగ్మతలపై టిఆర్1 కణాలు సమర్థవంతంగా యుద్ధం చేస్తాయి. ముఖ్యంగా మలేరియా సూక్ష్మ క్రిములను నాశనం చేస్తాయి.

## భయపెడుతున్న ఎఇ



ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో సూక్ష్మంగా ఎఇగా పిలిచే ఎల్వియోలార్ ఎచినోకోకోసిస్ (Alveolar Echinococcosis) వ్యాధి వ్యాప్తి ఆందోళన కలిగిస్తున్నది. ఇది ఎచినోకోకోసిస్ మల్టీలొక్యులారిస్ అనే అరుదైన పరాన్నజీవి ద్వారా వ్యాపించే వ్యాధి. ఈ టేప్‌వార్ లార్వా దశ వల్ల ఎఇ వ్యాధి ప్రబలుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా కాలేయాన్ని ప్రభావితం చేస్తుంది . క్యాన్సర్‌లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఎఇ వ్యాధి ప్రధానంగా అడవి నక్కలు, కుక్కలు, పిల్లులు వంటి జంతువుల ద్వారా వ్యాపిస్తుంది. వాటి మలం ద్వారా వ్యాపిస్తాయి. పొరపాటున మాన శరీరంలోకి వెళితే, కాలేయాన్ని అంటిపెట్టుకొని లార్వాగా అభివృద్ధి చెందుతాయి. ఈ లార్వాలు కాలేయంలో కణజాలాన్ని నాశనం చేస్తూ, క్యాన్సర్‌లాంటి గడ్డలకు కారణమవుతాయి. ఏర్పరుస్తాయి. ఎఇ వ్యాధి ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. కానీ, వ్యాధి పురోగమించేకొద్దీ, సమస్యలు మొదలవుతాయి. పొట్ట ఎడమవైపు పైభాగంలో నొప్పి లేదా అసౌకర్యం కలుగుతుంది. బరువు తగ్గడం, అలసటతోపాటు, కొన్ని సందర్భాల్లో పచ్చకామెర్ల వ్యాధి కూడా సోకవచ్చు. మొత్తం మీద ఎఇ వ్యాధి లక్షణాలు ఇతర కాలేయ వ్యాధులతో పోలి ఉంటాయి కాబట్టి సరైన నిర్ధారణ కోసం వైద్య పరీక్షలు అవసరం. అల్ట్రాసౌండ్ సిటి స్కాన ఎంఆర్‌ఐ వంటి పరీక్షలు కాలేయంలో గడ్డలను గుర్తించడానికి ఉపయోగపడతాయి. సెరోలాజికల్ పరీక్షల ద్వారా రక్తంలో ఎచినోకోకోసిస్ ఎగ్స్ యాంటీబాడీలను గుర్తించవచ్చు. బయోప్సీ విధానాన్ని కూడా కొంత మంది వైద్యులు సూచిస్తున్నారు. కాలేయ గడ్డల నుంచి మనూనాలు తీసుకొని, వాటిని పరీక్షించడం ద్వారా రోగ నిర్ధారణ చేస్తారు. ప్రస్తుతానికి ఈ వ్యాధికి చికిత్స అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. శస్త్రచికిత్సతో కాలేయంలో ఉన్న పరాన్నజీవి గడ్డలను పూర్తిగా తొలగించడం. కానీ, ఇది అన్ని సందర్భాల్లో సాధ్యపడదు. అల్బెండజోల్ వంటి బెంజిమిడజోల్ ఔషధాలను దీర్ఘకాలం (కనీసం 2 సంవత్సరాలు) ఉపయోగించడం మరో విధానం. అయితే, ఈ చికిత్స పూర్తిగా వ్యాధిని నయం చేయకపోవచ్చు. అత్యంత తీవ్రమైన సందర్భాల్లో, కాలేయ మార్పిడి అవసరమవుతుంది. కానీ, ఇది ప్రమాదకరమైనది. అంతేకాదు, ఎఇ మళ్లీ వచ్చే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి, వ్యాధి సోకిన తర్వాత వైద్యం కోసం పరుగులు తీసేబదులు, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. కుక్కలు, పిల్లులకు యాంటీపారసైటిక్ మందులు ఇప్పించాలి. పశువుల డివార్మింగ్ అత్యవసరం. కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను శుభ్రంగా కడగిన తర్వాతే భుజించాలి. తరచు చేతులను శుభ్రపరచుకోవాలి. ప్రధానంగా పశువులను తాకిన తర్వాత చేతులు కడుక్కోవాలి. అడవి నక్కలు, కుక్కలు వంటి జంతువులకు దూరంగా ఉండడం శ్రేయస్కరం.

## రష్యాలో కొవిడ్ తరహా వ్యాధి

రష్యాలోని కొన్ని ప్రాంతాల్లో కొవిడ్ తరహా వ్యాధి ప్రబలుతున్నది. తీవ్రమైన జ్వరం, దగ్గు, ఒక్కోసారి శ్లేష్మంలో రక్తం పడడం వంటి లక్షణాలు వెలుగు చూవాయి. సాధారణంగా తీవ్రమైన కొవిడ్ కేసుల్లో ఇలాంటి లక్షణాలు ఉంటాయి. కానీ, కొవిడ్ లేదా ఫ్లూ కాదని వైద్య పరీక్షల్లో స్పష్టమవుతున్నది. దీనితో, కొవిడ్ తరహాలో వచ్చిన కొత్త వ్యాధి ఏమిటోనని రష్యా ప్రజలు ఆందోళన చెందుతున్నారన్న వార్త సోషల్ మీడియాలో చక్కర్లు చేస్తున్నది. కొంత మంది రోగులు దీర్ఘకాలంలో ఈ లక్షణాలతో బాధపడుతున్నారని ‘షాట్’ అనే టెలిగ్రామ్ చానెల్ ఒక వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. అనంతరం స్థానిక మీడియాతోపాటు, సామాజిక మాధ్యమాల్లో ఈ వ్యాధిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. అయితే, రష్యాతోపాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) కూడా ఈ వార్తలను ఖండించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. రష్యా అధికారులు చేసిన ప్రకటనను అనుసరించి, ఈ కేసులు కొత్త వైరస్ వల్ల కాకుండా, మైకోప్లాస్మా న్యూమోనియా అనే బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల నమోదవుతున్నాయి. ఈ వ్యాధిని సాధారణంగా ‘వాకింగ్ న్యూమోనియా’ అని పిలుస్తారు. ఇందులో దగ్గు, జ్వరం వంటి లక్షణాలు దీర్ఘకాలం ఉంటాయి. రష్యా ఆరోగ్య సంస్థ ‘రొస్పోట్రెబ్నాజర్’ను అనుసరించి, దేశంలో కొత్త వైరస్ లేదా గుర్తించని పాథోజన్ వ్యాపిస్తున్న దాఖలాలు ఏవీ లేవు. మైకోప్లాస్మా న్యూమోనియా అనేది కొత్త వైరస్ కాదు. దీనిని కొంత మంది రోజులు కొవిడ్ కంటే తీవ్రమైనదిగా పేర్కొంటుండగా, దీర్ఘకాలం పాటు అలాంటి లక్షణాలు మైకోప్లాస్మా న్యూమోనియాలో సహజమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



## మహమ్మారిపై డబ్ల్యుహెచ్‌ఒ దృష్టి

దుర్మార్గ విధానాలు పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో, అంతర్జాతీయ స్థాయిలో మహమ్మారిపై పోరాటానికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉండాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

కొవిడ్ సృష్టించిన నష్టం.. కలిగించిన కష్టం తర్వాత ప్రపంచ దేశాలన్నీ మరో విపత్తును ఊహించడానికే భయపడుతున్నాయి. చాలా దేశాలు ఇంకా కొవిడ్ ప్రభావం నుంచి కోలుకోలేదు. ఈ నేపథ్యంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) తాజా సమావేశంలో మహమ్మారిని ఎదుర్కోవడానికి అవసరమైన చర్యలు, ప్రబలినప్పుడు పరస్పర సహకారం వంటి అంశాలపై దృష్టి సారించింది. మహమ్మారిపై ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. డబ్ల్యుహెచ్‌ఒ ఈ విధంగా పాండమిక్‌పై ప్రపంచ దేశాల మధ్య ఒప్పందాన్ని ప్రతిపాదించి, ఆమోదించడం ఇదే మొదటి సారి. అంతేగాక, 2003లో పొగాకు నియంత్రణ ముసాయిదా సమావేశం తర్వాత జరిగిన చట్టపరమైన రెండో పత్రం ఇది. ప్రపంచ ఆరోగ్య నిర్మాణాన్ని బలోపేతం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. మహమ్మారి సమయంలో రోగ నిర్ధారణ, టీకాలు, చికిత్సకు సంబంధించి సమాన ప్రాప్యతను నిర్ధారించడానికి అంతర్జాతీయ సహకారాన్ని కోరుతున్నది. ఇందుకుగాను, కొన్ని మార్గదర్శక సూత్రాలను నిర్దేశిస్తున్నది. ఈ ఒప్పందంపై ఇప్పటి వరకూ 60 దేశాలు సంతకం చేశాయి. కొవిడ్ ఉధృతి తగ్గుతున్నప్పుడు, దాని సబ్ వేరియంట్ ఒమిక్రాన్ విపరీతంగా వ్యాప్తి చెందినప్పుడు, ఇలాంటి ఒప్పందం అవసరాన్ని గురించిన చర్చ మొదలైంది. పేద దేశాలు వ్యాక్సిన్లు లభించక అల్లాడిపోతే, ధనిక దేశాలు వ్యాక్సిన్లను నిల్వ చేసుకున్న విధానాన్ని డబ్ల్యుహెచ్‌ఒ తప్పుపట్టింది. అలాంటి దుర్మార్గ విధానాలు పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో, అంతర్జాతీయ స్థాయిలో మహమ్మారిపై పోరాటానికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉండాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అనంతరం ప్రపంచ దేశాలతో చర్చలు జరిపి, చివరికి ఒప్పందాన్ని ఆమోదించింది.



**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## ‘థంబ్’ సిస్టమ్ రద్దు చేయాలి

**భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు**



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక, సుతారి, సెంట్రింగ్ సంఘాలతో ఆదివారం సమావేశ ం నిర్వహించారు. భవన నిర్మా ణ కార్మిక సంఘం జిల్లా ప్రధా న కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తీరడం లేదని, థంబ్ సిస్టం రద్దు చేయాలని, లేబర్ కార్డులు రెన్యువల్ కావడం లేదని, లాప్స్ ఐన వినూతన లేబర్ కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని, అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, ఎల దేవరాజు, ధర్మమల్లేశం, బండారి దేవయ్య, కోరేపు శ్రీను, దప్పు శ్రీను, తదితర కార్మిక సంగం నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి కృషి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్**





**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి మేలు కోసం ప్రభుత్వాలను పోరాటాల ద్వారా నిలదీసి సహకరించేది కేవలం సిపిఐ మాత్రమే అని పార్టీ జిల్లా కార్యదర్శిఉమామహేష్ అన్నారు.జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిబాబా కమాన్ వద్ద సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకొన్న వారందరూ సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఇటీవలే జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఉమామహేష్‌ను ఆటో యూనియన్ నేతలు సన్మానించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, జిల్లా ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శికృష్ణమూర్తి,మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, మేడ్చల్ జిల్లా గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సహదేవ్,ఆల్వాల్ మండల సిపిఐ కార్యదర్శి అమరావతి బాబు,ఆటో యూనియన్ అధ్యక్షుడు బద్రినాయక్, నరసింహ, చిన్న లక్ష్మ ణ్, నరసింహ పాల్గొన్నారు.

# సిపిఐ వల్లే నిరుపేదలకు న్యాయం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్**

**21, 22 తేదీల్లో మంచిర్యాలలో సిపిఐ జిల్లా మహాసభలు**



**ప్రజాపక్షం/ నస్పూర్ :** పేద ప్రజలకు న్యాయం చేయగలదె కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. ఆదివారం కృష్ణ కాలనీ యూనియన్ కార్యాలయంలో సిపిఐ ఆర్‌కె 6 శాఖ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, కోశాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, జూన్ 21, 22 తేదీల్లో మంచిర్యాలలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను, జూన్ 8న నస్పూర్‌లో జరిగే మండల మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల చరిత్రలో పేదల అండగా నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేకల దాసు మాట్లాడుతూ, అర్హులకు నూతన పెన్షన్లు ఇవ్వాలని జిల్లా అధికారిని డిమాండ్ చేశారు. ఫుడ్ సెక్యూరిటీ కార్డుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. సింగరేణి ప్రాంతంలో కృష్ణ కాలనీలో ఇల్లు కట్టుకొని నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. నేషనల్ హైవే పక్కన ఉన్న ఇళ్ల సమీపంలో మురికి నీరు పోవడానికి కాలువల వీలులేక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. తుంగ చెట్లు పెరిగిపోవడంతోవర్షాలు పడినప్పుడు మురికి నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోందని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కార మవ్వక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేషన్ అధికారులు తక్షణమే కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. కృష్ణ కాలనీ నుంచి సిసిసి వరకు రోడ్డు నిర్మించాలని, కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగుల నివాసాల మధ్య ఆటోస్టాండ్ వద్ద ఉన్న మైదానంతో పాటు, గౌరీ సుత గణేష్ మండలి సమీపంలోని మైదానంలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, జిల్లా సమితి సభ్యులు సంఘం సదానందం, చిలుక రామచందర్, బాలసాని లక్ష్మ ణ్, ఆడెపు మల్లికార్జున్, శ్రీరాంపూర్ శాఖ సహాయ కార్యదర్శి కొత్తపల్లి మహేష్, కృష్ణ కాలనీ శాఖ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

## యువతను మోసగిస్తున్న ప్రభుత్వాలపై పోరు

**అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర**

**రాజీవ్ యువ వికాస్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుంటే పోరాటాలకు పిలుపు**



**ప్రజాపక్షం/వలిగొండ :** యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమిద్దామని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని లబ్ధిదారులకు ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఎఐవైఎఫ్ వలిగొండ మం డల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూమోదీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని 100 సంవత్సరాలు వెనక్కి తీసుకొనేలా ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో పాలించడానికి ఎన్డీఏ ప్రభుత్వం నీచ కుటిల రాజకీయాలకు తెరలేపారని, ఈ విధానాలను దేశ యువత, పౌరులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశపౌరులకు అందించాల్సిన సంక్షేమ ఫలాలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.మోడీ అంటే కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేసి ఊడిగం చేసే ప్రధాని అని, ప్రధాని బాధ్యతను సైతం దుర్వినియోగం చేసే చరిత్ర హీనుడని వారు ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హత మారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, సీజ్ ఫైర్‌ను ప్రకటించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు.కాశ్మీర్ పహల్గాంలో పౌరులపై నలుగురు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల ఘటనలో 27మందికి పైగా మరణించారని, అయితే కేంద్రం ఇప్పటివరకు ఆ నలుగుర్ని పట్టుకోకుండా చేతకాకుండాఉన్నారని, కానీ దేశంలోని పౌరు లు అమాయక ఆదివాసీలను హననం చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ పాలకుల అవలంబిస్తున్న యువజన వ్యతిరేకవిధానాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలనిచెప్పిందని, రాష్ట్రంలోని 16.25 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇప్పుడు కొత్తగా సీబిల్ స్కోర్ తప్పకుండ ఉండాలనే నిబంధనతో లక్షల మంది యువతను ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఏవైనా లోన్లు తీసుకుని కట్టనివారి అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యే అవకాశం ఉందని, దరఖాస్తుదారుల లోన్ హిస్టరీ, సిబిల్ స్కోర్ వివరాలను బ్యాంకులనుంచిసేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వాటి ఆధారంగా 40 శాతం అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యే అవకాశముందన్నారు.ఉపాధి లేకపోవడంవల్లనే యువత ప్రైవేట్ లోన్స్, బెట్టింగ్ ఇతర యాప్స్‌ల రూపంలో అప్పులు తీసుకుంటున్నారనీ, ఇలాంటి వారికి సీబిల్ స్కోర్ తగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీబిల్ స్కోర్ ఆలోచన విధానాన్ని విరమించుకోవాలన్నారు. నిబంధనలు పెట్టకుండా లబ్ధిదారులందరికీ డబ్బు లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ మండల అధ్యక్షుడు, కార్యదర్శి మారోజు నర్సింహా చారి, సుద్దాల సాయి కుమార్, నేతలు మేడి దేవేందర్, మామిడికాయల నరేష్, పబ్బు కార్తీక్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 50 ఏళ్లు నిండిన వారికి రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలి

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**

**ప్రజాపక్షం/ తిర్యాణి :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం తిర్యాణి మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు 50 సంవత్సరాలు నిండిన వారికి కనీస పెన్షన్ 5 వేల రూపాయలు చెల్లించాలని, అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని అన్నారు. పిల్లల పెళ్లిళ్లకు రూ.2 లక్షలు, మెటర్నిటీకి రూ.1 లక్ష ఇవ్వాలని, ప్రమాదంలో మరణిస్తే 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఆన్‌లైన్ థంబ్ విధానాన్ని తొలగించాలని, పాత పద్ధతిలోనే క్లెయిమ్‌లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లేబర్ ఆఫీసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల నుంచి 29 కార్మిక చట్టాలను విడదీసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తయారు చేశారని, వీటిని వెంటనే రద్దు చేసి 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశ వ్యాపిత సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు జంగు, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగం మోగిలి గౌడ్, సీనియర్ నాయకులు వెంకన్న, సంతోష్, రవి, భీం రావు, లక్ష్మ ణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నిరుపేదలకు ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి: రావుల గంగారెడ్డి

**ప్రజాపక్షం/ముధోల్:**నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తమని ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి అన్నారు. ఆదివారం మాజీ శాసనసభ్యులు నారాయణరావు పటేల్ చేతుల మీదుగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు 25 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. వివిధ అనారోగ్య కారణాల వలన వైద్య చికిత్స చేసుకున్న 55 మందికి ఇట్టి చెక్కులను అందజేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధితో పాటు సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న మాజీ శాసన సభ్యుడు నారాయణరావు పటేల్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల శ్రీనివాస్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్నాథ్ రాథోడ్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లోధాన్యం కొనుగోలు చేస్తాం
### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు



**ప్రజాపక్షం/కొల్చారం :**కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యాసంగి 202425 సీజన్లో జిల్లాలోని రైతులందరికీ నిర్దేశించిన మద్దతు కల్పించుటకై, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2 లక్షల 95 వేల 703 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం 70 వేల 815 మంది రైతుల నుండి కొనుగోలు చేసి ఇప్పటివరకు 573 కోట్ల 60 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. వానాకాలం 2024 వరి ధాన్యం కొనుగోళ్లలో సుమారుగా 12872 మంది రైతుల నుండి 53659 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేసి క్వింటాలుకు 500 బోనస్ చొప్పున మొత్తం 26.83 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని వివరించారు. ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికానున్నందున రైతులు ఎవరు ఆధైర్య పడవద్దనిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ మునీర్‌కు ప్రజా సంఘాల సంతాపం



**ప్రజాపక్షం/కాసిపేట:**తెలంగాణ ఉద్యమకారుడు, సామాజికవేత్త, ప్రముఖ జర్నలిస్ట్ మునీర్ అకాల మృతికి సంతాపంగా కాసిపేట ప్రెస్ క్లబ్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు హెచ్. రవీందర్, ఎ. లింగస్వామి మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో మునీర్ మరణం విషాదకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా జెండా పట్టి ముందుండి తెలంగాణ ఉద్యమానికి ఎంతో సహకరించారని కొనియాడారు. జర్నలిస్టుగా వార్తాపత్రికలలో కార్మికుల పక్షాన వ్యాసాలు రాస్తూ, తన జీవితాంతం కార్మికులకు, బాధిత ప్రజల బాగు కోసం పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు హెచ్. రవీందర్, ఎ. లింగస్వామి, తెలంగాణ కళాకారుడు సందిళ్ల రాజయ్య, సామాజిక ప్రజా స్పందన వేదిక కన్వీనర్ సిలోజు మురళి, జెవిసి కన్వీనర్ చిన్న భీమయ్య, మాజీ జడ్పిటిసి రైతు సత్తయ్య, వాసుదేవ్, దాసరి రాజయ్య, కాసిపేట ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఫిట్ ఇండియా సండే ఆన్ సైకిల్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని క్రీడా పాఠశాల మైదానం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి అని నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని స్పోర్ట్స్ అధికారి రాజేష్, స్థానిక క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా సైకిల్ దినోత్సవం జరుపుకోవడం యొక్క ప్రాముఖ్యతను, సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక దృఢత్వం లభిస్తుందని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వారు పేర్కొన్నారు.కట్టర్ భీమ్‌రావు, ఖేలో ఇండియా కోచ్ కదతల రాకేష్, శ్రీకాంత్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి వాయిదా



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. తిరిగి జూన్ 9 నుండి ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బిజెఎల్‌పి నేత



**ప్రజాపక్షం/సోన్ :**మండలంలోని పాక్ పట్ల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు.రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని,తడిసిన ధాన్యంను సైతం ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు.కొనుగోలు ప్రక్రియలో జాప్యంపై ఆరా తీశారు.తప్ప,మ్యాచర్ పేరుతో రైతులను మోసగిస్తే స హించే ప్రసక్తే లేదన్నారు.రైతులను దోపిడి చేసే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు.మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు,,మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలకే ప్రాధాన్యత...
# వరి పంటకు కోసమెరుపు



### పంటలకు మద్దతు ధరలు పెంచిన కేంద్రం



**ప్రజాపక్షం / నందిపేట్ ;**కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లో 14 పంటలకు మద్దతు ధర పెంచింది. ఇందులో ప్రధాన వరి పంటకు కొసమెరుపుగా పెంచి, ఆరుతడి పంటలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. జిల్లాలో 5.36 లక్షల ఎకరాల్లో వరి సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు పండిస్తున్నారు. అందుకే ప్రకటించిన మద్దతు ధరలలో వరి పంటకు కేవలం క్వింటాలుకు రూ. 69 లే పెంచింది. ఇతర పంటలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. జొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, సోయాబిన్, కంది, కుసుమ, మొక్కజొన్న, పత్తి పంటలకు భారీగా మద్దతు ధర పెంచింది. రెండో ప్రాధాన్యత పంటగా మొక్కజొన్నకు 175 రూపాయలు, సోయాబిన్‌కు 436 రూపాయలు, పత్తికి రూ. 689 పెంచి రైతులను ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా నూనె, పప్పు దినుసుల కొరత వల్ల దిగుమతి చేసుకుంటున్నాము. వీటిని ప్రోత్సహించేందుకు మద్దతు ధర భారీగా పెంచింది. కందులు 450, మినుములు 400, పెసరులు 86 రూపాయలు పెంచి దేశంలో రైతులను ఉత్సాహపరిచింది. నూనె గింజలు పొద్దుతిరుగుడుకు 441 కుసుమలకు 579 రూపాయలు పెంచడం చూస్తే ఆరుతడి పంటలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతులను రూటు మార్చింది. ఎలాగైనా వరి ప్రాధాన్యత తగ్గించి, ఆరుతడి పంటల వై పు మళ్లించేందుకు సన్నాహాలు చేసింది. రైతులు ఎటువై పు మళ్లుతారో చూడాలి.. ఒక్కందుకు మంచి నిర్ణయ మే...

**ఆగిన వర్షాలు.. సాగుతున్న ఖరీఫ్ పనులు**

నైరుతి ఋతుపవనాల వల్ల, తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. శనివారం నుండి వర్షాలు పడడం ఆగిపోయాయి. దీంతో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. రైతులు నారుమళ్లు తయారుచేసుకొని విత్తనాలు వేయడంలో మునిగిపోయారు. మెట్ట పంటలు మొక్కజొన్న, సోయాబీన్ విత్తడం, పసుపు పంట వేసిన రైతులు కలుపుమొక్కలు, గుంటకు కొట్టడంలో మరికొందరు బిజీగా ఉన్నారు. కొందరు ట్రాక్టర్లతో దుక్కులు దున్నడం, పంట భూములు చదును చేయడంలో శ్రద్ధ కనబరుస్తున్నారు. మిరుగు పండగ వచ్చే వరకు బోరు బావుల వద్ద, చెరువుల కింద నారు పోసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పనులు చక చకా సాగుతున్నాయి.

## అవతరణ దినోత్సవ వేడుకలకు సిద్ధం
### ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:**మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జూన్ 2వ తేదీ సోమవారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను అదనపు ఎస్పిమహేందర్, ఆర్‌డిఒ రమాదేవి,డిఎస్‌పి ప్రసన్నకుమార్, కలెక్టరేట్ ఎఒయూనస్, సంబంధిత ఇతర అధికారులు సిబ్బందితో కలిసి ఆదివారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జెండా ఆవిష్కరణ , ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రసంగం, శకటాల ప్రదర్శన, ప్రముఖులు, మీడియా, అతిథుల కోసం ఏర్పాటు చేసే సీటింగ్ గ్యాలరీ ప్రాంతాన్ని పరిశీలించారు. డయాస్, అలంకరణ, మైక్, స్పీకర్స్, తాగునీరు, తదితరాలపై పలు సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖ ద్వారా సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసుల గౌరవ వందనం, బ్యాండ్, బందోబస్తుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకలు అట్టహాసంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట సూపర్డెంట్లు, ఇతర సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ప్రజావాణి రద్దు
### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టరేట్ లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## హామీల అమలులో... సిఎం విఫలం
### మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ధ్వజం



**ప్రజాపక్షం/గజ్వేల్:**హామీల అమలులో సిఎం రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలం కాగా, గత ప్రభుత్వ పథకాలకు కోతలు పెడుతున్నట్లు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విమర్శించారు. వర్గల్ మండలం తునికి మక్తా గ్రామానికి చెందిన మృతుడు కనకయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ్ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వేలూరి వెంకట్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు సంతోష వెంకటేష్‌తో కలసి రూ.5 లక్ష ల చెక్కు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభ ఘనంగా జరిగినప్పటికీ దురదృష్టవశాత్తు కనకయ్య మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కనకయ్య పిల్లలు ఆన్విక, శాన్విక లను రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించడంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలకు భీమా సౌకర్యం కల్పించగా, ప్రతి ఒక్కరిని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి దొంగ కేసులు, దొంగ మాటలతో పబ్బం గడుపుకుంటుండగా, పంట రుణమాఫీ వంటి పథకాలు అటకెక్కినట్లు విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రులను గాలికి వదిలేయగా, జహీరాబాద్ ఆసుపత్రిలో సెల్ ఫోన్ లైటు తో చికిత్స చేయడం సిగ్గుచేటని నిలదీశారు. గజ్వేల్‌లో రూ. 30 కోట్ల వ్యయంతో వంద పడకల మాతా శిశు ఆసుపత్రి ప్రారంభించగా, విని యో గంలోకి తేవడంలో ప్రభుత్వం వి ఫలం చెందిందని ఆరోపించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ,జెడ్పిటిసి , ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీలతో రైతన్నలను దోచుకుంటున్న మార్వాడీ దళారీ



**ప్రజాపక్షం/చెన్నూరు :**చెన్నూరు పట్టణానికి చెందిన ఓ మార్వాడీ వ్యాపారి అధిక వడ్డీలతో అన్నదాతలను జలగలా పట్టి వారి కష్టాన్ని దోచుకుంటున్నట్లు స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతన్నలనే లక్ష్యంగా చేసుకొని వారి పట్టాపాసు పుస్తకాలు, బంగారం వంటి విలువైన వస్తువులను తన వద్ద ఉంచుకొని అధిక వడ్డీలకు రుణాలు ఇవ్వడమే కాకుండా, రైతులు పండించిన పంటను సైతం అతని వద్దనే అమ్మాలనే ఒప్పందం అన్నదాతలతో కుదుర్చుకుంటాడనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

గతంలో చెన్నూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పని చేసిన అనుభవంతో అధికారులను అలవోకగా చూసుకుంటూ ఏకంగా రైతుల కళ్లాల నుంచే ధాన్యాన్ని తన వాహనంలో నింపుకొని వస్తాడని, అతని ఆగడాలను గురించి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు బ్యాంకుల్లో పంట రుణాలు పొంది, వాటిని పునరుద్ధరించే క్రమంలో తిరిగి చెల్లించే స్థోమత లేని రైతుల వివరాలు బ్యాంకు సిబ్బంది ద్వారా సేకరించి, రైతులు బ్యాంకుకు చెల్లించాల్సిన పైకాన్ని తాను చెల్లిస్తానని నమ్మబలుకుతాడని అంటున్నారు. వడ్డీ వ్యాపారం, దళారీ దందాలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా నిర్వహిస్తున్నాడని, ఇటీవలే పట్టణంలోని శనిగకుంట మత్తడి పేల్చివేతలో కీలకంగా వ్యవహరించి జైలుకు వెళ్ళి వచ్చినప్పటికీ అతని దందాలో మార్పు లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలను అధిక వడ్డీలతో వారి పంటలను, కష్టాన్ని నిలువు దోపిడీ చేస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, దళారీ మార్వాడీకి కొమ్ము కాస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి**

బడికెల మధునయ్య, సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు

దేశానికి అన్నం పెట్టే అన్నదాతల కష్టాన్ని అధిక వడ్డీల రూపంలో దోచుకోవడం దారుణం. ఇప్పటికైనా అధిక వడ్డీలతో అన్నదాతలను దోచుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు బడికెల మధునయ్య డిమాండ్ చేశారు.

## పోడు భూముల్లోనే ఉంటూ రైతుల నిరసన
### భూమి కోసం బతుకుపోరాటం..
### మూడవరోజూ రైతుల నిరసన



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్:**మండలంలోని జైహిండ్‌పూర్ గ్రామ శివారులో సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీశాఖ మొక్కలు నాటేందుకు ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం రెండోరోజుకు చేరింది. ఇది కేవలం భూమి కోసం పోరాటం కాదు మా బతుకు కోసం పోరాటం అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోడి భూముల్లో మేము తాతముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్నాం. వర్షాధారంగా కష్టపడి పండిన పంటలే మా పిల్లల చదువు, కుటుంబ పోషణకి ఆధారం. కానీ ప్రతి ఏడాది వర్షాకాలం మొదలైన వెంటనే అటవీశాఖ అధికారులు వచ్చి, ఈ భూములపై తమ హక్కులున్నట్టు చెబుతూ మొక్కలు నాటుతున్నారు. అధికారులు మొక్కలు నాటడం వల్ల మేం సాగు చేసే అవకాశం కోల్పోతున్నాం. పంట పాడవుతుంది. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి అని వాపోయారు. ఇది మాకు కేవలం భూమి కాదు, ఇది మా బతుకు. ఇక్కడ పుట్టి పెరిగిన మాకు నేటి ప్రభుత్వం న్యాయం చేయకపోతే మేమెవరిని ఆశ్రయించాలి? పోడు భూములు పట్టాదారులుగా మాకు గుర్తింపు ఇవ్వాలని ఎన్నోసార్లు వినతులు ఇచ్చాం. కానీ ప్రతిసారీ అధికారులదే పైచేయి అవుతోంది. స్థానిక అటవీశాఖ సిబ్బంది మాతో మాట్లాడకుండా బలవంతంగా పనులు చేస్తుండటం మనిషితనానికి మచ్చుతునక కూడా లేదని ఆరోపించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని తక్షణం నిలిపివేయాలని, పోడు భూములపై సాగు హక్కును రద్దు చేయాలన్న ఆలోచన వదిలేయాలి. ప్రాణాలు పోయినా పంట చేలను వదిలేది లేదని హెచ్చరించారు. నిరసనలో మహిళలు, వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా అక్కడికి చేరుకుని రైతుల ఆక్రోశాన్ని విన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని జిల్లా స్థాయికి విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు హెచ్చరించారు. నిరసన తెలుపుతున్న రైతులకు గ్రామస్థుల సంఘీభావంచ వ్యక్తం చేశారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న వాస్తవం పరిగణనలోకి తీసుకుని పోడు భూములకు హక్కు గుర్తింపు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నాణ్యమైన విత్తనం... లాభసాటి వ్యవసాయానికి సోపానం
### ప్రధాన శాస్త్రవేత్త డా.రాంప్రసాద్

**ప్రజాపక్షం/ముధోల్ :**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం,వ్యవసాయ శాఖ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఈ సంవత్సరం ''నాణ్యమైన విత్తనంరైతున్నకు నేస్తం'' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని బి.రాంప్రసాద్ ప్రధాన శాస్త్రవేత్త వ్యవసాయ పరిశోధన స్థానం (ఆదిలాబాద్) ఒక ప్రకటన ద్వారా తెలిపారు.గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిక చేసిన రైతులకు కొద్ది మొత్తంలో పంపిణీ చేయబోతున్నామని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన స్థానాల ఉత్పత్తి చేయబడిన నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేయబడిన ముగ్గురు నుండి ఐదుగురు అభ్యుదయ రైతులకు అందజేయబడుతుందన్నారు.ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గదర్శంలో జూన్ 2వ తేదీన ఈ వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించబడుతుందని తెలిపారు.రైతులకు విత్తనోత్పత్తిపై ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు సూచనలు ఇవ్వడం ద్వారా రానున్న రెండు మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామాన విత్తన స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం విత్తన భద్రతలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నదే ముఖ్య ఆశయమని తెలిపారు.

## బోధన్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ




**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా ఆదివారం మనం సైతం దేశం కోసం నినాదంతో సిటిజెన్స్‌ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మారుతి మందిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలు చేత పట్టుకొని జై భారత్, వందే మాతరం నినాదాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ జవాన్‌లను కొనియాడారు. అనంతరం పహాల్గావ్ ఉగ్రదాడిలో అమరులైన వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్ చారి, శ్రీనివాస్ రావు, ప్రవీణ మహారాజ్, గోపి, సుదర్శన్, గంగాధర్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్లు బురదమయం.. ప్రయాణికులకు తప్పని తిప్పలు!

**ప్రజాపక్షం/లోకేశ్వరం:**మండలంలోని అవర్గ నుండి మన్మద్ గ్రామ రహదారి దాదాపు మూడు కిలోమీటర్లు రోడ్డు బురద మాయం ప్రయాణికులకు రైతులకు ఇక్కట్లు పడుతున్నారని.ఇరు గ్రామాల ప్రజలు అలాగే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పలువురు మాట్లాడుతూ.అవర్గా నుండి మన్మద్ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే రానున్న వర్షాకాలం రోజుల్లో ప్రయాణికులకు ఇక్కట్లు కలగకుండా నూతన డాంబర్ రోడ్డు వేయిస్తే బాగుంటుందని అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు తెలియజేశారు.



## విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ చాటడం అభినందనీయం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:**విద్యా ద్వారానే భవిష్యత్ తరాలకు పునాది వేసే అవకాశముంటుందని అలా ప్రోత్సహించటం కోసం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయటం అభిందనీయమని ఎంపీ లక్ష్మ ణ్ అన్నారు. ఆదివారం తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్ష నర్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు లక్ష్మ ణ్ హాజరై మాట్లాడారు. మున్నూరుకాపు విద్యార్థులు చదువులో ముందుండి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్‌లలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి పురస్కారాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో బాలశ్రీనివాస్, సురేందర్, రత్నాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అమెరికాలో జరిగే త్రీడి ఆర్ట్ ఫెస్టివల్‌కు శివరామకృష్ణ



**ప్రజాపక్షం/ముత్తారం/ మంథని :** మంథని పట్టణానికి చెందిన సింగారపు శివరామకృష్ణకు అరుదైన ఆహ్వానం అందింది. అమెరికాలో మ్యాపేల్ గ్రోవ్ సిటీలో జూన్ 8వ తేదీ, 9న జరిగే స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్లో పాల్గొనాలని ఆర్ట్ ఫెస్టివల్ ఆర్గనైజర్ కీరా మెయిల్ ద్వారా తెలిపారు. త్రీడి పెయింటింగ్ వేయడంలో కృష్ణ సిద్ధహస్తుడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గీసిన చిత్రాలకు మంచి గుర్తింపు లభించింది. దేశంతరపున గతంలోను ప్రస్తుతం కృష్ణ ఒక్కడే పాల్గొనడం మరో విశేషం.

## బండి సంజయ్ మాటలు అర్ధరహితం

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాటలు అర్ధరహితంగా ఉన్నాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్ధంపై వాస్తవాలు మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేశ ద్రోహి అనడాన్ని ఇందిరాగాంధీని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆనాడు పాకిస్తాన్ అరాచకాలు చూసి బంగ్లాదేశ్ ప్రజలకు విముక్తి కల్పించిన ఘనత ఉక్కు మహిళ ఇందిరాగాంధీకే దక్కుతుందని, ఇప్పటిలాగా అమెరికా జోక్యం చేసుకుని యుద్ధం ఆపాలని చూస్తే ఇందిరాగాంధీ వినలేదని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ పోరాటపటిమను మెచ్చుకుని బిజెపి వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ దుర్గామాతగా అభివర్ణించారనే విషయాన్ని బండి సంజయ్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. పది సంవత్సరాలు బిఆర్‌ఎస్‌తో అంటకాగి పార్లమెంటులో అన్ని బిల్లులకు బిఆర్‌ఎస్ ఎంపిల మద్దతు తీసుకుని వారి అవినీతిలో భాగస్వాములైన కాంగ్రెస్ ఇప్పుడు బిఆర్‌ఎస్‌కు తమకు ముడిపెట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వర్షాలు పదిహేను రోజులు ముందు వచ్చినప్పటికీ రైతుకు ఎటువంటి నష్టం జరగకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు పూర్తి చేసినందుకు ప్రశంసించాల్సింది పోయి విమర్శించడమేంటని మండిపడ్డారు. పదేళ్లు బిఆర్‌ఎస్, బిజెపి కలిసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినప్పటికీ చిత్తశుద్ధితో ఆరు గ్యారంటీలను అమలు పరుస్తున్నామని అన్నారు. రాజీవ్ యువవికాసం ద్వారా స్వయం ఉపాధి కల్పన కల్పించడాన్ని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడాన్ని చూసి తట్టుకోలేక ఉనికి కోసం విమర్శిస్తున్నారన్నారు. సమావేశంలో ఎండి తాజ్, శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, మ్యాకల నర్సయ్య, ఎట్టం వేణు, మేరాజ్, మాసుం ఖాన్, అంజయ్య, నదీం తదితరులున్నారు.

## అందాల భామలను చూసేందుకు ఐదు సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి

### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రాష్ట్ర రాజధానిలో రూ. 2 వందల కోట్ల ఖర్చుతో నిర్వహించిన అందాల భామల పోటీలకు హాజరైన సిఎం రేవంత్ రెడ్డి వర్షానికి ధాన్యం తడిసి ఇబ్బందుల్లో ఉన్న రైతులను పరామర్శించేందుకు సమయం దొరకటం లేదని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లోని తిగుల్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ, పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌రావు సిఎం రేవంత్‌రెడ్డిపై పలు విమర్శలు గుప్పించారు. ఇంగ్లాండు నుండి అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన యువతిపై సిఎం రేవంత్‌రెడ్డి చుట్టు ఉండే అనుచర గణం ఆమేపై అనుచితంగా ప్రవర్తించడంతో పోటీల్లో పాల్గొనకుండానే వెనుదిరిగిపోయిందన్నారు. దింతో రాష్ట్ర ప్రతిష్టను రేవంత్ సర్కార్ బజారుకిడ్చిందని ఆరోపించారు. విందులు, వినోదాల కోసమే రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించారని, ఆ పోటీలకు సిఎం అనుచర గణమే పాల్గొని సతృప్తి పడ్డారని నఅన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడవకముందే పాలనపై రాష్ట్ర ప్రజలు విసుగు చేందుతున్నారని అన్నారు. కాంగ్రెసు ప్రభుత్వంలో అభివృద్ధిలో మార్పు కన్పిస్తుదన్నకున్న ప్రజలకు తెలంగాణ అస్థిత్వం పరిక్షించడంలో రేవంత్ సర్కార్ విఫలం చెందిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ తల్లి రూపం ఉద్యమ సందర్భంలో తెలంగాణ ప్రజలలో ఎతో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్పు, తెలంగాణ రాజ ముద్ర మార్పులాంటివి మార్పు చేసినంత మాత్రాన కెసిఆర్ ముద్రను ప్రజల నుండి తొలగించలేరని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారని దుయ్యాబట్టారు. రేవంత్‌రెడ్డి రోజుకో వేశం వేసి పూటకో మాట మార్చి యాదాద్రి లక్ష్మినర్సింహా స్వామి మీద ప్రమాణం చేసి మాట తప్పిందని ఆరోపించారు. 15 వేలు రైతు బరోసా ఇస్తానని హామీ ఇచ్చి 6 వేల చోప్పున 4 ఎకరాలకు వేసి చేతులు దులుపుకున్నాడని అన్నారు. కాంగ్రెసు ప్రభుత్వం మాటలు ఎక్కువ, పని తక్కువని విమర్శించారు. రేవంత్ తుగ్లక్ పాలనతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఎవరు ముందుకు వస్తాలేరని అన్నారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీని వీడి బిఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎంపిపి అధ్యక్షులు బాలేషంగౌడ్‌ను పార్టీ కండువా కప్పి హరీష్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పదవి విరమణ పొందినప్పటికి గత పది సంవత్సరాలుగా స్థానిక పాఠశాలలో భోదన చేస్తున్న ఉపాధ్యాయులు బాల్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధకృష్ణశర్మ, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి,భూమయ్య, రంగారెడ్డి, ఎల్లయ్య, కోటయ్య, మధుసూధనచారి, శ్రీనివాస్‌రెడ్డి, వేంకట్‌గౌడ్,కరుణాకర్,యాదవరెడ్డి, ఉపేందర్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఎమ్‌డబ్ల్యూ కారు కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామంలో తనకు బిఎమ్‌డబ్యూ కారు కొనియాలేదని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్లడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మకనకయ్య కుమారుడు బొమ్మ జాని (21) కొద్ది రోజులుగా తనకు బిఎమ్‌ధబ్యూ కారు కావాలని లేక పోతే తాను చని పోతానని తన తల్లిదండ్రులతో తరుచు గొడవ పడే వాడని తెలిపారు. ఈ క్రమంలో మే 30న సిద్దిపేట కారు షోరూంకు వెల్లి మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు కొనిస్తామని తల్లిదండ్రులు సర్ది చెప్పినట్లు చెప్పారు. తనకు ఆ కారు నచ్చక పోవడంతో మనస్థాపం చెందిన ఆ యువకుడు అదే రోజు వారి వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకోగ, కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సా నిమిత్తం అర్‌విఎం ఆసుపత్రికి తరలించగా అక్కడా చికిత్సా పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లాలో వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చేస్తున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 2న రాష్ట్రం ఆవిర్భవించి 11సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జూన్ 2న జరిగే అవతరణ దినోత్సవ వేడుకలకు మహిళ కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద ముఖ్యఅతిథిగా హాజరు అవుతారని, ఉదయం 9.45 గంటలకు ముఖ్య అతిథి కలెక్టరేట్‌కు చేరుకుంటారని, ఉదయం 9.50 గంటలకు గౌరవ వందనం, ఉదయం 9.51నుంచి 9.58 వరకు అమరవీరులకు నివాళి ఉంటుందని అన్నారు. వేడుకలలో ఉదయం 10గంటలకు జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలపన, తెలంగాణ జీతాలపన కార్యక్రమాలు ఉంటాయని , ఉదయం 10.11 నుంచి 10.15 వరకు పరేడ్ ఉంటుందని, అనంతరం ముఖ్య అతిథి తన సందేశం అందిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, సౌండ్ సిస్టం, విద్యుత్ సరఫరా, దయాజ్, టెంట్,బ్యారికేడ్లు వంటి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి వేణు, డిసిపి కరుణాకర్, ఎసిపి గజ్జి కృష్ణ, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## కోడెల రక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం

### జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ తిప్పాపూర్‌లోనే గోశాలలో ఉన్న కోడెల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామని, ఈ మెడికల్ క్యాంపు కోడెలు పూర్తి ఆరోగ్యంగా అయ్యేవరకు నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాలు అనారోగ్య పరిస్థితుల కారణంగా తిప్పాపూర్‌లోని గోశాలలో మొదట కోడెలు మరణించగా జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమై 5 వెటర్నరీ డాక్టర్లతో కూడిన 12 మంది వైద్య బృందం ఏర్పాటు చేసి గోశాలలోని పశువులను పరిశీలించడం జరిగింది. రెండవ రోజు అనారోగ్య కారణంతో మరో 5 కోడెలు మరణించాయి. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కోడెల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి ఎల్.ఎస్.డి వ్యాక్సిన్ 500 పశువులకు వేసామని తెలిపారు. అనారోగ్యం పాలైన 20 పశువులను ప్రత్యేకంగా చికిత్స అందించి వాటిలో 16 పశువుల ప్రాణాలు రక్షించామని, మరో 4 కోడెలు మరణించాయని అన్నారు. గోశాలలో కోడెలు అనారోగ్య పరిస్థితులతో మరణించాయని, మిగిలిన పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని ఈ మెడికల్ క్యాంపు కోడెలు పూర్తి ఆరోగ్యంగా అయ్యేవరకు నిర్వహిస్తామని, 300 కోడెలను స్థానిక రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను రాజన్న స్వామి భక్తులు నమ్మవద్దని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్




## ముఖ్యమంత్రిని కలిసిన ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం / వేములవాడ టౌన్:** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి ఎంతో ప్రీతికరమైన రాజన్న కోడెల సంరక్షణ కోసం అత్యాధునిక వసతులతో, సువిశాలమైన నూతన గోశాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలనీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల ఖతార్ పర్యటనలో భాగంగా తెలంగాణ గల్ఫ్ సమితి ఖతార్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని రాష్ట్రనికి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల 200 కోట్లతో వేములవాడ నియోజకవర్గనికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరి చేయడం పట్ల, ఇటీవల ఎఐసిసి ప్రకటించిన కమిటీల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ సభ్యులుగా నియమించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృత్ణతలు తెలపడం తెలిపారు. ఖతార్ పర్యటన వివరాలను ముఖ్యమంత్రికి పూర్తిస్థాయిలో వివరించారు. రాజన్న ఆలయంలో జరగబోవు అభివృద్ధి, గోశాలలో జరుగుతున్న పలు అంశాలపై ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, అత్యాధునిక వసతులతో సువిశాలమైన స్థలంలో నూతన గోశాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని వారు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా,కోడెలు అనారోగ్య బారిన పడకుండా ప్రభుత్వం తరుపున,ఆలయం తరుపున తగు జాగ్రత్తలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.

## పెద్దపల్లి డిసిపి కరుణాకర్‌కు పోలీస్ సేవా పథకం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ సేవ పథకాలను ప్రకటిస్తూ కేంద్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పెద్దపల్లి డిసిపి పి. కరుణాకర్ కు పోలీసు సేవా పథకం ప్రకటించింది. రామగుండం పోలీ స్ కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తున్న మరికొంత మంది పోలీసులను సైతం వివిధ పథకాలకు ఎంపిక చేసింది.

## ప్రజాప్రభుత్వంలో నెరవేరుతున్న పేదోళ్ల సొంతింటి కల

### ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేసిన ప్రణవ్



**ప్రజాపక్షం/జమ్మికుంట:** పదేళ్ల నిరీక్షణ తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పేదలకు పంచుతుంటే వారి నుంచి అనూహ్య స్పందన వస్తుందని, పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణ పరిధిలోని 24, 19, 1, 2వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల పట్టా పంపిణీ కార్యక్రమం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులకు పట్టాలు ఇస్తున్న క్రమంలో వారు కొంత భావోద్వేగానికి లోనయ్యారు. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో ఒక్క ఇంటిని సైతం ఇవ్వలేదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు మాత్రమే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని, మళ్లీ పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందే చేస్తుందని, చేసేదే చెబుతుందన్నారు. సోషల్ మీడియాలో గొప్పలు చెప్పుకునే నాయకులు నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విడతలవారీగా అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పథకాలు అందజేస్తామని, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచితబస్ రవాణాసౌ కర్యం లాంటి సంక్షేమ పథకాలు ప్రజాదరణ పొందాయని అన్నారు. కార్యక్రమంలోజమ్మికుంట పట్టణ,మండల,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పైవేటు పాఠశాలలు విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

### ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించాలని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్ నగర్ నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష(Laksh) ఇంటర్నేషనల్ స్కూల్‌ను స్థానిక నాయకులతో, స్కూల్ యాజమాన్యంతో కలిసి ప్రారంభించిన అ నంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థిని, విద్యార్థులకు చదువులతోపాటు వృత్తి నైపుణ్యం, ఆటల పోటీలలో రాణించే విధంగా విద్యా ప్రమాణాలను పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముస్తాక్ అలీ, డైరెక్టర్ ఆఫ్ సానా, ప్రిన్సిపల్ కొండారెడ్డి, పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం / ధర్మపురి :** తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయి వైకల్యం పొందిన నవ తెలంగాణ పాత్రికేయుడు అక్కనపల్లి బాబు కుమార్‌కు రాష్ట్ర మీడియా అకాడెమి సంక్షేమ పథకం ద్వారా మంజూరు అయిన లక్ష రూపాయల చెక్కును ఐజెయు రాష్ట్ర కమిటీ సభ్యులు జె. సురేందర్ కుమార్‌తో కలిసి విప్ లక్ష్మణ్ కుమార్ బాధిత విలేఖరికి అందజేశారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వర్కింగ్ జర్నలిస్టులందరికి త్వరలోనే అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందించడంతోపాటు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇక గత 10 ఏళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమానికి చేసిందేమి లేదన్నారు. ధర్మపురిలో డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదు. శాశ్వత త్రాగు నీటి సమస్య తీర్చలేదు. క్షేత్రాభివృద్ధికి రూ.లు 500 కోట్లు ఇస్తానన్న కెసిఆర్ 5పైసలు ఇవ్వలేదని విమర్శించారు. జాగృతి పునః నిర్మాణం అంటూ హడావుడి చేస్తున్న కవిత పరిధి దాటి మాట్లాడకపోవడం మంచిదని హితవు చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఉచిత కరెంట్ రైతు రుణమాఫీ, రూ.లు 500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణంతో పాటు ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పథకం అమలు, నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ జరిపి రాష్ట్రాన్ని సంక్షేమ బాట పయనింపజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. దినేష్, బుర్ర రాములు గౌడ్, జక్కు రవీందర్, కుంట సుధాకర్, జె. సుముఖ్, ఎం.డి. రఫియోద్దీన్, ఎస్. గణేష్, అప్పం తిరుపతి, సీపతి సత్యం, సాయికిరణ్, పోచయ్య, విజయ్ బాబు పాల్గొన్నారు.

## శంకుస్థాపన చేసి రెండు నెలలు.. ప్రారంభం ఎంతకాలానికో..?

### సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్



**ప్రజాపక్షం/ముత్తారంపెద్దపల్లి ప్రతినిధి :** మంథని నియోజక వర్గంలోని ముత్తారం మండలం ఓడేడు నుండి గంగపురి వరకు ఉన్న ప్రధాన రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా ఉం దని ఈ రోడ్డు మీద ప్రయాణం చేసే వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు నిర్మాణం కోసం రెండు నెలల క్రితం రాష్ట్ర మం త్రి, స్థానిక ఎమ్మెల్యే దుదిల్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసినా, రోడ్డు పనులు కాంట్రాక్టర్ ప్రారంభించక పోవడం విచారకరమని, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని సిపిఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడేడ్ నుంచి కేషనపల్లి మీదుగా గంగపురి వరకు ఉన్న ప్రధాన రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు పై నిత్యం వాహానాలు, బస్సులు, లారీలు వెళుతుంటాయని, ఇందులో ప్రయాణం చేసే వారు గుంతల రోడ్డు వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఇట్టి రోడ్డు పై ఎర్ర మొరం పోయడం వల్ల వాహానాల దుమ్ము ధూళి తో రోడ్డు ప్రక్కన ఉన్న గ్రామాల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రక్కన ఉన్న ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, వివిధ రకాల దుకాణాల్లో ఎర్ర మ ట్టి దుమ్ము, ధూళి పోవడం వల్ల షాప్ యజమానులు అనేక అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు. వర్షం వస్తె ఈ రోడ్డు అంతా బురదగా గుంతలు పడడం వల్ల ప్రయా ణం చేసే వారు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.ఈ రోడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసి రెండు నెలలు గడిచినా ఇంత వరకు రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించడంలో అధికారుల నిర్లక్ష్యమా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి, ప్రజలకు, వాహానదారులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అంగరంగ వైభవంగా పంచాదశ వార్షికోత్సవ వేడుకలు

### హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వాతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ పట్టణంలో మహిమాన్విత శ్రీ మహాశక్తి దేవాలయ పంచాదశ (15వ) వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కన్నుల పండుగగా, అంగరంగ వైభవంగా జరిగాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వార్షికోత్సవ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి కరకమలములచే ఉదయం శ్రీలక్ష్మి గణపతి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి , శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు పంచామృతాభిషేకం చేశారు. అర్చకులు స్వస్తి పుణ్య హవచనము, గణపతి పూజ, అఖండ దీపారాధానము, సర్వతో భద్ర మండలం, లక్ష్మీ గణపతి , రుద్ర సహిత చండీ హోమం, పూర్ణాహుతి మంత్ర పుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ వేడుకలకు హాజరైన సమస్త భక్తులను ఉద్దేశించి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి మాట్లాడుతూ సనాతన ధర్మం ఒక సమగ్రమైన జీవన విధానమని, దీనిలో సత్యం, ధర్మం, సేవ, త్యాగం, ప్రేమ వంటి సద్గుణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం ద్వారా, మనం మంచి జీవితాన్ని గడపగలుగుతామన్నారు. సమాజానికి ఉపయోగపడతామని శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి అన్నారు. సనాతన ధర్మాన్ని ఆచరించడం అంటే మనం ప్రతిరోజు సద్గుణాలను మన జీవితంలోకి తీసుకురావడం లాంటిదన్నారు. మనం సత్యం మాట్లాడాలని, ధర్మం పాటించాలని, సమాజానికి సేవ, త్యాగం చేస్తూ ప్రేమతో ఉండాలన్నారు. సనాతన ధర్మం గొప్పతనం ఏమిటంటే అది ఒక శాశ్వతమైన సత్యాన్ని ప్రతిబింబించే ధర్మమన్నారు. సనాతన ధర్మం అన్ని మతాలు, సాంప్రదాయాల కంటే గొప్పదని పేర్కొన్నారు. సనాతన ధర్మం కేవలం నమ్మకం కాదు ఒక జీవన విధానమని తెలిపారు. నేటితరం తల్లిదండ్రులను గౌరవించాలని, దేవాలయాలను సందర్శించాలని, సన్మార్గంలో నడవాలని, ధర్మాన్ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మాజీ మేయర్ వై.సునీల్‌రావు, మాజీ కార్పోరేటర్ బండ సుమ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.






# టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన మల్లు రవి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా పార్లమెంట్ సభ్యులుగా మల్లు రవి బాధ్యతలను స్వీకరించారు. గాంధీ భవన్‌లో ఆదివారం ప్రస్తుత చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి మల్లు రవికి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి భారీ కాన్వాయ్‌తో మల్లు రవి గాంధీభవన్‌కు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎంఎల్ఎలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వంశీ కృష్ణ, షాద్ నగర్ శంకరయ్య, నాగర్ కర్నూల్ రాజేష్ రెడ్డి, వనపర్తి మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మక్తల్ శ్రీహరి ముదిరాజ్, మలరెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎంపివి.హనుమంతరావు, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, సిడబ్ల్యూసి సభ్యులు వంశీచంద్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు జేరిపాటి జైపాల్, కల్వ సుజాత, నాయుడు సత్యనారాయణ, ఒడిదుల్లా కొత్వాల్, సరితా తిరుపతయ్య, వజ్రేష్ యాదవ్, పరమేష్ రెడ్డి, భూపతి రెడ్డి, కుమార్ రావ్, ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎఐసిసి ఇంఛార్జీని కలిసిన మల్లు రవి**

ఎఐసిసి ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్‌లను టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీ భవన్‌లో టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన మల్లు రవి వారి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.















































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com